RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam




# ఉదయం




Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

సంపుటి : 12 | సంచిక : 252 | ఆదిలాబాద్ | శనివారం, మార్చి 01, 2025 | VOODAYAM Telugu Daily | వెల : రూ. 3.00 | పేజీలు : 12





# దేశ రక్షణ బాధ్యత యువతీ యువకులదే..

- భారత్‌ను రక్షించటంలో హైదరాబాద్ ది క్రియాశీలక పాత్ర
- విజ్ఞాన్ వైభవ్-2025 కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : దేశ రక్షణ బాధ్యత యువతీ యువకులదేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. భారత దేశాన్ని రక్షించటంలో తెలంగాణ, హైదరాబాద్ నగరం క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు.

శుక్రవారం హైదరాబాద్ లోని గచ్చీబౌలీలో విజ్ఞాన్ వైభవ్ - 2025 కార్యక్రమంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీడీఎల్, డీఆర్ డీఓ, మిదాని, హెచ్ఏఎల్ వంటి దేశ రక్షణ కోసం రాకెట్లు, మిస్సైల్స్ తయారు చేస్తున్నాయి. ఇందుకు సంబంధించి హైదరాబాద్ నగరం, హైదరాబాద్ చుట్టూ పరిశ్రమలు ఉన్నాయి. దేశాన్ని రక్షించడంలో మన హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రం అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. లక్షలాది మంది విద్యార్థిని విద్యార్థులకు దేశభక్తి , దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యతపై వారిలో స్ఫూర్తిని, అవగాహన కల్పించడానికి ఈ ప్రత్యేకమైన ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేసుకున్నాం.

తెలంగాణ రాష్ట్రం నుండి ప్రతి ఏటా లక్షకు పైగా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ చదివి, అమెరికాకు వెళుతున్నారు. వారిలో దేశభక్తితో, దేశ రక్షణ ప్రాధాన్యతనలు వివరించడానికి ఈ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నాం. తెలంగాణ నుంచి కేవలం ఐటీ ప్రొఫెషనల్స్ మాత్రమే అమెరికాకు వెళ్లకుండా, దేశ రక్షణ రంగానికి అవసరమైన సమర్ధవంతమైన ఇంజినీర్లు అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. దేశ రక్షణ కోసం అవసరమైన ఇంజినీర్లను తయారుచేయడం మరింత ముఖ్యం. స్వాతంత్ర్యానికి ముందు కూడా, తర్వాత కూడా హైదరాబాద్‌లో బీడీఎల్, హెచ్‌ఏఎల్, మిదాని, డీఆర్‌డీఓ వంటి అనేక సంస్థలు దేశ రక్షణ కోసం ఉత్పత్తి రంగంలో విశేషంగా పని చేస్తున్నాయి. దేశ రక్షణ రంగానికి హైదరాబాద్, బెంగళూరు ముఖ్య కేంద్రాలుగా ఉన్నాయి. గతంలో మీతో చర్చించినట్టుగా హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ గా ప్రకటించాలి. తద్వారా భారీగా పెట్టుబడులు వస్తాయి. రాకెట్ తయారీ సహా ఆకాశ మార్గం (స్కై రూట్) వంటి స్టార్టప్‌లు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. అందుకోసం కేంద్ర ప్రభుత్వ సహకారం, మద్దతు అవసరమన్నారు. రక్షణ రంగంలో భారతదేశాన్ని నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లేందుకు తాము ప్రయత్నిస్తామని సీఎం ఈ సందర్భంగా భరోసానిచ్చారు.



## మూడు ఎకరాల వరకు రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయండి

- లబ్ధిదారుల వివరాలు గ్రామాల్లో ప్రదర్శించండి
- ఆర్థిక, వ్యవసాయ శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం

హైదరాబాద్ : రైతు భరోసా పథకంలో భాగంగా మూడు ఎకరాల వరకు లబ్ధిదారులకు వెంటనే నిధులు మంజూరు చేయండి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు.

శుక్రవారం ఉదయం ప్రజాభవన్లో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామ కృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు, డైరెక్టర్ గోపి లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందిన రైతుల వివరాలను గ్రామాల్లో ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల పేర్లు అందరికీ కనిపించేలా, గ్రామాల ప్రధాన కూడళ్లలో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు.

## ఈశా ఫౌండేషన్‌కు సుప్రీంలో ఉపశమనం

న్యూఢిల్లీ : వెల్లియన్‌గిరి కొండ దిగువన సరైన పర్యావరణ అనుమతి లేకుండా భవనాల నిర్మాణంపై జగ్గీ వాసుదేవ్ సారథ్యంలోని ఈశా ఫౌండేషన్‌కు తమిళనాడు కాలుష్య నివారణ బోర్డు (టిఎన్‌పిసిబి) జారీ చేసిన నోటీసులను రద్దు చేసిన మద్రాసు హైకోర్టు ఉత్తర్వులపై జోక్యానికి సుప్రీం కోర్టు శుక్రవారం నిరాకరించింది. కోయంబత్తూరు వెల్లియన్‌గిరి కొండలో నిర్మించిన ఈశా ఫౌండేషన యోగా, ధ్యాన కేంద్రంపై నిర్బంధ చర్య ఏదీ ఉండరాదని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సూర్య కాంత్‌బీ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. కాలుష్య నియంత్రణ బోర్డు జారీ చేసిన పర్యావరణ నిబంధనలు, ఆదేశాలు అన్నిటినీ యోగ, ధ్యాన కేంద్రం పాటిస్తుందని బెంచ్ తెలియజేసింది. యోగ, ధ్యాన కేంద్రాన్ని విస్తరించే పక్షంలో సముచిత ప్రాధికార సంస్థ ముందస్తు అనుమతి తీసుకోనున్నట్లు బెంచ్ తెలిపింది. అయితే, ఈ ఉత్తర్వు అక్రమ నిర్మాణం క్రమబద్ధీకరణకు ఆనవాయితీని సృష్టించబోదని, కేసు విలక్షణ వాస్తవాలు, పరిస్థితుల దృష్ట్యా ఈ ఉత్తర్వు జారీ చేయడమైందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కోయంబత్తూరులో ఈశా ఫౌండేషన్ ఏర్పాటు చేసినవి విద్య కేటగరీ కిందనకు వస్తాయని పేర్కొంటూ హైకోర్టు 2022 డిసెంబర్ 14న టిఎన్‌పిసిబి నోటీసును కొట్టివేసింది. 2021 నవంబర్ 19న బోర్డు జారీ చేసిన నోటీసును హైకోర్టు కొట్టివేసి, ఈశా ఫౌండేషన్ పిటిషన్‌ను అనుమతించింది. ముందస్తు పర్యావరణ అనుమతి లేకుండా వెల్లియన్‌గిరి కొండ దిగువన భవనాల నిర్మాణంపై బోర్డు సంజాయిషీ నోటీస్ జారీ చేసింది.

# మామునూర్ ఎయిర్ పోర్ట్ కి కేంద్రం గ్రీన్ సిగ్నల్

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

వరంగల్ జిల్లా మామునూర్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిని మంజూరీ చేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మామునూర్ ఎయిర్ పోర్ట్ కు అనుమతిని మంజూరీ చేస్తూ కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ కుమార్ జా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ కు లేఖ ద్వారా తెలియజేసినట్లు మంత్రి తెలిపారు. మామునూర్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విమానాశ్రయ ప్రాధికార సంస్థ ( Airport Authority of India ) అభ్యర్థనకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. గత పదేండ్లుగా పెండింగ్ లో ఉన్న NOC అడ్డంకిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జీఎంఆర్ సంస్థ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి, బోర్డులో పెట్టి NOC ఇచ్చేలా చేశారు. దీంతో HAIL తన బోర్డు ఆఫ్ డైరెక్టర్స్



మీటింగ్ ఏర్పాటు చేసుకొని మామునూర్ విమానాశ్రయ అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న 150 కిలోమీటర్ల నిబంధనను సవరిస్తూ %చీూజ% ఇచ్చారు. ఇప్పుడు ఈ %చీూజ% ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదించిందని మంత్రి తెలిపారు. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ కుమార్ జా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ కు లేఖ ద్వారా తెలిపినట్లు మంత్రి వివరించారు. దీంతో మామునూర్ ఎయిర్ పోర్టు నిర్మాణం మరింత వేగంగా ముందుకు సాగుతుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. విమానాశ్రయ ప్రాధికార సంస్థ నోట్ నెం. PLG/501/Warangal /2025/80 తేదీ 03.02.2025 ప్రకారం, తెలంగాణ ప్రభుత్వం 05.12.2024 మరియు 17.11.2024 తేదీలలో పంపిన లేఖలను ప్రస్తావిస్తూ, హైదరాబాదు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' జారీ చేసినట్లు లేఖలో పేర్కొందని తెలిపిన మంత్రి అందుకు సంబంధించిన లేఖను విడుదల చేశారు. అంతేకాదు, మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి కావాల్సిన 253 ఎకరాల అదనపు భూమిని తెలంగాణ ప్రభుత్వం విమానాశ్రయ ప్రాధికార సంస్థ కి అప్పగించేందుకు ఇంతకు ముందే 205 కోట్ల రూపాయలను విడుదల చేసిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎయిర్ పోర్టుకు కావాల్సిన అన్ని అనుమతులు రావడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

అదనపు సమాచారం :

**కేంద్ర ప్రభుత్వం - హైదరాబాదు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం :**

హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మించేటప్పుడు కేంద్రంతో.. హైదరాబాదు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సంస్థ చేసుకున్న ఒప్పందంలోని క్లాజ్ 5.2 లో 25 సంవత్సరాల లోపల, 150 కిలోమీటర్ల పరిధిలో ప్రస్తుతం అందుబాటులో ఉండి అభివృద్ధి చేసేవి మరియు మరో కొత్త దేశీయ/అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుమతించరాదని ఆనాడు HIAL కంద్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. దీంతో ఈ పరిధిలో రాష్ట్రంలో ఇప్పటి వరకు మరో ఎయిర్ పోర్టు నిర్మాణం జరగలేదు. అయితే, రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి అభ్యర్థన మేరకు HAIL తన బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ ఏర్పాటు చేసుకొని మామునూర్ విమానాశ్రయ అభివృద్ధికి అంగీకారం తెలిపింది.



నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద గల ఎస్.ఎల్.బీ.సీ. టన్నెల్ లోపల శుక్రవారం సహాయక చర్యల దృశ్యాలు

## 2న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పర్యటన

తెలంగాణలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పర్యటించనున్నారు. మార్చి 2న రాష్ట్రానికి రానున్న నేపథ్యంలోనే అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపరాష్ట్రపతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-హైదరాబాద్ (ఐఐటీ హైదరాబాద్)ను సందర్శిస్తారని, అక్కడ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో సంభాషిస్తారని సీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరై అదే రోజు న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్తారని వెల్లడించారు. ఇందుకు అన్ని విభాగాల మధ్య సమన్వయంతో పనిచేయాలని, కమ్యూనికేషన్ అంతరాయం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. దీని కోసం భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లు చేయాలని తెలంగాణ పోలీసు శాఖకు సూచించారు. ఉపరాష్ట్రపతి సందర్శించే అన్ని ప్రదేశాల్లో అర్హత కలిగిన వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని రాష్ట్ర వైద్య, విద్యుత్ శాఖ అధికారులకు సీఎస్ శాంతికుమారి సూచించారు.

# ఈ ఏడాది చివరకు ఎఫ్‌టిఎ

న్యూఢిల్లీ : ఈ సంవత్సరాంతానికి ఆశావహ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. రక్షణ, భద్రత, కీలక టెక్నాలజీ రంగాల్లో భారత్, ఇయు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు ఉభయ నేతలు ప్రతిజ్ఞ చేశారు. వాన్ డెర్ లెయెన్‌తో చర్చల అనంతరం మీడియా ప్రకటన విడుదల చేసిన ప్రధాని మోడీ భారత్, ఇయు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని 'సహజమైనది, సేంద్రీయమైనది'గా, ప్రజాస్వామ్య విలువల్లో 'విశ్వాసం'పై, ఉమ్మడి భావనపై ఆధారపడినదిగా అభివర్ణించారు.



ఈ సంవత్సరాంతానికి పరస్పర ప్రయోజనకర ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవలసిందిగా తమ బృందాలను ఆదేశించామని ఆయన తెలియజేశారు. వాణిజ్యం, టారిఫ్‌లపై ట్రంప్ ప్రభుత్వ విధానంపై ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో తీసుకున్న గణనీయమైన నిర్ణయం ఇది. పెట్టుబడుల పరిరక్షణ ఒప్పందం, భౌగోళిక సూచిక (జిఐ)లపై ఒప్పందం కోసం సంప్రదింపులపై ముందుకు సాగేందుకు ఉభయ పక్షాలు చూస్తున్నాయని ప్రధాని తెలిపారు. అనుసంధానతను మోడీ ప్రస్తావిస్తూ, భారత, మధ్య ప్రాచ్య యూరప్ ఆర్థిక కారిడార్ (ఐఎంఇఇసి)ని ముందుకు తీసుకువెళ్లేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. 'ప్రపంచ వాణిజ్యం, సుస్థిర వృద్ధి, సంపద రంగాల్లో సాగేందుకు ఐఎంఇఇసి కారిడార్ దోహదకారి కాగలదని తాను విశ్వసిస్తున్నట్లు మోడీ తెలిపారు. వాన్ డెర్ లెయెన్, ఇతర కమిషనర్ల బృందం భారత పర్యటన 'కని విని ఎరగనటువంటిది' అని ప్రధాని పేర్కొన్నారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, సుస్థిరత, సంపద ప్రాముఖ్యంపై భారత్, ఇయు అంగీకరించినట్లు మోడీ వెల్లడించారు. భారత్, ఇయు భాగస్వామ్యాన్ని పెంచేందుకు, వేగిరపరచేందుకు అనేక నిర్ణయాలు తీసుకున్నట్లు మోడీ తెలియజేశారు. భారత్‌తో తమ అనుబంధాన్ని కొత్త పుంతలు తొక్కించాలని ఇయు కోరుకుంటున్నట్లు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు లెయెన్ తెలిపారు.

# మార్చి 15 నుంచి స్పేడెక్స్ ప్రయోగాలు

**ఇస్రో చీఫ్**

న్యూఢిల్లీ : అంతరిక్ష ప్రయోగాల్లో భాగంగా ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానం చేసే మిషన్‌ను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో ) చేపట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానం చేసిన ఇస్రో , ఈ ప్రయోగాలను పునఃప్రారంభించేందుకు సిద్ధమైంది. మార్చి 15 నుంచి స్పేడెక్స్ ప్రయోగాలు చేపట్టనున్నట్టు ఇస్రో చీఫ్ వి. నారాయణన్ వెల్లడించారు. ప్రస్తుతం ఆ ఉపగ్రహం దీర్ఘవృత్తాకార కక్షలో ఉంది. వివిధ ప్రయోగాలు చేపట్టేందుకు రెండు నెలల్లో 10 నుంచి 15 రోజుల అనుకూల సమయం లభిస్తుంది.ప్రస్తుతం వాటిని విడదీసి , రీడాకింగ్ చేసేందుకు అనుకరణ ప్రయోగాలు చేస్తున్నాం. ఇప్పటికే ఓ ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం.'అని ఇస్రో ఛైర్మన్ తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మార్చి 15 నుంచి ఈ ప్రయోగాలను చేపడతామన్నారు. ఉపగ్రహాల్లో తగినంత ఇంధనం ఉందని, తదుపరి అనేక ప్రయోగాలు చేయాలనుకుంటున్నామని వెల్లడించారు. అంతేకాదు, రెండు నెలల తరువాత వచ్చే అనుకూల సమయం లోనూ మూడో దశ ప్రయోగాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. డాకింగ్, దృఢత్వ ప్రయోగాల అనంతరం రెండు ఉపగ్రహాల మధ్య విద్యుత్ శక్తి బదిలీ ప్రయోగాలు చేయాలనే ప్రణాళికలు వేసుకున్నట్టు ఇస్రో గతం లోనే చెప్పింది. ఇదిలా ఉంటే అంతరిక్ష ప్రయోగాల్లో భాగంగా ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానించే మిషన్‌ను ఇస్రో చేపట్టింది. ఇందులో భాగంగా గత ఏడాది డిసెంబర్ 30న ఛేజర్, టార్గెట్ జంట ఉపగ్రహాలను కక్ష లోకి పంపించింది. పలు ప్రయత్నాల అనంతరం చివరకు జనవరి 16న డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా చేపట్టింది. దీంతో ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది.



## సంపాదకీయం

### ధరాభారం.. మద్దతు దూరం

దేశానికి రైతే వెన్నెముక అంటూనే, ఆ వెన్నెముకను విరిచే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. అధికార మార్పిడి జరిగిన నాటి నుండి నేటి వరకు రైతాంగ ప్రయోజనాలు కాపాడే వ్యవసాయ విధానాలను పాలక పార్టీలు, ప్రభుత్వాలు అమలు జరపకపోగా హరిస్తున్నాయి. పండించే పంటలకు న్యాయమైన ధర లభించకపోతే రైతుకు నష్టదాయకంగా మారి సేద్యమే సంక్షోభంలో పడుతున్నది. నేడు భారత రైతాంగం ఈ సమస్యనే ఎదుర్కొంటున్నారు. నెహ్రూ పాలనలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసే విధానాలు అమలు చేయని ఫలితంగా దేశంలో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడింది. అవమానకరమైన పిఎల్ 480 ఒప్పందం ద్వారా అమెరికా నుండి పెద్దఎత్తున గోధుమలు దిగుమతి చేసుకున్నాం. ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచే విధంగా రైతాంగానికి మేలు రకమైన విత్తనాలు, పంటకు కావాల్సిన పెట్టుబడి, నాణ్యమైన ఎరువులు, మంచి ధర లభించే మార్కెట్ సౌకర్యం కల్పించి ఉంటే ఆహార సంక్షోభం వచ్చేది కాదు. మద్దతు ధరల నేపథ్యం భారత వ్యవసాయరంగాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవటానికి అనుగుణమైన విధానాలను అమెరికా అమలు జరిపింది. మొదట ముక్కిపోయిన గోధుమలను భారత దేశానికి ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంది. తమ దేశ ఎరువుల రంగానికి భారత దేశాన్ని పెద్ద మార్కెట్‌గా మార్చే వ్యూహాత్మక విధానాలకు సిద్ధమైంది. అందుకు ఫోర్డు ఫౌండేషన్‌ను ఉపయోగించింది. 1959లో భారత దేశానికి వచ్చిన ఈ ఫౌండేషన్ నాట్లు వేయటానికి ముందే పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని భారత ప్రభుత్వానికి సూచించింది. దానికి అనుగుణంగానే వ్యవసాయ ధరల కమిషన్ ఏర్పాటు కోసం 1964లో ఎల్‌కె ఝా అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసింది. దాని సిఫార్సుల ఆధారంగా 1965లో వ్యవసాయ ధరల కమిషన్ (ఎపిసి) ఏర్పడింది. ఇది ప్రతి సంవత్సరం మద్దతు ధర, సేకరణ గురించి ప్రకటిస్తుంది. ఎసిపిని 1985లో వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్‌గా కేంద్ర ప్రభుత్వం మార్చింది. ముందుగానే మద్దతు ధర ప్రకటించమని ఫోర్డు ఫౌండేషన్ చెబితే, పంటల దిగుబడి పెంచటానికి సస్యవిప్లవం ప్రకటించమని ప్రపంచబ్యాంకు భారత ప్రభుత్వానికి చెప్పింది. సస్యవిప్లవం పేరుతో అమెరికా కంపెనీల ఎరువుల, పురుగు మందుల వ్యాపారానికి భారత దేశాన్ని ముఖ్య కేంద్రం గా మార్చటమే ప్రపంచ బ్యాంకు ఎత్తుగడ. ప్రపంచ బ్యాంకు సూచనలకు అనుగుణంగా 1966లో దేశంలో సస్యవిప్లవాన్ని ప్రభుత్వం ప్రకటించింది. అమెరికా నుంచి హైబ్రీడ్ విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు దేశంలోకి దిగుమతి అయ్యాయి. సస్యవిప్లవ ఫలితంగా రైతాంగానికి పంట ఖర్చులు పెరిగాయి. అందుకు తగ్గ ఆదాయం మాత్రం రైతాంగానికి లభించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పంటలకు మద్దతు ధర అంశం ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా జరుగుతున్న చర్చ లో విధాన నిర్ణేతలు, పరిశోధకులు, ఆలోచనాపరులు ప్రభుత్వ పెట్టుబడులు లేదా ఇన్‌పుట్ సబ్సిడీల ద్వారా ఉత్పత్తి వ్యయానికి మద్దతు మార్గాలను సూచించారు. 1964లో ఎల్‌కె ఝా కమిషన్ సిఫార్సుల మేరకు రైతాంగానికి మద్దతు ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం స్వీకరించింది. ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర విధానం ఒక నిర్దిష్ట పంట ఉత్పత్తి వ్యయాన్ని అంచనా వేయటానికి అనుసరించే విధానాలను వ్యవసాయ ఖర్చుల ధరల కమిషన్ (సిఎసిపి) ప్రచురించిన వార్షిక ధరల విధాన నివేదిక లో పేర్కొన్నారు. ఈ నివేదిక ప్రకారం సిఎసిపి భారత దేశంలో ప్రధాన పంటల సాగు ఖర్చును అధ్యయనం చేయటానికి 'సమగ్ర పథకాన్ని' 1971 నుండి అమలు చేసింది. ఈ పథకం ద్వారా మూడు సంవత్సరాల ఖర్చులను కలిపి పంటల ఉత్పత్తి ఖర్చును వ్యవసాయ ధరల కమిషన్ నిర్ణయిస్తుంది. ఈ విధానం రైతాంగ ప్రయోజనాలను దెబ్బ తీస్తుంది. రెండు సంవత్సరాల పంట ఖర్చులు తక్కువా ఉంటే, ఆ ఖర్చును మూడవ సంవత్సరం పంట ఖర్చులతో కలిపి నిర్ణయించటం వలన పంట ఖర్చు తక్కువగా నమోదు అవుతుంది. దాన్ని ఆధారం చేసుకుని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర తక్కువ ప్రకటిస్తుంది. అంతేకాకుండా పంటల ఉత్పత్తి ఖర్చును రాష్ట్రాల వారీగా సేకరించి దానిని దేశ సగటుగా నిర్ణయించటం జరుగుతున్నది. ఒక పంటకు సాగు ఖర్చులో రాష్ట్రాల మధ్య వ్యత్యాసం ఉంది. దీనివల్ల ఎక్కువ ఖర్చు ఉన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతున్నది. ప్రతి సంవత్సరం రాష్ట్రాల వారీగా పంట ఖర్చును లెక్కించి ఆయా రాష్ట్రాలకు విడిగా మద్దతు ధరను ప్రకటిస్తే రైతాంగానికి ప్రయోజనంగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అలా చేయకపోవటం రైతాంగ వ్యతిరేక విధానాలకు నిదర్శనం. ఒక పంటకు ఉత్పత్తి వ్యయం అనేది పంట కోసం పెట్టిన ఖర్చు, భూమి అద్దె, కుటుంబ శ్రమ, అప్పులకు వడ్డీ, మూలధనంపై వడ్డీ తదితరాలు లెక్కించి నిర్ణయించాలి. అది సమగ్రంగా ఖర్చుగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వాలు, వ్యవసాయ వ్యయ ధరల కమిషన్ ఆ విధంగా పంట వ్యయాన్ని లెక్కించటం లేదు. బ్యాంకులు ఇచ్చే పంట రుణం ప్రామాణికంగా తీసుకుని పంటకు మద్దతు ధరను ప్రకటిస్తున్నాయి. ఫలితంగా రైతాంగానికి సేద్యం గిట్టుబాటుకాక అప్పుల్లో కూరుకు పోతున్నారు. వివిధ కమిషన్ల సూచనలు: ఎంఎస్ స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ రైతు కమిషన్ (ఎన్‌సిఎఫ్) కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) సగటు ఉత్పత్తి వ్యయంకంటే (పంట ఖర్చు, కౌలు ఖర్చు, కుటుంబ శ్రమ, అప్పులకు వడ్డీ మొదలైన ఖర్చులు) కనీసం 50% ఎక్కువగా ఉండాలని సిఫార్సు చేసింది. 1979 -80లో ఉత్పత్తి వ్యయం అంచనాలపై ప్రత్యేక నిపుణుల (యస్‌ఆర్ సేన్) కమిటీ, 1990లో ఏర్పాటు చేయబడిన పంటల ఉత్పత్తి వ్యయ పద్ధతి సమీక్ష కోసం నిపుణుల (సిహెచ్ హనుమంతరావు అధ్యక్షతన) కమిటీ, పంటల వ్యయం గురించి సిఎసిపి ఉపయోగించిన పద్ధతికి సంబంధించిన అనేక సమస్యలు లేవనెత్తాయి. సేన్, భాటియా (2004) కమిటీలు కూడా యాజమాన్యంలోని భూమి అద్దె విలువను కూడా ఉత్పత్తి వ్యయంలో లెక్కించబడుతుందని ఎత్తిచూపారు. భూయజమాని మూలధనంపై వడ్డీ ఖర్చు 10%గా అంచనా వేసింది. ఈ సిఫార్సులను ప్రభుత్వాలు, సిఎసిపి పరిగణనలోకి తీసుకోలేదు. 2014లో మోడీ నాయకత్వాన మొదటిసారి ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడినప్పుడు 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పింది. ఇంతవరకు ఆచరణలో అమలు జరగకపోగా నేడు దాని ఊసే ఎత్తటం లేదు. రైతుల ఆదాయం పెరగకపోవటం పైన, మద్దతు ధరల పైన మోడీ ప్రభుత్వంపై వివిధ రూపాల్లో వ్యతిరేకత పెరుగుతూ ఉండటంతో, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా పంట ఉత్పత్తి వ్యయంపై అదనంగా 50% పెంచి మద్దతు ధరను ప్రకటిస్తామని మోడీ ప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడే మోడీ ప్రభుత్వ వంచన బయటపడింది. స్వామినాథన్ కమిషన్ చెప్పినట్లు అన్ని రకాల ఖర్చులను లెక్కించకుండా, ఒక్క పంట ఖర్చునే తీసుకుని దానిపై 50% పెంచి మద్దతు ధరను ప్రకటిస్తున్నది. 2024 -25 సంవత్సరానికి ఎకరా సేద్యపు పంట ఖర్చు 28 వేలుగా నిర్ధారించి, సగటు దిగుబడి 20 క్వింటాళ్లు నిర్ణయించి, క్వింటాల్ ఉత్పత్తి ఖర్చు రూ. 14 వందలు పేర్కొని దానిపై 50% పెంచి 2100 రూపాయలుగా ప్రకటించి దాన్ని 2300 రూపాయలకు పెచింది. పంట ఖర్చు, కౌలు ఖర్చు, కుటుంబ శ్రమ, అప్పుల వడ్డీలతో వాస్తవ వ్యయం రూ. 64 వేలు. క్వింటాల్ ఉత్పత్తి ఖర్చు రూ. 3200. దానిపై 50% కలిపితే 4,800 రూపాయలుగా మద్దతు ధర ప్రకటించాలి. దీన్ని గమనించినప్పుడు స్వామినాథన్ సిఫార్సులను మోడీ ప్రభుత్వం వక్రీకరించి విధానం తెలుస్తుంది. మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించటానికి నిరాకరిస్తున్నది.

రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, మద్దతు ధర 50% పెంచుతానని మోసపుచ్చుతూ వచ్చిన మోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాల ద్వారా మద్దతు ధరలకే మంగళం పాడి పంటల సేకరణ నుంచి తప్పుకుంటే, ఆ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ ఉద్యమం ఉవ్వెత్తున సాగటంతో, చట్టాలను ఉపసంహరించుకోక తప్పలేదు. స్వతంత్ర పాలన ప్రారంభం నుండి నేటి వరకు పాలక ప్రభుత్వాలన్నీ రైతాంగ వ్యతిరేక విధానాలనే అనుసరించాయి. రైతాంగ ప్రయోజనాలను హరించి, బడా వ్యాపారుల ప్రయోజనాలకు అనుకూలంగా పంటల మద్దతు ప్రకటిస్తున్నాయి. గిట్టుబాటు గాని ధరల వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోయారు. నాలుగు లక్షల మంది రైతులు అప్పులు తీర్చే మార్గం కనపడక బలవన్మరణాల పాలయ్యారు. రైతాంగం, రైతు, రైతు కూలీ సంఘాలు పంటలకు న్యాయబద్ధమైన మద్దతు ధరలు ప్రకటించి, వాటికి చట్టబద్ధత కల్పించి, ప్రభుత్వమే కొనుగోళ్లు చేయాలనే డిమాండ్‌తో ఉద్యమాలు చేస్తున్నాయి. ఆ ఉద్యమాలను ఉధృతం చేసి మోడీ ప్రభుత్వం దిగి వచ్చేలా చేయాలి. అప్పుడే న్యాయమైన మద్దతు ధర లభిస్తుంది.

# పరమాణువు ఆత్మ

సర్వసంగ పరిత్యాగం ప్రధానంగా ఒక ఆలోచనావిధానం అని చెప్పుకున్నాము. మన ఉనికి భౌతికంగా కన్నా ఆలోచనాపరంగానే అంటే ఆత్మగానే ఎక్కువ. ఆత్మ, మనస్సు లేదా ఆలోచనయే దేహం కన్నా ప్రభావవంతం. ఆత్మయే చర్యలను ప్రేరేపిస్తుంది. ఒక దేహమే వేర్వేరు సందర్భాలలో వేర్వేరు ఆలోచనలతో వేర్వేరుగా ప్రవర్తిస్తుంది. అందుకే నేను మానవులను ఆత్మ ధరించిన దేహాలుగా భావిస్తాను. ఆత్మ మారితే మనిషి మారిపోతాడు. ప్రోటాన్ల సంఖ్య మారితే పరమాణువు మారిపోతుంది. పరమాణువులోని ప్రోటాన్ల సంఖ్యనే పరమాణు సంఖ్య అంటాము. పరమాణు సంఖ్య ప్రాతిపదికగానే ఆవర్తన పట్టిక లేదా పీరియాడిక్ టేబుల్ చాలా పరివర్తనాలు చెంది చివరిగా ఇప్పటి స్థితిలో నిలకడ చెందింది. అందుకే నేను పరమాణు సంఖ్య పరమాణువుకు ఆత్మ లాంటిది అంటాను. న్యూట్రాన్ల సంఖ్య మారితే మూలకం మారదు. కేవలం ఆ మూలకం తాలూకా ఐసోటోప్ మారుతుంది. ఎలక్ట్రాన్ల సంఖ్య మారితే మూలకం మారదు, అదే మూలకం అయాన్ ఏర్పడుతుంది. అందుకే నేను పరమాణు సంఖ్య పరమాణువుకు ఆత్మ లాంటిది అంటాను. పై విషయాన్నే ఇంకొంచెం వివరాలతో తెలుసుకుందాము. ఒక మూలకం యొక్క పరమాణు సంఖ్య ఒక పరమాణువు యొక్క కేంద్రకంలో కనిపించే ప్రోటాన్ల సంఖ్యను సూచిస్తుంది. ఈ సంఖ్య మూలకం యొక్క గుర్తింపును నిర్ణయిస్తుంది కాబట్టి ఇది ప్రాథమికమైనది. ఉదాహరణకు, ఒక ప్రోటాన్ ఉన్న అణువు ఎల్లప్పుడూ హైడ్రోజన్, అయితే ఆరు ప్రోటాన్లు ఉన్న అణువు కార్బన్. పరమాణు సంఖ్య ప్రతి మూలకానికి ప్రత్యేకమైనది మరియు ఆవర్తన పట్టికలోని మూలకాలను ఆరోహణ క్రమంలో ఏర్పరచడానికి ఉపయోగించబడుతుంది. పరమాణు సంఖ్య పెరిగేకొద్దీ, మూలకం యొక్క నిర్మాణం మరియు లక్షణాల సంక్లిష్టత కూడా పెరుగుతుంది. పరమాణు సంఖ్య పరమాణు ద్రవ్యరాశి లేదా పరమాణు బరువు భిన్నంగా ఉంటాయి. పరమాణు సంఖ్య ఒక అణువులోని ప్రోటాన్ల సంఖ్యను సూచిస్తుంది. ఒకే మూలకం యొక్క పరమాణువుల మధ్య న్యూట్రాన్ల సంఖ్య మారవచ్చు, దీని వలన కొద్దిగా భిన్నమైన పరమాణువులు కలిగిన విభిన్న ఐసోటోపులు ఏర్పడతాయి. ఉదాహరణకు, కార్బన్-12 మరియు కార్బన్-14 రెండూ కార్బన్ ఎందుకంటే వాటిలో ఆరు ప్రోటాన్లు ఉంటాయి, కానీ వాటికి వేర్వేరు సంఖ్యలో న్యూట్రాన్లు ఉంటాయి, దీని వలన వేర్వేరు పరమాణు ద్రవ్యరాశి ఏర్పడుతుంది. బరువులో ఈ తేడాలు ఉన్నప్పటికీ, రసాయన లక్షణాలు చాలావరకు ఒకే విధంగా ఉంటాయి మరియు పరమాణు సంఖ్య (మరియు ఎలక్ట్రాన్ల సంఖ్య) మారదు. పరమాణు సంఖ్య మారినప్పుడు ఏమి జరుగుతుంది? పరమాణు సంఖ్యను మార్చడం అంటే మూలకాన్నే మార్చడం. ఉదాహరణకు, మీరు కార్బన్ పరమాణువుకు (పరమాణు సంఖ్య 6) ప్రోటాన్‌ను జోడిస్తే, మీకు నైట్రోజన్ (పరమాణు సంఖ్య 7) లభిస్తుంది. ఈ మార్పు ప్రాథమికంగా అణువు యొక్క లక్షణాలను మారుస్తుంది, ఇతర మూలకాలతో అది ఎలా సంకర్షణ చెందుతుందో కూడా మారుస్తుంది. ప్రకృతిలో, పరమాణు సంఖ్యలో మార్పులు ఆకస్మికంగా జరగవుబీ వాటికి నక్షత్రాలలో లేదా శాస్త్రీయ పరిశోధనలో ఉపయోగించే కణ త్వరణాలలో సంభవించే పరమాణు ప్రతిచర్యలు అవసరం. పరమాణు సంఖ్య ఎందుకు అంత ముఖ్యమైనది? మూలకాలు ఒకదానితో ఒకటి ఎలా సంకర్షణ చెందుతాయో అర్థం చేసుకోవడంలో పరమాణు సంఖ్య కీలకమైన అంశం. ఇది మూలకాన్ని నిర్వచిస్తుంది మరియు దాని రసాయన ప్రవర్తనను నిర్దేశిస్తుంది. ప్రోటాన్ల సంఖ్య కేంద్రకం చుట్టూ ఉన్న ఎలక్ట్రాన్ల సంఖ్యను నేరుగా ప్రభావితం చేస్తుంది మరియు ఈ ఎలక్ట్రాన్లు ఒక మూలకం ఇతర మూలకాలతో ఎలా బంధిస్తుందో దానికి బాధ్యత వహిస్తాయి. వివిధ శక్తి స్థాయిలలో ఎలక్ట్రాన్ల అమరిక ఒక మూలకం రసాయనికంగా చురుకుగా ఉందా, లేదా మందకొడిగా ఉందా లేదా అటుకి ఇటుకి కాక మధ్యలో ఎక్కడో ఉందా అని నిర్ణయిస్తుంది. ఆవర్తన పట్టికకు పరమాణు సంఖ్య ఎలా సంబంధం కలిగి ఉంటుంది? మూలకాల పట్టికలో పరమాణు సంఖ్యకు అర్థం ఉంది.

ఆవర్తన పట్టికను పరమాణు సంఖ్యను ఎక్కువ చేయడం ద్వారా అమర్చారు, ఇది మూలకాల లక్షణాలను అంచనా వేయడానికి ఉపయోగకరమైన సాధనంగా చేస్తుంది. సారూప్య లక్షణాలు కలిగిన మూలకాలను నిలువు వరుసలు లేదా సమూహాలుగా సమూహపరుస్తారు మరియు ఈ నమూనాలు వాటి పరమాణు సంఖ్యలపై ఆధారపడి ఉంటాయి. మీరు పట్టిక మీదుగా కదులుతున్నప్పుడు, పరమాణు సంఖ్య పెరుగుతుంది మరియు మూలకాల ప్రోటాన్లు మరియు ఎలక్ట్రాన్ల సంఖ్య కూడా పెరుగుతుంది. ఈ అమరిక శాస్త్రవేత్తలు మరియు విద్యార్థులు రసాయనపర చురుకుదనం, ఎలక్ట్రోనెగటివిటీ మరియు పరమాణు వ్యాసార్థంలోని ధోరణులను అర్థం చేసుకోవడానికిసహాయపడుతుంది.

**సీతా రామ రాజు సనపల**

# వరదాయకుడు లక్ష్మీనరసింహుడు

తెలంగాణలోని ప్రముఖ ఆలయాలలో ఒకటైన, ఉమ్మడి నల్లగొండజిల్లా ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రము సమీపములో ఎత్తయిన గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయములో మార్చి 1నుండి మార్చి 11వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఋష్యశృంగ మహర్షి, శాంతల పుత్రుడు యాదమహర్షి చిన్నతనం నుంచే హరి భక్తుడు. ఆంజనేయస్వామి సలహాపై ప్రస్తుతం యాదగిరిగా పిలవబడుతున్న ప్రదేశంలో చాలా కాలం తపస్సు చేశారు. అప్పుడు ఒక రాక్షసుడు ఆహార అన్వేషణలో అటుగావచ్చి నిశ్చల తపస్సులో వున్న ఈ ఋషిని చూసి తినబోయాడు. ఆ విషయం తపస్సులోవున్న ఋషికి తెలియలేదు గానీ, ఆయన ఎవరి గురించైతే తపస్సు చేస్తున్నాడో ఆ శ్రీ హరి ఆయుధం అయిన సుదర్శన చక్రం వచ్చి ఆ రాక్షసుని సంహరించింది. అది చూసిన ఋషి ఆ సుదర్శన చక్రాన్ని పలు విధాల ప్రార్థించి, భక్తులకు ఏవిధమైన బాధలూ కలుగకుండా దుష్ట సంహారం చేస్తూ అక్కడే వుండిపొమ్మని కోరగా ఆ సుదర్శనము అనతికాలము లోనే అక్కడ వెలయ బోవుచున్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ శిఖరాన షట్కోణాకారాన వెలసి స్వామి దర్శనానికి వచ్చు భక్తులను సదా కాపాడుతూ వుంటానని వరమిచ్చి అంతర్ధానం అయినట్లు కథనం. యాద మహర్షి తన తపస్సుని కొనసాగించగా, ఆయన తపస్సుకి మెచ్చి నరసింహస్వామి ప్రత్యక్షమై, యాద మహర్షి కోరిక మీద అక్కడ లక్ష్మీ నరసింహస్వామి గా వెలిశాడు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. ఆ ఋషి తపస్సు చేసింది, స్వామి ప్రత్యక్షమైంది కొండక్రిందవున్న పాత లక్ష్మీ నరసింహస్వామి గుడి దగ్గర అని అంటారు. యాద మహర్షి కోరిక మీదే ఆంజనేయస్వామి యాదగిరిలో క్షేత్రపాలకుడుగా వున్నాడు. ప్రహ్లాదుని రక్షించటానికి, అహోబిలంలో నరసింహస్వామి స్తంభాన్ని చీల్చుకుని వచ్చి హిరణ్యకశిపుని సంహరించిన తర్వాత ఆ భీకర రూపాన్ని శాంత పరచటం ఎవరికీ సాధ్యం కాలేదట. అప్పుడు దేవతలంతా లక్ష్మీదేవిని ప్రార్థిస్తే ఆమె ప్రత్యక్షమై స్వామిని శాంతింప చేసిందట. అప్పుడు ప్రహ్లాదుడు స్వామిని అక్కడే ప్రసన్న రూపంలో కొలువై వుండమని కోరాడట. అయితే స్వామి అతి భీకర రూపంలో దర్శనమిచ్చిన ఆ ప్రదేశంలో శాంత రూపంతో కొలువై వుండటం లోక విరుద్ధమని అక్కడికి సమీపంలో వున్న యాదగిరిలో లక్ష్మీ నరసింహస్వామి గా లోక కళ్యాణార్థం కొలువు తీరుతానని బయల్దేరారు, లక్ష్మీ సమేతుడై కొండపై గల గుహలో వెలిశారు. ఆయనవెంట ప్రహ్లాదుడూ, సకల దేవతలూ వచ్చి ఆయనతోపాటు ఇక్కడ కొలువుతీరి స్వామిని సేవిస్తూ వచ్చారట. రాక్షస సంహారంచేసి లోక కళ్యాణం చేశారని సంతోషంతో స్వామివారి కాళ్ళని బ్రహ్మదేవుడు ఆకాశ గంగతో కడిగాడట. ఆ ఆకాశ గంగ లోయలలోంచి పారి విష్ణు పుష్కరిణిలోకి చేరింది. ఈ పుష్కరిణికి కూడా చాలా ప్రాముఖ్యం వుంది. ఇందులో స్నానంచేసి స్వామిని సేవించినవారికి సకల కోరికలూ తీరుతాయి. ఇక్కడ పితృకార్యాలు చేస్తే పితృ దేవతలు తరిస్తారు. చాలామంది భక్తులు ఆరోగ్యం, గ్రహపీడా నివారణ, వగైరా కోరికలతో కొన్నాళ్ళపాటు ఇక్కడ వుండి విష్ణు పుష్కరిణిలో స్నానం చేసి స్వామిని సేవిస్తారు.

అంతేగాక ఇప్పటికీ రోజూ రాత్రుళ్ళు ఆ చుట్టుప్రక్కల కొండలమీద తపస్సు చేసుకుంటున్న ఋషులు విష్ణు పుష్కరిణిలో స్నానంచేసి స్వామిని అర్చిస్తారట. దానికి నిదర్శనంగా వారు వచ్చేటప్పుడు మృదంగ ధ్వనులు వస్తాయట. పాదాల గుర్తులు కొందరు చూశారుట. వారు స్వామిని అర్చించిన గంధ పుష్పాదులు కూడా నిదర్శనమంటారు. మెట్ల మార్గాన వెళ్తే దోవలో శివాలయం కనబడుతుంది. ఇక్కడ శివుడు లక్ష్మీ నరసింహస్వామి కన్నా ముందు స్వయంభూగా వెలిశాడు. ఇంకో విశేషం .. ఈ మెట్లు ఎక్కి స్వామిని సేవించినవారి కీళ్ళ నొప్పులు తగ్గుతాయని భక్తుల విశ్వాసం యాదగిరి లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయ ముఖద్వారం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం నల్గొండ జిల్లాలో ప్రముఖ మైన దివ్య క్షేత్రం: యాదగిరి గుట్టకు సంబందించిన కథకు మూలం వాల్మీకి రామాయణంలో వున్నది. విభాండక ఋషి కుమారుడు ఋష్యశృంగుడు. అతని కుమారుడు హాద ఋషి, అతనినే హాదర్షి అని కూడ అంటారు. అతను నరసింహ స్వామి భక్తుడు. అతనికి స్వామివారిని ప్రత్యక్షంగా చూడాలని కోరిక పుట్టింది. ఆంజనేయస్వామి సలహా మేరకు తపస్సు చేయగా స్వామి ప్రత్యక్షమవుతాడు. ఆ ఉగ్ర నరసింహ మూర్తిని చూడలేక శాంత స్వరూపంతో కనిపించమని యాదర్షి కోరగా స్వామి వారు కరుణించి లక్ష్మి సమేతుడై దర్శన మిచ్చి "ఏంకావాలో కోరుకో" మంటే యాదర్షి స్వామి వారికి "శాంత మూర్తి రూపంలోనె కొలువై కొండపై ఉండి పొమ్మని కోరాడు. ఆవిధంగా లక్ష్మి నరసింహ స్వామి కొండపై అలా కొలువై ఉండి పోయాడు. కొన్నాళ్ళకు స్వామివారిని వేర్వేరు రూపాల్లో చూడాలనిపించి యాదర్షి మరలా తపస్సు చేశాడు. అతని కోరిక మేరకు స్వామి వారు జ్వాలా, యోగా, నంద, గండబేరుండ, నారసింహ రూపాల్లో దర్శనమిచ్చాడు. అందుకే ఈ క్షేత్రాన్ని పంచ నారసింహ క్షేత్రం అంటారు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. బ్రహ్మోత్సవాలు తొలిరోజు ఈ నెల 1న విశ్వక్సేన ఆరాధనతో ఆరంభమై అలంకార అవతార సేవలతో కొనసాగి మార్చి 11న చక్రస్నానం, మహాపూర్ణాహుతితో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా 1న ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం, సాయంత్రం మృత్సాంగ్రహణం, అంకురారోహణ పర్వాలు నిర్వహిస్తారు. 2 ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ట, 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6:30 గంటలకు భేరీ పూజ, హవనం, దేవతాహ్వానం నిర్వహిస్తారు. 3న ఉదయం తొమ్మిది గంటలకు మత్స అవతార అలంకార సేవ, వేద పారాయణం, రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ, 4న ఉదయం 9 గంటలకు వటపత్ర శాయి అలంకార సేవ , రాత్రి 7 గంటలకు హంస వాహన సేవ, 5 ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణలంకార సేవ, రాత్రి 7 గంటలకు పొన్నవాహన సేవ, 6న ఉదయం 9 గంటలకు గోవర్ధన గిరి దారి అలంకార సేవ, రాత్రి 7 గంటలకు సింహ వాహన సేవ, 7న ఉదయం 9 గంటలకు జగన్మోహిని అలంకార సేవ, రాత్రి 7 గంటలకు అశ్వవాహన సేవ, తదుపరి శ్రీ స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. 8న ఉదయం 9 గంటలకు శ్రీరామ అలంకార హనుమంత వాహనం సేవ , రాత్రి 8 గంటలకు గజవాహన సేవ, శ్రీ స్వామి అమ్మవార్ల తిరు కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. 9వ తేదీన ఉదయం 9 గంటలకు మహా విష్ణు అలంకారం, గరుడోత్సవము, రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవం, 10వ తేదీన ఉదయం 10.30 గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం 7 గంటలకు శ్రీ పుష్పయాగం, దేవతో ద్వాసన, 11వ తేదీన ఉదయం 10 గంటలకు శ్రీ స్వామివారికి అష్టోత్తర శతకటాభిషేకం, రాత్రి 9 గంటలకు శ్రీ స్వామివారి శృంగార డోలోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. దేవస్థానం ఈఓ భాస్కర్ రావు నేతృత్వంలో అధికారులు, అర్చకులు, సిబ్బంది వివిధ శాఖల అధికారుల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు.

# ప్రాథమిక హక్కుల పట్ల అవగాహన అవసరం

ప్రతి సంవత్సరం మార్చి మొదటి తేదీన, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలు ప్రపంచ పౌర రక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1990లో, ఇంటర్నేషనల్ సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ ఈ రోజును ప్రపంచ పౌర రక్షణ దినంగా ప్రకటించింది. ఐసిడిఓ అనేది ఒక లాభాపేక్ష లేని ఇంటర్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్. పౌర హక్కుల పరిరక్షణ, సౌకర్యాల కల్పన, ప్రజల ఎదుగుదల, సురక్షితంగా ఉండటానికి సహాయ పడుతుంది. 59 దేశాలు ఐసిడిఓ లో సభ్యత్వం కలిగి ఉన్నాయి. ఇది ఆయా దేశాలలోని పౌర రక్షణ దళాల మానవ వనరుల నిర్వహణను మెరుగు పరచడానికి అనేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అన్ని దేశాలు, ప్రజలందరికీ ఆదర్శ నీయమైన ఒక ఉమ్మడి ప్రమాణంగా పత్రాన్ని నిర్దేశిస్తూ 1948 డిసెంబరు 10న ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఐక్య రాజ్యసమితి సర్వప్రతినిధి సభ తీర్మానాన్ని ఆమోదించి, ప్రపంచ మంతటా పరిరక్షించు కోవాల్సిన ప్రాథమిక మానవ హక్కులను తొలిసారిగా నిర్దేశించింది. ఈ సందర్భంగా హక్కుల విషయంలో ఏ ఆర్టికల్ ఏమి సూచిస్తుంది అనే విషయం తెలుసు కుందాం. ఆర్టికల్ 1: మనుషులందరికీ పుట్టుకతోనే స్వేచ్ఛ, సమానత్వం లభిస్తాయి. గౌరవం, హక్కుల విషయంలో అందరూ సమానులే. మనుషులందరికీ సొంత ఆలోచన, అంతః చేతన ఉంటాయి. ఒకరితో మరొకరు సోదరభావంతో మెలగాలి. ఆర్టికల్ 2: ఈ పత్రంలోని అన్ని హక్కులూ, స్వేచ్ఛలూ ప్రతి ఒక్కరికీ ఉంటాయి. జాతి, రంగు, లింగం, భాష, మతం లాంటి అంశాల ప్రాతిపదికగాగాని, రాజకీయ నేపథ్యం వల్లగాని, భిన్నాభిప్రాయం వల్లగాని, జాతీయ లేదా సామాజిక మూలాలవల్లగాని, సంపదలో వ్యత్యాసాల వల్లగాని, పుట్టుక లేదా ఇతర ప్రాతిపదికల వల్లగాని వివక్ష చూపడానికి వీల్లేదు. వ్యక్తులను వారి దేశం లేదా భూభాగం రాజకీయ/అంతర్జాతీయ హోదా ఏమిటనేదాని ప్రాతిపదికగా ఎలాంటి వివక్షా చూపరాదు. ఆర్టికల్ 3: జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు, స్వీయ భద్రతా హక్కు ప్రతి మనిషికీ ఉంటాయి. ఆర్టికల్ 4: ఎవ్వరినీ బానిసగా చేసుకోవడానికి వీల్లేదు. బానిసత్వాన్ని, బానిస వ్యాపారాన్ని అన్ని రూపాల్లో నిషేధించాలి. ఆర్టికల్ 5: ఎవ్వరినీ చిత్రహింసలకు గురిచేయరాదు. ఎవ్వరినీ క్రూరమైన, అమానవీయమైన, అవమాన కరమైన శిక్షకు గురిచేయరాదు. ఆర్టికల్ 6: ప్రతి చోట చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపు పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 7: చట్టం ముందు అందరూ సమానులే. ఎలాంటి వివక్షా లేకుండా చట్టపరమైన రక్షణ పొందే హక్కు అందరికీ ఉంది. ఈ డిక్లరేషన్‌కు విరుద్ధంగా, ఎలాంటి వివక్షకు గురికాకుండా అందరికీ సమానమైన రక్షణ ఉంటుంది. ఆర్టికల్ 8: రాజ్యాంగం, లేదా చట్టం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లే చర్యల విషయంలో సంబంధిత జాతీయ ట్రైబ్యునల్ నుంచి పరిష్కారం పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 9: ఎవ్వరినీ ఏకపక్షంగా అరెస్టు చేయడానికిగాని, నిర్బంధించడానికిగాని, ప్రవాసానికి పంపించడానికిగాని వీల్లేదు. ఆర్టికల్ 10: క్రిమినల్ నేరాభియోగాలపైగాని, తన హక్కులను, బాధ్యతలను నిర్ణయించే విషయంలోగాని స్వతంత్ర, నిష్పాక్షిక ట్రైబ్యునల్ ఆధ్వర్యంలో నిష్పాక్షిక, బహిరంగ విచారణ పొందే హక్కు ప్రతి ఒక్కరికీ సమానంగా ఉంది. ఆర్టికల్ 11: (1) శిక్షార్హమైన నేరాభియోగాన్ని ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరూ, బహిరంగ విచారణలో చట్ట ప్రకారం దోషిగా తేలే వరకు నిర్దోషిగానే భావించాలి. ఈ మేరకు ఆ వ్యక్తికి హక్కు ఉంది. ఈ విచారణలో, తనను తాను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని హామీలూ వ్యక్తికి ఉంటాయి. (2) ఎవరైనా వ్యక్తి చేసిన తప్పిదం లేదా పని అది జరిగిన సమయానికి జాతీయ, లేదా అంతర్జాతీయ చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరం కాకపోతే, ఆ వ్యక్తిని శిక్షార్హమైన నేరంలో దోషిగా ప్రకటించడానికి వీల్లేదు. శిక్షార్హమైన నేరం జరిగినప్పుడు వర్తించే శిక్ష కన్నా తీవ్రమైన శిక్షను విధించడానికి కూడా వీల్లేదు. ఆర్టికల్ 12: ఏ ఒక్కరి వ్యక్తిగత గోప్యత, కుటుంబం, ఇల్లు, ఉత్తరప్రత్యుత్తర విషయాల్లో ఏకపక్షంగా జోక్యం చేసుకోవడానికిగాని, గౌరవ ప్రతిష్ఠలపై దాడి చేయడానికిగాని వీల్లేదు. అలాంటి జోక్యం, దాడుల నుంచి చట్టపరమైన రక్షణ పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 13:(1) దేశంలో స్వేచ్ఛగా తిరిగే, నివసించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. (2) సొంత దేశం నుంచి లేదా ఏ దేశం నుంచి అయినా వెళ్లిపోయే హక్కు, తన దేశానికి తిరిగి వచ్చే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. ఆర్టికల్ 14: (1) పీడన నుంచి తప్పించుకొనేందుకు ఇతర దేశాలను ఆశ్రయం అడిగే, పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. (2) ఐక్యరాజ్యసమితి సూత్రాలకు, ప్రయోజనాలకు విరుద్ధమైన చర్యలు లేదా రాజకీయేతర నేరాలపై నిజమైన ప్రాసిక్యూషన్ జరిగే సందర్భంలో ఈ హక్కు ఉండకపోవచ్చు. ఆర్టికల్ 15: (1) ఏదైనా జాతీయతను కలిగి ఉండే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. (2) ఎవరికీ ఏకపక్షంగా జాతీయతను తొలగించకూడదు, అలాగే జాతీయతను మార్చుకొనే హక్కును నిరాకరించకూడదు. ఆర్టికల్ 16: (1) జాతి, జాతీయత లేదా మతం పరిమితులు లేకుండా పెళ్లి చేసుకొనేందుకు, కుటుంబాన్ని కలిగి ఉండేందుకు వయోజనులైన మహిళలకు, పురుషులకు హక్కు ఉంది. వివాహం చేసుకొనేటప్పుడు, వివాహ బంధంలో ఉన్న కాలంలో, దీనిని రద్దుచేసుకొనేటప్పుడు వారికి సమానమైన హక్కులు ఉంటాయి. (2) పెళ్లికి ఇద్దరు వ్యక్తుల్లో స్వేచ్ఛాయుత, సంపూర్ణ అంగీకారం ఉంటేనే పెళ్లి చేసుకోవాలి. (3) సమాజంలో కుటుంబమనేది ఒక సహజమైన, ప్రాథమికమైన భాగం. కుటుంబానికి సమాజం, రాజ్యం రక్షణ కల్పించాలి. ఆర్టికల్ 17: (1) సొంతంగాగాని, ఇతరులతో కలసి గాని ఆస్తులు కలిగి ఉండేందుకు ప్రతి ఒక్కరికీ హక్కుంది. (2) ఎవరికీ ఏకపక్షంగా ఆస్తిని దూరం చేయడానికి వీల్లేదు. ఆర్టికల్ 18: స్వేచ్ఛాయుత అంతఃచేతనత్వానికి, స్వేచ్ఛగా ఆలోచించడానికి, మతాన్ని పాటించడానికి ప్రతి ఒక్కరికీ హక్కు ఉంది. మతాన్ని లేదా విశ్వాసాన్ని మార్చుకొనే హక్కు ఇందులో భాగం. ఒంటరిగాగాని, ఇతరులతో కలిసిగాని ప్రైవేటుగాగాని, బహిరంగంగాగాని తన మతవిశ్వాసాలను పాటించే, బోధించే స్వేచ్ఛ, పూజించే స్వేచ్ఛ అందరికీ ఉన్నాయి. ఆర్టికల్ 19: ప్రతి ఒక్కరికీ భావ ప్రకటనా హక్కు ఉంది. ఇతరుల జోక్యం లేకుండా సొంత అభిప్రాయాలు కలిగి ఉండే హక్కు, సరిహద్దులతో సంబంధం లేకుండా ఏ మార్గం నుంచైనా సమాచారం, ఆలోచనలు కోరే, స్వీకరించే హక్కు ఇందులో భాగం. ఆర్టికల్ 20: (1) స్వేచ్ఛగా శాంతియుతంగా సమావేశమయ్యేందుకు, సంఘంగా ఏర్పడేందుకు ప్రతి ఒక్కరికీ హక్కుంది. (2) ఏదైనా సంఘంలో భాగస్వామి కావాలని ఎవరినీ బలవంతపెట్టడానికి వీల్లేదు. ఆర్టికల్ 21: ప్రతి ఒక్కరికీ తమ దేశ ప్రభుత్వంలో ప్రత్యక్షంగా లేదా ఎంచుకున్న ప్రతినిధి ద్వారా భాగస్వామ్యమయ్యే హక్కు ఉంది. 1) ప్రతి ఒక్కరికీ తమ దేశంలో ప్రభుత్వ సేవలను సమానంగా పొందే హక్కు ఉంది. 2) ప్రభుత్వానికి ప్రజాభీష్టం ప్రాతిపదిక కావాలి. నిర్దేశిత కాలానికి జరిగే నిజమైన ఎన్నికల్లో ఈ ప్రజాభీష్టం వ్యక్తంకావాలి. ఈ ఎన్నికల్లో సార్వజనీన, సమానమైన ఓటు హక్కు ఉంటుంది. రహస్య ఓటింగ్ లేదా దానికి సమానమైన స్వేచ్ఛాయుత ఓటింగ్ నిర్వహించాలి. ఆర్టికల్ 22: సమాజంలో సభ్యులుగా ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత హక్కు ఉంది. తన గౌరవానికి, తన వ్యక్తిత్వం స్వేచ్ఛగా అభివృద్ధి చెందటానికి ఆవశ్యకమైన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను జాతీయ కృషి, అంతర్జాతీయ సహకారం ద్వారా దేశ వనరులకు అనుగుణంగా సాధించుకునే హక్కు ఉంది. ఆర్టికల్ 23: (1) ప్రతి ఒక్కరికీ పని చేయడానికి హక్కుంది. స్వేచ్ఛగా కోరుకొన్న ఉపాధిని పొందడానికి, పనిచేయటానికి న్యాయమైన, అనుకూలమైన పరిస్థితులు పొందడానికి, నిరుద్యోగిత నుంచి రక్షణ పొందటానికి అందరికీ హక్కుంది. (2) ప్రతి ఒక్కరికీ ఎలాంటి వివక్షా లేకుండా సమాన పనికి సమాన వేతనం పొందే హక్కు ఉంది. (3) పని చేసే ప్రతి ఒక్కరికీ తాను, తన కుటుంబం మానవ గౌరవంతో మనుగడ సాగించటానికి హామీ ఇచ్చేలా న్యాయమైన, అనుకూలమైన వేతనం పొందే హక్కు ఉంది. అవసరమైతే ఇతర మార్గాల్లో అదనంగా సామాజిక రక్షణ పొందే హక్కు ఉంది. (4) ప్రతి ఒక్కరికీ తన ప్రయోజనాలను కాపాడుకోవటం కోసం కార్మిక సంఘాలు ఏర్పాటు చేయటానికి, వాటిలో చేరటానికి హక్కు ఉంది. ఆర్టికల్ 24: ప్రతి ఒక్కరికీ పనిగంటలకు హేతుబద్ధమైన పరిమితిని, నిర్దేశిత కాలానికి వేతనంతో కూడిన సెలవులను పొందే హక్కు, విశ్రాంతి, విరామం తీసుకునే హక్కు ఉన్నాయి. ఆర్టికల్ 25: (1) ప్రతి వ్యక్తికీ ఆహారం, దుస్తులు, నివాసం, వైద్యసేవలు, ఇతర సామాజిక సేవలు సహా.. తను, తన కుటుంబ ఆరోగ్య, సంక్షేమాలకు తగిన జీవన ప్రమాణం పొందే హక్కు ఉంది. నిరుద్యోగం, అనారోగ్యం, వైకల్యం, వైధవ్యం, వృద్ధాప్యం లేదా తన నియంత్రణలో లేని ఇతర కారణాల వల్ల జీవనోపాధి లేకపోవటం నుంచి భద్రత పొందే హక్కు ఉంది. (2) మాతృత్వం సమయంలో మహిళలకు, బాల్యదశలో చిన్నారులకు ప్రత్యేక సేవ, సహాయాలు పొందే హక్కు ఉంది. పెళ్లి ద్వారా పుట్టినా, పెళ్లి కాకుండా పుట్టినా చిన్నారులు అందరికీ సమానమైన రక్షణ లభించాలి. ఆర్టికల్ 26:(1) ప్రతి ఒక్కరికీ విద్యాహక్కు ఉంది. కనీసం ప్రాథమిక, మౌలిక స్థాయిల్లో అయినా అందరికీ విద్య ఉచితంగా అందాలి. ప్రాథమికవిద్య తప్పనిసరిగా ఉండాలి. సాంకేతిక విద్య, వృత్తినైపుణ్య విద్య అందుబాటులో ఉండాలి. ఉన్నతవిద్య ప్రతిభ ప్రాతిపదికన అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలి. (2) మానవ వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసించేలా, మానవ హక్కులను, మౌలిక స్వాతంత్ర్యాలను గౌరవించేదిగా విద్య ఉండాలి. (3) తమ పిల్లలకు ఏ తరహా విద్య అందించాలో ఎంచుకునే హక్కు తల్లిదండ్రులకు ఉంది. ఆర్టికల్ 27: (1) ప్రతి ఒక్కరికీ సమాజ సాంస్కృతిక జీవనంలో స్వేచ్ఛగా పాలుపంచుకోవడానికి,

కళలను ఆస్వాదించడానికి, శాస్త్రీయ పురోగతిలో, వాటి ప్రయోజనాల్లో భాగం పంచుకోవడానికి హక్కు ఉంది. (2) ప్రతి వ్యక్తికీ తను సృజించిన ఎలాంటి శాస్త్రీయ, సాహిత్య, కళా ఉత్పత్తుల నుంచి లభించే నైతిక, భౌతిక ప్రయోజనాలను పరిరక్షించుకునే హక్కు ఉంది. ఆర్టికల్ 28: ఈ ప్రకటనలో నిర్దేశించిన హక్కులు, స్వాతంత్ర్యాలు సంపూర్ణంగా సాకారమయ్యే సామాజిక, అంతర్జాతీయ పరిస్థితులు పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 29: తన వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసించటం సాధ్యమయ్యే సమాజం పట్ల ప్రతి ఒక్కరికీ బాధ్యతలు కూడా ఉన్నాయి. (1) ప్రతి ఒక్కరూ తన హక్కులు, స్వాతంత్ర్యాలను వినియోగించుకొనే క్రమంలో- ప్రజాస్వామ్య సమాజంలో ఇతరుల హక్కులు, స్వాతంత్ర్యాలకు తగిన గుర్తింపు, గౌరవం, నైతికత, శాంతిభద్రతలు, సాధారణ సంక్షేమం కోసం చట్టం నిర్దేశించిన పరిమితులకు మాత్రమే లోబడి ఉండాలి. (2) ఈ హక్కులు, స్వాతంత్ర్యాలను ఏ విధంగానూ ఐక్యరాజ్యసమితి లక్ష్యాలు, సూత్రాలకు వ్యతిరేకంగా ఉపయో గించరాదు. ఆర్టికల్ 30: ఈ ప్రకటనలోని ఏ అంశమైనా ఇందులో నిర్దేశించిన హక్కులు, స్వాతంత్ర్యాల్లో దేనినైనా ధ్వంసం చేసేందుకు, లేదా ఏమైనా చేసేందుకు ఏ రాజ్యానికీ, సంఘానికీ, వ్యక్తికీ వీలు కల్పిస్తున్నట్లు భావించరాదు.

# అనుమతులు నిల్ వ్యాపారం ఫుల్

- కే జి ఎఫ్ సినీ చిత్రాన్ని తలపిస్తున్న ఇటుక బట్టీల దందా
- నన్ను ఎవరు ఆపేది అన్న రీతిలో అక్రమ ఇటుక బట్టీల వ్యాపారం
- అధికారుల కన్ను అటువైపు పడపోవడం పై ఉన్న మతలాబు ఏంటో...?
- బట్టీల్లో మగ్గిపోతున్న బాల కార్మికులు





భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 28 (వుదయం ప్రతినిధి) అనుమతులు లేని అక్రమ ఇటుక బట్టీల వ్యాపారులకు హద్దు అదుపు లేకుండా పోతుంది ఇష్ట రాజ్యాంగ పంట పొలాల్లో బట్టీలు నిర్వహిస్తూ వాగుపక్కన ఉన్న సహజ వనరుల్ని, పంట పొలాలకు సరఫరా చేసే విద్యుత్ నీ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తమ వ్యాపారంగా మార్చుకుంటూ అక్రమ దందాకు తెరలేపుతున్నారు. బహిరంగానే ఇంత జరుగుతున్న అధికారులు చోద్యం చూస్తున్నారా అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే పాత కొత్తగూడెం ఏరియాలో ఇలా అక్రమ ఇటుక బట్టీల దందా అధికారుల కనుసైగల్లోనే నడుస్తుందన్న ఆరోపణలు ప్రజలలో వినిపిస్తున్నాయి. అధికారుల అండదండలతోనే అక్రమార్కులు రెచ్చిపోయి దొరికిన కాడికి దోచుకో అన్న రేంజిలో వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు ప్రజల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఇటుక బట్టీల నుండి ఇటుకలను ట్రాన్స్పోర్ట్ చేసే ట్రాక్టర్లు అనుభవం లేని డ్రైవర్లను తీసుకొని వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నా లేకపోయినా వారితో ట్రాన్స్పోర్ట్ చేపిస్తూ రోడ్లపై వారు అతివేగంతో వెళ్తూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. అలాగే అటువైపు పంట పొలాలకు వెళ్లే మార్గంలో ట్రాక్టర్లు తిరుగుతూ మార్గమంతా నడవలేని విధంగా పాడవుతున్నాయి. గతంలో కూడా పెనుబల్లి గ్రామపంచాయతీకి కూతవేటు దూరంలోనే ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తీయడం వల్ల ఒక భారీ గొయ్యి ఏర్పడి దాంట్లో పడి ఒక పాడి గేదె మరణించగా రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో గేదెల యజమాని ఫిర్యాదు చేయగా వారికి నష్టపరిహారం కూడా కట్టించిన దాఖలాలు ఉన్నాయి. ఇటుక బట్టీల్లో కూలీలుగా బాల కార్మికులతో వెట్టిచాకిరి చేపించుకోవడం వ్యాపారులకు అలవాటుగా మారిపోయింది .ఇటుక బట్టీలో పనిచేసే కూలీలకు ప్రమాదవశాత్తు వారు చేసే పనిలో ఏదైనా ప్రమాదాలు జరిగిన అనుమతులు లేకుండా చేసిన వ్యాపారం కావున వారికి ఎలాంటి రక్షణ లేకుండా పోయింది. విచ్చలవిడిగా వాయు కాలుష్యాన్ని మరియు అక్రమ మట్టి తవ్వకాలు అక్రమ కలప అక్రమ విద్యుత్ సరఫరా చేస్తున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.. అక్రమ ఇటుక బట్టీల వ్యవహారం పై వుదయం దినపత్రిక అందిస్తున్న ప్రత్యేక కథనం...

**అనుమతులు అవసరం లేదా అధికారులతో పని లేదా..?**

ఏదైనా ప్రదేశంలో ఇటుక బట్టీలను ఏర్పాటు చేయాలంటే ముందుగా గ్రామపంచాయతీ లేదా మున్సిపాలిటీ, మైనింగ్, రెవెన్యూ, కార్మిక శాఖ, విద్యుత్ శాఖల నుండి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం ఎలాంటి అనుమతులతో అవసరం లేకుండానే వ్యాపారం దర్జాగా నడిపిస్తున్నారు.

**వ్యవసాయ భూముల్లో ఇటుక బట్టీలు.**

వ్యవసాయ భూములలో ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తున్నారు. ఆ భూములకు నాలా అనుమతులు తీసుకున్న తర్వాతే వనులు ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్నారు. నిర్వాహకులపై చర్యలు తీసుకొని బట్టీలను సీజ్ చేసే అధికారం రెవెన్యూ అధికారులు ఉన్నా చర్యలు చేపట్టడం లేదు. గ్రామస్థాయిలో బహిరంగంగా వ్యాపారాలు కొనసాగిస్తున్నా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పంట భూముల్లో ఉన్న బోర్లను సైతం వ్యాపారానికి అనుగుణంగా వాడుకుంటున్నారు.

**బట్టీల్లో మగ్గిపోతున్న బాల కార్మికులు..**

సీఎల్పీఆర్ చట్టం ప్రకారం బాల అంటే 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ఏ వ్యక్తి అయినా అని నిర్వచించబడింది మరియు సి ఎల్ పి ఆర్ చట్టం గృహ సహాయకుడిగా సహా ఏదైనా ఉద్యోగంలో పిల్లలను నియమించడాన్ని నిషేధిస్తుంది అలా చేయకపోతే నేరం. దీనికి విరుద్ధంగా, 1948 ఫ్యాక్టరీల చట్టం ప్రకారం, 14 మరియు 18 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలను "కౌమార"గా నిర్వచించారు మరియు మైనింగ్, మండే పదార్థం మరియు పేలుడు పదార్థాల సంబంధిత పని మరియు ఇతర ప్రమాదకర ప్రక్రియలలో వారితో పనులు చేయించుకోవద్దన్న నిబంధనలు ఉన్నప్పటికీ బాల కార్మిక చట్టాన్ని తుంగలో తొక్కి ఇటుక బట్టీలలో చిన్న పిల్లలతో సైతం పనులు చేయిస్తున్నారు. పాఠశాలల్లో చదువుకునే వయసు పిల్లలను పనులకు పెట్టుకొని వారితో పనులు చేపిస్తున్నారు.

బడి ఈడు పిల్లలు పనులు చేస్తున్నా కార్మిక శాఖ అధికారులు కానీ విద్యాశాఖ అధికారులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

**కొత్తగూడెం తహసిల్దార్ వివరణ కోరగా..**

పాత కొత్తగూడెంలో నడుస్తున్న ఇటు కాబట్టి మా దగ్గర నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అలా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై చర్యలు తీసుకుంటామని, అలాగే కొనసాగిస్తే ఇటుక బట్టీలను సీజ్ చేస్తామని కొత్తగూడెం తాసిల్దార్ అన్నారు .

**మున్సిపాలిటీ కమిషనర్ వివరణ కోరగా...**

పాత కొత్తగూడెంలో నిర్వహిస్తున్న ఇటుక బట్టీలు తమ దృష్టికి రాలేదని ఎవరు వచ్చి కంప్లైంట్ లు చేయలేదని తమ నుంచి ఎలాంటి అనుమతులు వ్యాపారులు పొందలేదని అన్నారు. అలా అనుమతులు లేకుండా అక్రమ ఇటుకబట్టిలను నిర్వహిస్తే చర్యలు తప్పవని అన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలసిన ఎమ్మెల్యే జారె



దమ్మపేట, ఫిబ్రవరి28(వుదయం ప్రతినిధి): హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ని వారి స్వగృహము నందు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ను మర్యాదపూర్వకంగా కలసి అశ్వారావుపేట నియోజకవర్గ ప్రధాన సమస్యలను వివరించి అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయాల్సిందిగా వినతి పత్రం అందించారు. అనంతరం ముఖ్యమంత్రి తో కలిసి వారి నివాసంలో స్వాతంత్ర సమరయోధులు భారత రాజ్యాంగ నిర్మాణశిల్పి భారతదేశ మొదటి రాష్ట్రపతి భారతరత్న అవార్డు గ్రహీత డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి చిత్రపటానికి పూలను అభిషేకించి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గం సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు అదేవిధంగా అభివృద్ధి పనులకు ఎన్నిధులు మంజూరు చేయవలసిందిగా కోరినట్లు తెలియజేశారు దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలియజేశారు

## జాజాపూర్ లో సివి రామన్ జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



నారాయణపేట టౌన్ 28ఫిబ్రవరి (వుదయం ప్రతినిధి) సివి రామన్ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ నిర్వహించుకొని విద్యార్థులకు క్విజ్ ముగ్గుల పోటీ డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి, జిల్లా సైన్స్ అధికారి హెచ్ భాను ప్రకాష్ మాట్లాడుతూ ద్రవాలపై పడిన కాంతి కిరణాలు ఎలా పరిక్షేపం చెందుతాయో (చెదురుతాయో) తెలిపే పరిశోధన ఫలితాన్నే రామన్ ఎఫెక్ట్ అంటారు అని విద్యార్థులకు బోధించారు. రామన్ 1928లో ఒక రంగు కాంతి పుంజం ఒక ద్రవంలోకి ప్రవేశించినప్పుడు, ఆ ద్రవం ద్వారా చెల్లాచెదురుగా ఉన్న కాంతిలో ఒక భాగం వేరే రంగులో ఉంటుందని కనుగొన్నారు. ఏటా ఒక్కో థీమ్‌తో జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటారని, 2025వ సంవత్సరంలో వికసిత్ భారత్ కోసం సైన్స్ ఇన్నోవేషన్‌లో గ్లోబల్ లీడర్‌షిప్ కోసం భారతీయ యువతకు సాధికారత థీమ్‌తో ఈ జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ,మధుసూదన్ రావు, లక్ష్మణ్,ప్రతాప్,నరసింహ, శశిరేఖ, నిర్మల, మంగళ,శ్రీదేవి, రఘురాం రెడ్డి,మాణిక్యప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

### – ప్రిన్సిపాల్ అప్పని లక్ష్మణ్




లక్షెట్టిపేట, ఫిబ్రవరి 28 (వుదయం ప్రతినిధి): విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకోవాలని, దానిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని వాగేశ్వరి కళాశాల ప్రిన్సిపాల్ అప్పని లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ లో జూనియర్ విద్యార్థులు, సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అప్పని లక్ష్మణ్ మాట్లాడుతూ.... విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. వాగేశ్వరి కళాశాలలో చదివిన ఎందరో విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పుప్పిరెడ్డి శ్రీధర్ రెడ్డి,వెన్నంపెల్లి మహేందర్,గాదాసు సాగర్, గడిగొప్పుల శ్రీనివాస్, గుజ్జేటి నరేశ్, చంద వెంకటరమణ, చిలుకూరి వంశీ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ వ్యక్తికి తీవ్రగాయాలు



అన్నపురెడ్డిపల్లి ఫిబ్రవరి 28:( వుదయం ప్రతినిధి ) అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని కట్టుగూడెం గ్రామంలో ఉన్నటువంటి సీతారామ కెనాల్ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ అబ్బుగూడెం గ్రామానికి చెందిన గడ్డం శ్రీనుకి కుడి కాలుకి తీవ్ర గాయమై ఎముక బయటికి రావటం జరిగింది. లారీ డ్రైవర్ పరారీ లో ఉన్నట్టు సమాచారం,ఘటన స్థలంలో క్లీనర్ ఒక్కడు మాత్రమే ఉన్నాడు. అన్నపురెడ్డిపల్లి కానిస్టేబుల్ రమేష్ పూర్తి సమాచారం సేకరిస్తున్నారు..

## ఢిల్లీలో బీజేపీ అధికారంలో ఐక్యతకు భంగం?



పెద్దపల్లి జిల్లా: ఫిబ్రవరి 28(వుదయం) ప్రతినిధి: అధికార మార్పుతో మారిన చిహ్నాలు %-% అంబేద్కర్, భగత్ సింగ్ చిత్రాల తొలగింపుతో వివాదంఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్యంగా గౌరవనీయమైన వ్యక్తులైన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ చిత్రాలను తొలగించడం రాజకీయ దుమారాన్ని రేపుతోంది. ఈ చర్య వెనుక ప్రభుత్వం ఉద్దేశం ఏమిటనే దానిపై విస్తృత చర్చ ప్రారంభమైంది. అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాత, సమానత్వానికి చిహ్నంగా నిలిచిన వ్యక్తి. అలాగే, భగత్ సింగ్ యువతలో దేశభక్తిని రగిలించిన విప్లవ నేత. అలాంటి చిహ్నాలను తొలగించడం ప్రభుత్వ వైఖరిపై అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇది కేవలం అధికార మార్పు కారణంగా జరిగిందా? లేక ప్రస్తుత పాలకులకు వారి సిద్ధాంతాలు అనుకూలంగా లేకపోవడమే కారణమా?ఈ చర్యపై విపక్షాలు తీవ్రంగా స్పందించాయి. "ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం, విభజన రాజకీయాలకు నిదర్శనం" అని ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ వంటి ప్రధాన ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. అంతేకాదు, సామాజిక వర్గాలు, విద్యార్థి సంఘాలు, దళిత, విప్లవ ఐక్యతకు పట్టం కట్టే వర్గాలు కూడా ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాయి.

ఇక బీజేపీ దీనిపై ఏమంటోంది? "ఇది సాధారణ మార్పు, ప్రతీ ప్రభుత్వానికి తమదైన ప్రాధాన్యత ఉంటుంది" అని బీజేపీ నేతలు వివరణ ఇచ్చినా, ఈ వివరణ పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. అసలు ప్రజాస్వామ్యంలో మార్పులు అధికారంతో పాటు వ్యక్తిగత భావజాలాన్ని నిర్దేశించాల్సిన అవసరముందా?రాజకీయంగా వేడెక్కిన ఢిల్లీ ఈ వివాదం ఎటువైపు దారి తీస్తుంది?

## శ్రీ వాసవి హైస్కూల్లో విద్యార్థులు సైన్స్ డే



జుక్కల్ నియోజకవర్గం వుదయంప్రతినిది

సైన్స్ డే సందర్భంగా శ్రీ వాసవి హైస్కూల్ విద్యార్థులు ఘనంగా సైన్స్ డే నిర్వహించడం జరిగింది. పాఠశాలలో 150 కి పైగా వివిధ రకాల ప్రయోగ ప్రదర్శనలను విద్యార్థులు వారి సైన్స్ ఉపాధ్యాయుల ఆద్వర్యంలో ప్రదర్శించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల సెక్రెటరీ ఉమాకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు సర్ %జ.ఎ% రామన్, అబ్దుల్ కలాం సార్ లాగా ఉన్నతమైన ఆలోచనలు కలిగి ఉన్నత ఆశయాలను పూర్తిచేయాలన్నారు. ఇంకా విద్యార్థులకు సైన్స్ పైన ఎక్కువ అబిరుచి ఎర్పరుచుకోవాలి. మంచి డాక్టర్లు, సైంటిస్టులు తయారై దేశానికి ఉపయోగపడే విధంగా తయారవాలని తెలియ జేశారు. సైన్స్ డేలో బాగంగా పాఠశాల సెక్రెటరీ ఉమాకాంత్ , డైరెక్టర్ శశికాంత్ ప్రిన్సిపల్ వినోద్ సైన్స్ టీచర్స్ స్నేహా మేమ్, యాదవ్, పండరి ఇతర ఉపాధ్యాయ, ఉపాధ్యాయినిలు పాల్గొనడం జరిగింది.

## రేజింగ్ హైస్కూల్లో సైన్స్ ఫెయిర్ వేడుకలు...




కోరుట్ల ఫిబ్రవరి 28 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణ రతాల పంపు ఏరియాలో గల రైజింగ్ హైస్కూల్లో శుక్రవారం సర్ సివి రామన్ జయంతి సందర్భంగా సైన్స్ ఫెయిర్ వేడుకలను నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించి వాటి గురించి వివరించారు సైన్స్ కు సంబంధించిన వివిధ ప్రయోగాల గురించి విద్యార్థిని విద్యార్థులు వివరించినట్లు పాఠశాల కరస్పాండెంట్ కుడేల రాజేంద్రప్రసాద్ తెలిపారు అనంతరం పాఠశాల కరస్పాండెంట్ కుడేల రాజేంద్రప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో సివి రామన్ అంతటి శాస్త్రజ్ఞులు కావాలని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కూడేలా లిఖిత డైరెక్టర్ షాహనాజ్ బేగం చిప్ప మోహన్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## సెయింట్ జార్జ్ స్కూల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాలు






కరీంనగర్ 28(వుదయం ప్రతినిధి): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (%జదీూజు%) మరియు రేకుర్తి, తీగలగుట్టపల్లి మరియు విద్యానగర్ లలోని నీనోస్ బ్లాక్ లలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ప్రాజెక్టుల ప్రదర్శన శుక్రవారం రోజున నిర్వహించారు. ఇందులో భాగంగా 6 నుండి 8వ తరగతి విద్యార్థులకు సి.వి.రామన్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా చైర్మన్ డా.పి.ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చేసినటువంటి నీటి అవసరం అనే అంశంపై అద్భుతమైన నృత్యం, మ్యాజిక్ సైన్స్, రోల్ ప్లే సైన్స్ గేయం మరియు నిత్యజీవితంలో సైన్స్ ప్రాముఖ్యత వంటి నాటకాల ప్రదర్శన ఇచ్చి అందరిని ఆకట్టుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు, విద్యార్థులు బహు చక్కనైన వర్కింగ్ మోడల్స్ తయారు చేశారని, విద్యార్థుల్లో చదువుతోపాటు మంచి ప్రతిభ ఉందని వాఖ్యానించారు, సైన్స్ బృందంను అభినందించారు.

## నిందితులపై రౌడీషీట్లు ఓపెన్

ఆదిలాబాద్, ఫిబ్రవరి28(వుదయం ప్రతినిధి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 25న జరిగిన హత్య కేసులో నిందితులైన ముగ్గురిపై రౌడీ షీట్లు ఓపెన్ చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. పట్టణానికి చెందిన కొమ్మవార్ రవితేజ ను గ్రూపు తగాదాల కారణంగా మహాలక్ష్మీవాడకు చెందిన గోల్డెన్ కార్తిక్,

ఇంద్రానగర్ కు చెందిన సిద్దూ, దావుల సాయికిరణ్ హత్య చేసిన విషయం తెలిసిందే. గతంలో నిందితులపై పలు కేసులు ఉన్న నేపథ్యంలో రౌడీ షీట్లు ఓపెన్ చేసినట్లు పేర్కొన్నారు.

# మంత్రి తుమ్మల చొరవతో అభివృద్ధి పథంలో పూసి కుంట గ్రామం

## గిరిజన గ్రామాన్ని సందర్శించిన మండల కాంగ్రెస్ నాయకులు







దమ్మపేట, ఫిబ్రవరి28(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గిరిజన గ్రామీణ పూసి కుంట గ్రామం తుమ్మల చొరవతో గిరిజన గ్రామం పుసు కుంట అభివృద్ధి పథంలో అడుగులు వేస్తోంది గత కొన్ని రోజుల క్రితం అధికారులతో పర్యటించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూసికుంట గ్రామాన్ని సందర్శించి గిరిజనుల స్థితిగతులు మార్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాలన కృతనిచ్చేయంతో ఐటీడీఏ వారి సహకారంతో 14 బోర్లు, మూడు వంతెనలు మంజూరు చేయించడం జరిగింది . అదేవిధంగా వారి వ్యవసాయ భూములు పామాయిల్ పంటను సాగు చేసే విధంగా అధికారులను ఆదేశించడం జరిగింది ఈ పనులన్నీ శరవేగంతో పూర్తి కానున్నాయి, ఇప్పటికే కొంతమంది రైతులు పామాయిల్ పండుగ సాగు చేస్తున్నారు ఈ సందర్భంగా శుక్రవారం రోజు దమ్మపేట మండల కాంగ్రెస్ నాయకులు పూసుకుంట గ్రామాన్ని సందర్శించి గిరిజనుల పామాయిల్ తోటలను బోర్లను వంతెనను సందర్శించి గిరిజనులకు త్వరగా పామెయిల్ తోటలు పెంచుకొని మీ కుటుంబాలు అభివృద్ధి చేసుకోవలసిందిగా గిరిజనులకు సూచనలు అందించడం జరిగింది ఈ సందర్భంగా గ్రామస్తులను మీ గ్రామానికి మంత్రి తుమ్మల అందించిన సహకారం గురించి పత్రికా సోదరులు కొంతమంది గిరిజనులను, ప్రశ్నించగా ఎట్లా నాగిరెడ్డి రాజారెడ్డి మాట్లాడుతూ మంత్రి తుమ్మల చలువతో మా కుటుంబాల్లో అతి త్వరలో వెలుగులు నింపనున్నాయని చాలా సంతోషంగా ఉందని ఎన్నటికీ మా గిరిజన గ్రామంలో త్రీఫేస్ కరెంటు రాదనుకున్న సమయంలో మాకు బోర్లు మంజూరు చేయించి పామాయిల్ మొక్కలను ఉచితంగా అందించి మొక్కలు నాటించడం జరిగిందని వారు తెలియజేశారు మేము బ్రతికున్నంత కాలం మంత్రి తుమ్మలను మా గుండెల్లో పెట్టుకుంటామని వారన్నారు అదేవిధంగా మా చెలు కు చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని పామాయలకు తగు మందులు సరఫరా చేయాలని వారు కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో కె వి సత్యనారాయణ, కొయ్యల అచ్యుతరావు, ఎర్రా వసంతం, కాసాని నాగ ప్రసాద్, వెల్లిన మురళి తదితరులు పాల్గొన్నారు

# ఓఆర్ఎస్ఎల్ తయారీదారుల ఆధ్వర్యంలో 'డయేరియా సీ డార్ నహీ' క్యాంపెయిన్ ప్రారంభం

## –రాబోయే 2ం సంవత్సరాలలో ఐదేళ్లలోపు ఉన్న ఐదు మిలియన్ పిల్లలను చేరడమే లక్ష్యం

హైదరాబాద్, ఫిబ్రవరి , 2025: చిన్నారులలో డయేరియా మరణాలను అరికట్టడమే లక్ష్యంగా 'డయేరియా సీ డార్ నహీ' క్యాంపెయిన్ ప్రారంభించినట్లు కెన్వ్యూ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ ఆనందనీ తెలిపారు. ఈ ప్రజారోగ్య క్యాంపెయిన్ పాపులేషన్ సర్వీసెస్ ఇంటర్నేషనల్ ఇండియా (పీఎస్ఐ ఇండియా)తో కలిసి చేస్తున్నామన్నారు. ఇటీవల వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆమోదిత ఫార్ములాతో రెడీ టు డ్రింక్ ఓఆర్ఎస్ ను ప్రారంభించామన్నారు. ఐదు మిలియన్ల 5 సంవత్సరాల లోపు చిన్నారులను 2సంవత్సరాలలో చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ క్యాంపెయిన్ ఉత్తరప్రదేశ్, బీహార్‌లోని 10 జిల్లాల్లో డయేరియాతో మృతి చెందే శిశువుల సంఖ్యను తగ్గించేందుకు, ఆరోగ్య పరిరక్షణను మెరుగుపరిచేందుకు కృషి చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం భారత ప్రభుత్వ 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్'కు తోడ్పాటు అందిస్తూ.. దేశంలో డయేరియాతో చనిపోయే చిన్నారుల సంఖ్యను జీరోకు తీసుకెళ్లే లక్ష్యాన్ని సాధించేందుకు పిల్లలకు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కెన్వ్యూ (ఓఆర్ఎస్ఎల్ తయారీదారులు), పీఎస్ఐ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, స్థానిక ఆరోగ్య అధికారులతో కలిసి సమగ్ర డయేరియా నిర్వహణ ప్రణాళికను అమలు చేయనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సమాజంలో డయేరియా నిర్వహణపై అవగాహన పెంచనున్నామని తెలిపారు. డయేరియా నిర్వహణలో కీలక పాత్ర పోషించే ఆరోగ్య కార్యకర్తలు (ఆశా) సామర్థ్యాన్ని పెంచడం ముఖ్యమన్నారు. డయేరియా కేసులను తొందరగా గుర్తించడం, ఐదేళ్ల లోపు పిల్లలకు ఒరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్ (ఓఆర్ఎస్), జింక్ పంపిణీ చేయడం ద్వారా సమగ్ర చికిత్స అందించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉత్తర ప్రదేశ్‌లోని బదౌన్, మథుర, ఉన్నావో, మొరాదాబాద్, గోండా, శ్రావస్తి, ఫిరోజాబాద్, బీహార్‌లోని సుపాల్, దర్భంగా, పూర్నియాలో అమలు చేయనున్నామన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) సూచించిన ఒరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్ (ఓఆర్ఎస్) డయేరియా చికిత్సకు బంగారు ప్రమాణంగా (గోల్డ్ స్టాండర్డ్) పరిగణించబడుతుందన్నారు. అయినా, తక్కువగా సూచించబడుతుందన్నారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే–5 (2019–21) ప్రకారం.. ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్ అందించబడే శాతం క్రమంగా మెరుగుపడుతుందన్నారు. ఇది 60.6శాతంగా ఉందని, అయినా తక్కువగానే ఉందన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో డయేరియాతో బాధపడుతున్న పిల్లల్లో మూడింట రెండు వంతుల మంది (63 శాతం) తక్కువ నీరు తాగడం లేదా పూర్తిగా తాగకపోవడం అన్నారు. ఇది సమగ్ర డయేరియా నిర్వహణ పద్ధతుల అవసరాన్ని స్పష్టంగా చూపిస్తుందన్నారు. ఓఆర్ఎస్ఎల్ మా ప్రతిష్టాత్మక ఎలెక్ట్రోలైట్ బ్రాండ్ అన్నారు. అధునాతన హైడ్రేషన్ ఫార్ములేషన్‌లతో ఫ్లూయిడ్, ఎలెక్ట్రోలైట్‌లు, ఎనర్జీ సంబంధిత శాస్త్రాన్ని ముందుకు తీసుకెళుతుందన్నారు. ఈ సందర్భంగా పీఎస్ఐ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముకేశ్ కుమార్ శర్మ మాట్లాడుతూ డయేరియా నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, శుభ్రత ప్రమాణాల ప్రచారం, పోషకాహార అలవాట్లను ప్రోత్సహించడం, ఓఆర్ఎస్ వినియోగాన్ని పెంపొందించడం వంటి చర్యలు అభినందనీయం అన్నారు. పీఎస్ఐ ఇండియా నేషనల్ హెల్త్ మిషన్, భారత ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలకు విశ్వసనీయ భాగస్వామిగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిని విస్తరించేందుకు, డయేరియా మరణాలను తగ్గించేందుకు కట్టుబడి ఉందన్నారు

# పనిచేయని పల్లె దావఖానలు.

### నిర్మాణంపూర్తయిన.ప్రారంభానికి నోచుకోని వైనం.
### పట్టించుకోని పాలకులు.
### ఇబ్బందుల్లో ప్రజలు.
### సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్.



ఫిబ్రవరి 28 భూపాలపల్లి వుదయం ప్రతినిధి.జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన పల్లె దావఖానాలు పనిచేయడం లేదని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన టేకుమట్ల మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన ప్రారంభానికి నోచుకోని పల్లె దావఖాన భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడం కోసం పల్లె దావఖానాలుకు సుమారు 20 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. టేకుమట్లమండల కేంద్రం మరియు గరిమిల్లపల్లి , వెలిశాల గ్రామాల్లో అట్టి భవన పనులు పూర్తయిన నేటికీ అట్టి భవనాలను ప్రారంభించకపోవడం దారుణమని అన్నారు. భవనం లేక రోగుల అనేక ఇబ్బందులు పడుతున్నారని టేకుమట్ల గ్రామపంచాయతీలోని ఒక గదిలో తాత్కాలిక సేవలు అందించడం మూలంగా సిబ్బంది కూడా అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పల్లె దావఖానాల ద్వారా సకాలంలో వైద్య సేవలు అందుతాయి అనుకున్న పేద ప్రజల ఆశలు అడియాశలు అయ్యాయని అన్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత పాలకులు పట్టించుకోవడంలేదని ఇకనైనా పాలకులు ,సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్ కు పెండింగ్ బిల్లులను చెల్లించి, పల్లె దావఖానాలను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# పదవీవిరమణ పొందిన పోలీసులకు సన్మానం



హనుమకొండ, ఫిబ్రవరి 28(వుదయం జిల్లా ప్రతినిధి) : వరంగల్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారులు ఏసీపీ భోజరాజు,ఎస్. ఐ లు సాధిక్ అలీ , రవీందర్, మధు బాబులను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ అంబర్ కిషోర్ ఝా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మీసేవలను నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తాయని పదవీ విరమణ తర్వాత కూడా మీ గౌరవం తగ్గదని, ఆరోగ్యం శ్రద్ద వహించాలని నిత్యం వ్యాయామం కొరకు కొద్ది సమయాన్ని కేటాయించాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సురేష్ కుమార్, ఏసీపీలు నాగయ్య , సురేంద్ర, సత్యనారాయణ, ఆర్.ఐలు సతీష్ , శ్రీనివాస్, స్పర్జన్ రాజ్ ఆర్. ఎస్. ఐ శ్రవణ్ తో పాటు పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# సైబర్ నేరాలపై బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్నట్రైనీ ఎస్సై గోవర్ధన్..



ఎల్కతుర్తి ఫిబ్రవరి 28(వుదయం ప్రతి నిది) హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం స్థానిక పోలీస్ స్టేషన్లో రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలపై మరియు బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తూ.. మీయొక్క మొబైల్ ఫోన్లో వివిధ ఆకర్షణీయమైన ప్రకటనలు చేస్తూ మిమ్మలను మోసం చేయాలని ఉద్దేశంతో సైబర్ నేరగాళ్లు ముందుకు వస్తున్నందున ప్రజలు గమనించి వారి యొక్క మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని వారికి తగు సూచనలు సలహాలు ఇస్తున్న ట్రైనీ ఎస్సై గోవర్ధన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకునే అమ్మాయిలు చిన్నతనంలోనే బాల్య వివాహాలు చేయుచున్నందున వారి యొక్క తల్లిదండ్రులకు అవగాహన కల్పించి . బాల్య వివాహాలు నివారించాలని గ్రామంలో ఉన్న యువతకు తగు సూచనలు ఇచ్చారు.. మీ కుటుంబాలలో ఉన్న చిన్న సమస్యలను పెద్దగా చేసుకొని గొడవలు కొట్లాటలు దిగవద్దని కోర్టుల చుట్టూ పోలీస్ స్టేషన్లో చుట్టూ తిరగవద్దని దాని వలన ఆర్థికంగా నష్టపోతారని ఇరువర్గాల కుటుంబాలకు కక్ష సాధింపులు పెరిగిపోతాయని ఈ సందర్భంగా తెలిపారు కార్యక్రమంలో కానిస్టేబుల్ విట్టల్ రావు వీరస్వామి కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇచ్చిన ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కలిసికట్టుగా పోరాడుదాం



యాదాద్రి భువనగిరి /ఫిబ్రవరి 28 వుదయం పతినిధి :–:–మోత్కూరు మండల జర్నలిస్టలకు గత ప్రభుత్వం ఇచ్చిన ఇండ్ల స్థలాల విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించుకొని వాటి సాధనకు జర్నలిస్టులందరూ కలిసికట్టుగా పోరాడదామని టి యు డబ్ల్యూ జే యూనియన్ జిల్లా మాజీ కార్యదర్శి, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు వెలిమినేటి జహ%శీ%గిర్ అన్నారు. శుక్రవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో టి యూ డబ్ల్యూ జె ( ఐ జె యూ) నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా సంయుక్త కార్యదర్శి దబ్బేటి సోంబాబు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జహంగీర్ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధన కోసం యూనియన్ ఎన్నో పోరాటాలు చేసిందని, మున్ముందు కూడా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు. మోత్కూర్ లో జర్నలిస్టులకి ప్రభుత్వం ఇచ్చిన ఇండ్ల స్థలాలను ఎమ్మెల్యే సామెల్ దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు యూనియన్ తరఫున కృషి చేస్తామన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు ను ప్రారంభించారు. ఈ సందర్భంగా 24 మంది జర్నలిస్టుల కు సభ్యత్వాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సీనియర్ సభ్యులు కాయితాల నర్సిరెడ్డి, ఎస్ ఎన్ చారి, మండల కమిటీ ప్రతినిధులు ఎం డి షాకీర్, సి హెచ్ అనిల్ , కె సైమన్, ఆకవరం శ్రీనివాసులు, గుండు ప్రసాద్, మాశెట్టి వెంకన్న, గంట శ్రీనివాస్ రెడ్డి, ధబ్బేటి రమేష్, గాదెనబోయిన నాగరాజు, వారాల నరేష్, పోచం కన్నయ్య, నర్రె సురేష్, ముషం శ్రీను, బుంగపట్ల యాకయ్య, గోవర్ధన్ రెడ్డి, సూరారం నర్సింహా, బోయిని వెంకన్న,గణగాని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో సంస్కారం తోడైతేనే విజయం వరిస్తుంది – డా: బుర్ర మధుసూదన్ రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్



హైదరాబాద్,ఫిబ్రవరి28(వుదయం ప్రతినిధి): చదువుతో పాటు సంస్కారం, విద్యతో పాటు వినయం తోడైతేనే ఎంచుకున్న లక్ష్యాలు నెరవేరుతాయని విశ్రాంత ప్రిన్సిపాల్, రచయిత, కాలమిస్ట్ అన్నారు. ఈ రోజు మెట్‌పల్లి ప్రభుత్వ మైనారిటీ పాఠశాల, జూనియర్ కళాశాల ముఖ్య అతిథిగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సైన్స్ రంగంలో పరిశోధనలు చేసే స్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా కృషి చేయాలని, శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని కోరారు. పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ విద్యార్థుల్లో మానసిక ఆందోళన పెరిగిందని, భయం వీడితేనే సత్ఫలితాలు అందుతాయని తెలిపారు. సైన్స్, టెక్నాలజీ, ఇంగ్లీష్, మ్యాథ్స్ రంగాల్లో నిష్ణాతులైన యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూచించారు. ప్రతి పరీక్షలో కొంత ఎక్కువ మార్కులను సాధిస్తూ తమ రికార్డును తానే బ్రేక్ చేస్తూ ఎదగాలన్నారు. ఇంటర్‌లో 900 మార్కులు, 10వ తరగతిలో 9.0 గ్రేడ్ దాటిన విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం, విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందిస్తామని ప్రకటించారు.

గౌరవ అతిథి లయన్ రాళ్లబండి శంకర ప్రసాద్? రెడ్డి మాట్లాడుతూ గురువుల బోధనలు నమ్మిన వారందరూ తమ తమ జీవితాల్లో అద్భుతాలను సాధించారని అన్నారు. మనిషిగా మానవత్వాన్ని పెంపొందించుకోవాలని సలహా ఇచ్చారు. సభాధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తమ కళాశాల విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధిస్తున్నారని సంతోషం వ్యక్తం చేసారు. మెట్‌పల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు వేణుగోపాల్ కూడా పాల్గొని మాట్లాడారు. ఈ వేదిక మీద రాజరాజేశ్వర లయన్స్ క్లబ్ సౌజన్యంతో పదవ తరగతి, ఇంతటర్ విద్యార్థులకు 100 మందికి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్, స్కేల్స్ ఉచితంగా వితరణ చేసారు.

# అక్కనపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

### ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన మెడికల్ అధికారి డాక్టర్ వరూధినికి సోకాజ్ నోటీస్ జారీ
### అనుమతి లేకుండా విధులకు గైర్ హాజరైతే చర్యలు తప్పవు...... మరోసారి హెచ్చరించిన జిల్లా కలెక్టర్



నల్గొండ పిబ్రవరి 28(వుదయం ప్రతినిధి): నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం నార్కెట్ పల్లి మండలం, అక్కనపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సిబ్బంది హాజరు రిజిస్టర్ ను,మందుల స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరూధిని ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా, సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరైనట్లు సిబ్బంది ద్వారా ఆమె నిర్ధారించుకున్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎవరు విధులకు గైర్ హాజరు కావద్దని జిల్లా యంత్రాంగం పదేపదే అధికారులు, సిబ్బందికి తెలియజేస్తున్నప్పటికీ డాక్టర్ వరూధిని ఉన్నతాధికారుల అనుమతి లేకుండా, ముందస్తు సమాచారం లేకుండా,ఎలాంటి సెలవు పెట్టకుండా విదులకు గైర్హాజరు కావడం ఆమెకు విధుల పట్ల ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నదని, అందువల్ల ఆమెపై క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని కోరుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ వరూధినికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. పి హెచ్ సి సిబ్బందితో కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు, వృద్ధులు, తదితరులకు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మందుల స్టాక్ రిజిస్టర్ను తనిఖీ సందర్భంగా ఎలాంటి మందులు ఇస్తున్నారని.....? చికిత్స ఎలా చేస్తున్నారని.....? స్టాఫ్ నర్స్, తదితరుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న చికిత్స, వారి పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలు, అలాగే చిన్న పిల్లలకు ఇచ్చే టీకాలు, తదితర వివరాలను అడిగారు.

ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ద్వారా మంచి సేవలు అందించాలని, అందరిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. సమస్యాత్మక కేసులు వచ్చినట్లయితే నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధానాస్పత్రికి పంపించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇదే మండలం చిన్న నారాయణపురం లో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్



కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల హాస్టల్ కిచెన్ ను, స్టోర్ ను, అలాగే వంట సరుకులు, కూరగాయలు, పప్పు దినుసులు అన్నిటిని పరిశీలించారు. వంటగది శుభ్రంగా లేకపోవడంపై ప్రిన్సిపల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి వంటగది అపరిశుభ్రంగా ఉన్నట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి మాట్లాడి ప్రశ్న, జవాబుల ద్వారా విద్య సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థినిలకు చాక్లెట్లను పంపిణీ చేశారు. కాగా తమ కళాశాల హాస్టల్ కు పక్కా భవనాన్ని మంజూరు చేయాలని ప్రిన్సిపల్, సిబ్బంది జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేయగా పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకట్ నార్కెట్ పల్లి తహసిల్దార్ వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

# అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదు



నారాయణపేట టౌన్ 28ఫిబ్రవరి (వుదయం ప్రతినిధి) అన్నదానం చేయడంతో ఇతరుల ఆకాలిని తీర్చిన వారవుతారని అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదని విశ్వాహిందు పరిషత్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాంబాబు అన్నారు. యాద్గీర్ రోడ్ లో గల అయ్యప్ప స్వామి దేవాలయం లో ఆయన ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయ కమిటి సభ్యులు సుధాకర్ గౌడ్, శేఖర్ రెడ్డి,సైదప్ప, మిర్చి వెంకటయ్య,సూరి,రవి, బట్టి బాల్ రాజ్,మహిళలు భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



వెల్దండ ఫిబ్రవరి 28 (వు దయం ప్రతినిధి) జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని లోని మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సైన్స్ ప్రయోగాల ప్రదర్శన పలువురుని ఆకట్టుకున్నాయి ఈ సందర్భంగా జిహెచ్ఎం సుగుణ మాట్లాడుతూ సైన్స్ ప్రయోగాలు ప్రదర్శన విద్యార్థుల మేధాశక్తిని పెంపొందింప చేస్తాయని అన్నారు ఈ పాఠశాల విద్యార్థులు తయారుచేసిన సౌర కాంతితో సోలార్ వాటర్ ఫిల్టర్ ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికైందని తెలిపారు ఉపాధ్యాయులు మురళి రాజేందర్, విజయ, లావణ్య, భారతి, రామేశ్వరమ్మ, లక్ష్మి, సుహాసిని, అనిత తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు

### నిత్యజీవితంలో మనలో భాగంగా సైన్స్: ఎంఏ వాజీదు

# ఘనంగా సైన్స్ దినోత్సవం



చంద్రుగొండ ,ఫిబ్రవరి 28:( వుదయం ప్రతినిధి): నిత్యజీవితంలో మనలో భాగంగా సైన్సు మన వెంటే ఉంటుందని విద్యార్థులు తమ సృజనాత్మకకు పదును పెట్టి అనేక ప్రయోగాలు చేయాలని జిల్లా పరిషత్ చంద్రుగొండ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఏ వాజిద్ సూచించారు. జాతీయ దినోత్సవ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తమ ప్రతిభ పాట వాళ్లకు పదును పెట్టి అనేక ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఆనంద ఉత్సాహాల మధ్య సైన్స్ దినోత్సవాన్ని ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు రాజశ్రీ ,సతీష్ ,అనితా బేబీ, బేబీ రాణి ,ఇందిరా రాణి, తోపాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు...

# గిరిజనులపై దాడి చేస్తే ఊరుకునేది లేదు



హుస్నాబాద్ ( ఫిబ్రవరి):28:తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆల్ ఇండియా తెలంగాణ బంజారా సేవ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నున్సావత్ భాస్కర్ నాయక్ ఈరోజు ఉత్తరప్రదేశ్ లో ఆలీఘాట్ ,డిస్టిక్ లో ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్ళగా అక్కడి గిరిజన నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం భాస్కర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి గిరిజన విద్యార్థినీ విద్యార్థులు విద్యారంగంలో ముందుండి ఉద్యోగ పరంగా ఎదుగుతూ ఆర్థికంగా బలపడాలని సూచించారు. దేశవ్యాప్తంగా గిరిజన మహిళలలు పురుషులపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని ప్రతి గిరిజనుడికి ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ అండగా ఉండి న్యాయం చేస్తుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ బంజారా సేవా సంఘ్ జిల్లా నాయకులు సతీష్ నాయక్, సురేష్ నాయక్, మల్లేష్ నాయక్, సంజయ్ నాయక్, రంజిత్ నాయక్ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఎన్ డి ఆర్ ఎఫ్ రెస్క్యూ ఆపరేషన్ విజయవంతం

### కోనేరు నుండి విద్యార్థి ఉమేష్ మృతదేహాన్ని వెలికితీత బృందాన్ని అభినందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



వెల్దండ ఫిబ్రవరి 28 (వు దయం ప్రతినిధి) మండల పరిధిలోని గుండాల గ్రామంలో అంబరామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని కోనేరులో గత రెండు రోజుల క్రితం ఉమేష్ అనే విద్యార్థి గల్లంతైన సంఘటన నేపథ్యంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు జాతీయ విపత్తుల నిర్వహణ బృందం సభ్యులు 28 గంటలపాటు నిర్విరామంగా కోనేరులోకి దిగి ఎట్టకేలకు ఉమేష్ మృతదేహాన్ని కనుగొని క్రేన్ ల ద్వారా పైకి తెచ్చారు రెస్ట్ ఆపరేషన్ ఫలించి ఎట్టకేలకు విద్యార్థి శవాన్ని వెలికితీతతో ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు ప్రజలు ఆందోళనకు దిగడంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యమంత్రి తో మాట్లాడి ఎస్ ఎల్ బి సి నిర్వాసితులతోపాటు మృతుడు ఉమేష్ కు పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు రెండు రోజుల నుండి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ప్రజా ప్రతినిధులు మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి,, మార్కెట్ చైర్మన్ యాదవ్, మట్ట వెంకటయ్య గౌడ్ స్థానిక సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్సై కురుమూర్తి, నిర్విరామంగా కృషిచేసి ఎట్టకేలకు విద్యార్థి శవాన్ని వెలికితీయడం పట్ల కుటుంబ సభ్యులు , ప్రజలు అభినందించారు

# మైత్రి మహిళా పొదుపు సంఘం 17వ వార్షికోత్సవం.

### ముఖ్యఅతిథిగా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి.



నర్సంపేట వుదయం ప్రతినిధి ఫిబ్రవరి 28.నర్సంపేట రూరల్ మండలంలోని రాజపల్లె గ్రామంలో నర్సంపేట రూరల్ మండలం పార్టీ అధ్యక్షులు నామాల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన మైత్రి మహిళా పొదుపు సంఘం 17వ వార్షికోత్సవ సభలో వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ స్వప్న సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక క్రమశిక్షణ పొదుపు ద్వారానే సాధ్యమవుతుంది, కుటుంబ బాధ్యతలు నిర్వహించే మహిళలు ఐక్యమత్యంతో పొదుపును పాటించడం వలన కుటుంబం తద్వారా సంఘం మరియు గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. గత 17 సంవత్సరాలుగా గ్రామా మహిళలంతా కలిసి ఒకే కుటుంబ సభ్యులుగా క్రమశిక్షణతో సంఘాన్ని నడపడం నాకు ఎంతో స్ఫూర్తి ఇచ్చిందని భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని కోరుతూ సంఘ బాధ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మరియు మైత్రి పొదుపు సంఘం బాధ్యులు గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

# ప్రారంభమైన గ్రామ దేవత బొడ్రాయి పూజలు.

### ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో.
### ఎస్సీ సెల్ అధ్యక్షుడు భూక్య భానుప్రసాద్.



ఖానాపురం ఫిబ్రవరి 28 వుదయం ప్రతినిది.మండలంలోని బోటిమీదితండా గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామదేవత (బొడ్రాయి )భూలక్ష్మి శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం మార్చి రెండవ తారీకు ఆదివారం ఉదయం 7:25 నిమిషాలకు నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, గ్రామస్తుల సహాయ సహకారంతో యంత్ర విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు భూక్య భానుప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం పూజా కార్యక్రమాలు ప్రారంభమైనట్లు తెలుపుతూ శుక్రవారం నుండి ఆదివారం ఉదయం వరకు వివిధ రకాల పూజా కార్యక్రమలు హెూమాలు నిర్వహించి ఉదయం 7: 25 నిమిషాలకు యంత్ర విగ్రహ ప్రతిష్టాపన మహెూత్సవ కార్యక్రమంను నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి గ్రామస్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా వేద పండితులు తాడూరి నాగరాజు బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పూజా కార్యక్రమంలో భూక్య భానుప్రసాద్ సుమలత దంపతులు, శంకర్ జ్యోతి దంపతులు, కోబల్ నాగమ్మ దంపతులు, బద్రురుక్కమ్మ దంపతులు, శంకర్ లింగమ్మ దంపతులు, దాన్యవిజయ దంపతులతోపాటు రాకేష్, బన్నీ తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉచిత యోగ శిక్షణను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి




బెల్లంపల్లి, పిబ్రవరి28 (వుదయం ప్రతినిధి) డాక్టర్ శృతి మెడికల్ ఆఫీసర్ (బిఎఎంఎస్ ) యోగభ్యాసనం వల్ల మానసిక ప్రశాంతత తోపాటు సంపూర్ణ ఆరోగ్యానికి యోగ సాధన ఎంతో దోహద పడుతుందనిడాక్టర్ శృతి మెడికల్ ఆఫీసర్ (బిఎఎంఎస్ ) అన్నారు.శుక్రవారం ఆమె వుదయం ప్రతినిధి తో మాట్లాడారు తాండూరు మండల ప్రజలు ప్రతి రోజు ఉదయం 6:30 నుండి7:30 వరకు పురుషులకు, అలాగే సాయంత్రం 4:30 నుండి 5:30 వరకు మహిళలకు మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో ఉచిత యోగ శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ యోగ శిక్షణా తరగతులను కోచ్ లు ఎం చంద్రశేఖర్ (పురుషలకు), వజ్ర (మహిళలకు) నేర్పడం జరుగుతుందని పేర్కొన్నారు. కాలానికి అనుగుణంగా అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

బోథ్, ఫిబ్రవరి28(వుదయం ప్రతినిధి): జైనథ్ మండలం పెన్ గంగా నది నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు సీఐ డి. సాయినాథ్, ఏఎస్ఐలు సిరాజ్, స్వామి సిబ్బందితో కలిసి లేకర్వాడ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు మూడు ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడ్డాయి.

ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ. అక్రమంగా ఇసుక తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సర్వం సిద్ధమవుతున్న సైన్స్ డే.!

### – సర్వం సిద్ధం చేసిన సైన్స్ ఉపాధ్యాయుడు రాజేంద్ర కుమార్



హనుమకొండ, ఫిబ్రవరి 28(వుదయం జిల్లా ప్రతినిధి) : హనుమకొండ జిల్లా గోపాలపురం ప్రాంతంలోని విద్యాధరి ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం జాతీయ విజ్ఞాన దినోత్సవం జరుపుకొనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం అపర్ణ వైవి రావులు మాట్లాడుతూ....

జాతీయ విజ్ఞాన దినోత్సవమును భారతదేశంలో ప్రతి సంవత్సరం నేడు జరుపుకుంటారని ఆయన అన్నారు. రామన్ ఎఫెక్ట్ను కనిపెట్టిన చంద్రశేఖర వేంకట రామన్ 28-02-1928న తన పరిశోధనా ఫలితాన్ని ధ్రువపరచుకున్నాడు. ఈ పరిశోధన ఫలితాన్ని ధ్రువపరిచిన ఈ రోజును నేషనల్ సైన్స్ డే గా జరుపుకుంటున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు వివిధ ఎగ్జిబిట్స్ ప్రదర్శించి వారి నైపుణ్యాన్ని చాటుకో బోతున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూర్ మండల టి యూ డబ్ల్యూ జె (ఐ జె యూ) నూతన కమిటీ ఎన్నిక



యాదాద్రి భువనగిరి /ఫిబ్రవరి 28వుదయం పతినిధి :-మోత్కూర్ మండల కేంద్రంలో టి యూ డబ్ల్యూ జె ( ఐ జె యూ) నూతన కమిటీని శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో యూనియన్ జిల్లా మాజీ కార్యదర్శి ,జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు వెల్మినేటి జహంగీర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా ధబ్బేటి సోంబాబు,అధ్యక్షులుగా ఆకవరం శ్రీనివాసులు,ప్రధాన కార్యదర్శి గా మాశెట్టి వెంకన్న,ఉపాధ్యక్షులుగా గంట శ్రీనివాస్ రెడ్డి, సహాయ కార్యదర్శి గా బుంగపట్ల యాకయ్య,కోశాధికారి గా గుండు ప్రసాద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ని యూనియన్ నాయకులు శాలువలతో ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షుడు ఆకవరం శ్రీనివాసులు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తానని,జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సీనియర్ సభ్యులు ,గౌరవ సలహాదారులు కాయితాల నర్సిరెడ్డి, ఎస్ ఎన్ చారి,మండల కమిటీ ప్రతినిధులు ఎం డి షాకీర్,చేపూరి అనిల్ ,కాపర్తి సైమన్,ధబ్బేటి రమేష్,గాదేనబోయిన నాగరాజు,వారాల నరేష్,పోచం కన్నయ్య,నర్రె సురేష్, ముషం శ్రీనివాస్ ,బుంగపట్ల యాకయ్య,గోవర్ధన్ రెడ్డి,సూరారం నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూర్ లో విజయవంతంగా యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం



యాదాద్రి భువనగిరి /ఫిబ్రవరి 28 వుదయం పతినిధి :-మోత్కూర్ మండల కేంద్రంలో టి యూ డబ్ల్యూ జె ( ఐ జె యూ) నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా పూర్తయ్యింది.స్థానిక గ్రంథాలయంలో యూనియన్ జిల్లా సంయుక్త కార్యదర్శి ధబ్బేటి సోంబాబు అధ్యక్షతన నిర్వహించిన మండల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో యూనియన్ జిల్లా మాజీ కార్యదర్శి, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు వెల్మినేటి జహంగీర్ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధన కోసం యూనియన్ ఎన్నో పోరాటాలు చేసిందని,ముమ్ముందు కూడా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు.మోత్కూర్ లో జర్నలిస్టుల కి ప్రభుత్వం ఇచ్చిన ఇండ్ల స్థలాలను ఎమ్మెల్యే సామేల్ దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు.అనంతరం సభ్యత్వ నమోదు ను ప్రారంభించారు.ఈ సందర్భంగా 24 మంది జర్నలిస్టుల కు సభ్యత్వాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సీనియర్ సభ్యులు కాయితాల నర్సిరెడ్డి, ఎస్ ఎన్ చారి,మండల కమిటీ ప్రతినిధులు ఎం డి షాకీర్,సి హెచ్ అనిల్ ,కె సైమన్,ఆకవరం శ్రీనివాసులు,గుండు ప్రసాద్,మాశెట్టి వెంకన్న, గంట శ్రీనివాస్ రెడ్డి,ధబ్బేటి రమేష్,నాగరాజు,వారాల నరేష్,పోచం కన్నయ్య,నర్రె సురేష్,ముషం శ్రీనివాస్ ,బుంగపట్ల యాకయ్య,గోవర్ధన్ రెడ్డి,సూరారం నర్సింహా, బోయిని వెంకన్న,గణగాని రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల ఆదర్శ పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ సంబరాలు.



ఫిబ్రవరి 28 భూపాలపల్లి వుదయం ప్రతినిధి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాల/ కళాశాలలో ( మోడల్ స్కూల్)ఇన్చార్జి ప్రిన్సిపాల్ నీలం రవీందర్, గారి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమాన్ని, పురస్కరించుకొని నీలం రవీందర్ మాట్లాడుతూ. ఈరోజు సర్ సివి రామన్ గురించి మనం గొప్పగా చెప్పుకోవాల్సిన అవసరం ఉందన్నారు రామన్ ఎఫెక్ట్ కనుగొన్నరోజు, అని రామన్ ఎఫెక్ట్ అంటే సముద్రపు నీటిపై సూర్యకాంతి పడినప్పుడు ఆ కాంతి లోని నీలపు రంగు ఎక్కువగా పరిక్షేపనం చెంది మన కంటిని చేరడం వలన సముద్రపు నీరు నీలం రంగుగా మారుతుందని ఇలా ద్రవాలపై పడిన క్రాంతి కిరణాలు ఎలా పరిక్షేపనం చెందుతాయో తెలిపే పరిశోధననే రామన్ ఎఫెక్టు అంటారన్నారు. సర్ సివి రామన్ కు భారత ప్రభుత్వం భారతరత్నపురస్కారం ఇచ్చి గౌరవించింది ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవం గా ప్రకటించింది. అని అన్నారు

అదేవిధంగా ఫేర్వెల్ డే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పిల్లలు ఆటపాటలతో సంతోషాలతో తన్మయత్వంతో ఆనందం పొందారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వాసాల వెంకటేశ్వర్లు సమీరా, ఆయేషా వాణి, రాజు, శివ, జోష్ణ, శ్రీలత, ఎండి శ బిరుద్దీన్, ప్రసన్న, ఎండి కలీం పాషా, రామస్వామి, భాస్కర్, మోరే సాగర్ పుట్టరాజు శ్రీకాంత్, ఆర్ పి, పి ఈ టి అశోక్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఘనంగా రథోత్సవం మరియు అన్నదాన కార్యక్రమం

### దేవాలయాన్ని సందర్శించిన మేళ్లచెరువు వాసి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ జి వీరారెడ్డి శంభోరాణి దంపతులు

మేళ్లచెరువు /హుజూర్నగర్ ఫిబ్రవరి 28 (వుదయం ప్రతినిధి): సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ ఇష్ట కామేశ్వరి సమేత శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవస్థానమునందు మూడో రోజున ప్రాత కాలమునందు స్వామివారికి పుణ్యా వచనం, గణపతిపూజ, అభిషేకములు నిర్వహించడం జరిగినది. తదుపరి స్వామి వారిని పెద్దరథం పై వేంచేసి గణపతి పూజ,హోమము నృత్య ప్రదర్శనలతో శివనామ స్మరణతో మేళ్లచెరువు పురవీధులలో ఊరేగించడం జరిగినది. రాత్రి సత్య హరిచంద్ర, పలనాటి యుద్ధం అను పౌరాణిక నాటకంలు ప్రదర్శించటం జరిగినది. మొదటి రోజు 5500 మందికి, రెండవ రోజు పదివేల మందికి, మూడవరోజు 11374 మంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది. ఈరోజు మేళ్లచెరువు గ్రామానికి చెందిన భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ జి వీరారెడ్డి- శంభోరాణి దంపతులు స్వామి వారిని సందర్శించే ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. దేవాలయ సిబ్బంది వారిని ఘనంగా సన్మానించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో దేవాదయ శాఖ కమిషనర్ కే భాస్కర్, దేవాలయ కార్యాలయ నిర్వహణ అధికారి గుజ్జుల కొండారెడ్డి చైర్మన్ శాగంరెడ్డి శంబిరెడ్డి, కమిటీ సభ్యులు, ఐరా రియాలిటీ పోశం వీరారెడ్డి, కాకునూరి భాస్కర్ రెడ్డి, శాగంరెడ్డి గోవిందరెడ్డి, ఇరిగిల రామకృష్ణారెడ్డి,శెట్టి రామచంద్రరావు,యాజ్ఞికులు కొంకపాక రాధాకృష్ణమూర్తి,ఆలయ పూజారులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయ శర్మ ఆలయ సిబ్బంది కొండారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆపదలో ఆదుకున్న ఎస్ బిఐ లైఫ్ ఇన్సూరెన్స్.

### -ఉపేందర్ కుటుంబానికి 10 లక్షల చెక్కు అందచేత.
### -ఎస్ బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ బండి నరేష్

బయ్యారం(వుదయం ప్రతినిధి) ఫిబ్రవరి 28.మండలంలోని గంధంపల్లి గ్రామంలో 2024 డిఎస్సి లో టీచర్ ఉద్యోగం సాధించి ఇటీవల మృతి చెందిన సంద్ర ఉపేందర్ కి ప్రభుత్వ టీచర్ ఉద్యోగం వచ్చి నెల రోజులు కాకా ముందే విధుల్లో బాగంగా స్కూలుకు వెళ్తుండగా ప్రమాదవాశాత్తు రోడ్డు ప్రమాదం జరిగి మరణించారు,ఉపేందర్ ఎస్ బీఐ లైఫ్ లో 25,000 తో స్మార్ట్ స్కాలర్ పాలసీ తీసుకోవటం జరిగింది, తన డెత్ క్లైయిమ్ కింద 10 లక్షల బీమా ఎస్ బీఐలైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ బండి నరేష్ మృతుడి ఉపేందర్ కుటుంబ సభ్యులకు నామినీ సంద్ర స్వప్న కు శుక్రవారం అందచేశారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ బీ ఐ లైఫ్ స్మార్ట్ స్కాలర్ పాలసీ కేవలం 25,000 వేలు హాఫ్ ఇయర్ మోడ్ ఎంచుకుని పాలసీ ప్రారంభించిన ఉపేందర్ యాక్సిడెంట్ లో మరణించగా 10 లక్షలు యాక్సిడెంట్ భీమా అందించటంతో పాటు మిగిలిన 5 సం,, పూర్తి ప్రీమియం లు ఎస్ బీఐ లైఫ్ చెలించి చివరికి చైల్డ్ కి 18 సం పూర్తి అయ్యాక పూర్తి అయి మెచూరిటీ ప్రీమియం



డబ్బులు చైల్డ్ కి అందిస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో లైఫ్ మిత్ర భూక్యా కుమార్,జె ఓటిసి లైఫ్ మిత్రలు జెట్టి యాకయ్య, మంద కార్తీక్, నరాల ఆంజనేయులు ఎస్బిఐ పాలసీదారులు తదితరులు పాల్గొన్నారు.

# దుండగులను కఠినంగా శిక్షించాలి

వైరా, ఫిబ్రవరి28(వుదయం ప్రతినిధి): కల్లూరు మండలంలోని పేరువంచ గ్రామపంచాయతీ ఆవరణలో గల కలప చెట్లను గుర్తు తెలియని దుండగలు నరికి తీసుకెళ్లారని గ్రామస్తులు కీసర రవీందర్ రెడ్డి, కీసర వంశీరెడ్డి, మట్టెల సమ్మేష్, అనీల్ ఆరోపించారు.

గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. జీపీ ఆవరణలో ఏళ్లుగా నీడనిస్తున్న చెట్లను అనుమతి లేకుండా నరకడం సరికాదన్నారు. విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు.

# మార్చి 1న మాదిగ అమరుల సంస్మరణ సభ

హుస్నాబాద్ (వుదయం) ఫిబ్రవరి :28ఎస్సీ వర్గీకరణ అమలుకై తమ అమూల్యమైన ప్రాణాలను ధారపోసిన మాదిగ అమరవీరుల సంస్మరణ సభను మార్చి 1న హుస్నాబాద్ లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొలుగూరి అశోక్ మాదిగ తెలిపారు.ఈ మేరకు శుక్రవారం రోజున విలేకరుల సమావేశం నిర్వహించారు.



ఇందులో ఆయన మాట్లాడుతూ ఎస్సీలలో వర్గీకరణ లేని కారణంగా ఎన్నో ఏళ్లుగా అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్న మాదిగల జీవితాలలో వెలుగులు నింపడం కోసం సురేందర్ మాదిగ, భారతి మాదిగ తదితరులు తమ ప్రాణాలను పణంగా పెట్టారని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ, నవతరానికి వారి బాధ్యతను గుర్తు చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. అందుకే హుస్నాబాద్ లో సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని అన్నారు. కావున హుస్నాబాద్ పట్టణంతోపాటు, మండలంలోని పలు గ్రామాల మాదిగలు, వారి ఉపకులాలు అంబేద్కర్ చౌరస్తాలో హాజరుకావాలని అశోక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లింగాల సాయన్న, కండే సుధాకర్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ మాట్ల వెంకటస్వామి మాదిగ, ముక్కెర సంపత్ కుమార్, గడ్డం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు

# ఏసీబీ వల్లలో చిక్కిన మరో అవినీతి తిమింగలం

### ఏసీబీ రైడ్ లో చిక్కిన ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్..

భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 28 (వుదయం ప్రతినిధి) కొత్తగూడెం కూలీ లైన్ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు ఫిజికల్ ఫిట్నెస్ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం లో భాగంగా పిల్లలకు శరీర ధారుఢ్యం కోసం 72 క్లాసులు నిర్వహించేందుకు గౌరవ వేతనం గా ఫిజికల్ ఫిట్నెస్ టీచర్ మంగీలాల్ కు ఇవ్వవలిసి ఉండగా ప్రధానోపాధ్యాయుడు రవీందర్ అకౌంట్ లో జమ అయినా 30వేల నుంచి తనకు 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. దింతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ బాధితుడు ఫిర్యాదు మేరకు ప్రధానోపాధ్యాయుడు రవీందర్ 20 వేల లంచం తీసుకుంటుండగా రేడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ డబ్బులు కరాటే శిక్షణ కోరకు పాఠశాలకు 30 వేలు మంజూరయ్యారని. ఫిజికల్ ఫిట్నెస్ ఉపాధ్యాయుడు కు ఇవ్వాల్సిన 30 వేలల్లో 20 వేలు లంచం డిమాండ్ చేసాడని బాధితుడి ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించినట్లు డీఎస్పీ వై. రమేష్ తెలిపారు..

# ప్రగతినగర్ లో పర్యటించిన హైడ్రా కమిషనర్...



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 28,(వుదయం ప్రతినిధి ),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్ ను ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డ్ గ్రేడ్ ని ఫినిక్స్ కంపెనీ (ప్రస్తుతం ఎక్సెల్ల ప్రాపర్టీ) సుప్రీంకోర్టులో తీర్పు అనుకూలంగా వచ్చిందని కూల్చివేయడమే కాకుండా, స్వాధీనం చేసుకోవడం ఇప్పటికి కూడా ఆటంకాలు కల్పించడంపై నిజాంపేట్ కార్పొరేషన్ నుండి పలు ఫిర్యాదులు హైడ్రా కమిషనర్కు రావడంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతి నగర్ డంపింగ్ యార్డ్, గ్రేవి యార్డ్ ను రెవెన్యూ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. సర్వే నెంబర్ 57 కూకట్పల్లిలో చూపిస్తూ గతంలో దేశ్పాండే ప్రస్తుతం ఎక్సెల్ లో ప్రాపర్టీ సంస్థ గాజులరామారం సర్వేనెంబర్ 307 లో ఆక్రమించుకొని సరైన అనుమతులు లేకుండా కొండలను చదును చేయడాన్ని, వారికున్న అనుమతులను పరిశీలించడం జరిగింది. పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించిన తర్వాత చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు నిజాంపేట్ మున్సిపల్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు, వివిధ పార్టీల నాయకులు ఆకుల సతీష్, జస్వంత్, డాక్టర్ రాజు, అరుణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ


జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి 28(వుదయం ప్రతినిధి) సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం సరస్వతి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లుపై రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూ ఎస్, దేవాదాయ, విద్యుత్ శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్ 4, పంచాయతి రాజ్ ఇంజనీరింగ్ విభాగం 7, మిషన్ భగీరథ 15, దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం 28, విద్యుత్ 11 మొత్తం 65 పనులు పూర్తి చేయాల్సి ఉన్నట్లు తెలిపారు. త్వరలో ఎన్నికల కోడ్ ముగియనున్నందున పనులు సత్వరమే చేపట్టేలా అన్ని శాఖల అధికారులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో జరిగే సరస్వతి పుష్కరాలు అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉన్నందున, అన్ని ఏర్పాట్లు ఏప్రిల్ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



ఈ సందర్భంగా పుష్కరాల కోసం చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేశారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు క్రమబద్ధంగా పూర్తి చేయాలి అన్నారు. ముఖ్యంగా స్నానఘట్టాలు, రహదారులు, తాగునీటి సరఫరా, శానిటేషన్, విద్యుత్, భద్రత, పార్కింగ్ వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పుష్కరాల నిర్వహణను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లుపై ఆయా శాఖల అధికారులు నిరాటంకంగా పర్యవేక్షణ చేయాలని, పనుల ప్రగతిపై ఎప్పటికప్పుడు సమగ్ర నివేదిక అందచేయాలని అధికారులకు సూచించారు.ఈ టెలికాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్ ఈఈ తిరుపతి, పిఆర్ ఈ ఈ వెంకటేశ్వర్లు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈ నిర్మల, విద్యుత్ శాఖ డీఈ పాపిరెడ్డి, దేవాదాయ శాఖ డిఈ, దేవస్థానం కార్య నిర్వహణ అధికారి, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేయండి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ నాయక్



నారాయణపేట టౌన్ 28ఫిబ్రవరి (వుదయం ప్రతినిధి) యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ కంప్లెక్స్ పనులు త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు ఆదేశించారు. నారాయణపేట మండలం లింగంపల్లి శివారు సర్వే నెంబర్ 30 లో గల 20 ఎకరాలలో నిర్మించ తలపెట్టిన పాఠశాల స్థలాన్ని జిల్లా కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. 21 జనవరి రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయడం జరిగిందని వాటికీ సంబందించిన పనులను త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. సుమారు రూ.200 కోట్లతో నిర్మిస్తున్న భవన నిర్మాణానికి సంబందించిన ఏర్పాట్లు తొందరగా మొదలు పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీప్యూటీ ఈ. ఈ.రాము, తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

# కార్యనిర్వాహణాధికారి ఎం. విద్యాలత ఆకస్మిక తనిఖీ.



ధర్మసాగర్ ఫిబ్రవరి28(వుదయం ప్రతినిధి): 2025 శుక్రవారం 28 ఈరోజు కార్యానిర్వహణాధికారి, జి.ప్ర.ప. హనుమకొండ గౌరవనీయులు శ్రీమతి ఎం.విద్యాలత ధర్మసాగర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయమును సందర్శించి రకార్యాలయమునందలి వివిధ రికార్డులను పర్యవేక్షించి, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. తదుపరి కార్యాలయంలో నిర్మాణములోనున్న నమూనా ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. తదనంతరం ధర్మసాగర్ లోని నర్సరీని పరిశీలించారు. మరియు తాగునీటి వసతుల పరిశీలనలో భాగంగా ధర్మసాగర్ లోని ఓ హెచ్ ఎస్ ఆర్ ని అలాగే నర్సింగరావుపల్లి నందలి ఓ హెచ్ ఎస్ ఆర్ ని మరియు గ్రామపంచాయతీ నందు నిర్వహింపబడుచున్న తాగునీటి వసతికి సంబందించిన 8 రిజిస్టర్లను తనిఖీ చేసినారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీయుత ఎంపీడీఓ కె.అనిల్ కుమార్ , చందునాయక్, ఆర్.డబ్ల్యూ.యస్, డి.ఈ.ఈ , ఆఫజల్,, ఎం.పి.ఓ మరియు సంబంధిత గ్రామకార్యాదర్శులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాలు

కొత్తగూడ ఫిబ్రవరి 28(వుదయం ప్రతినిధి ):జడ్.పి.హెచ్.ఎస్. పొగుళ్లపల్లి పాఠశాలలో డాక్టర్ సి.వి రామన్, రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు చాలా బ్రహ్మాండంగా సృజనాత్మకతతో వైవిధ్యంతో నూతన ప్రయోగాలను ప్రదర్శించారు. అనంతరం ముగ్గుల పోటీలలో వారి యొక్క ప్రతిభను చాటుతూ సైన్స్ ఏక ప్రాముఖ్యతను చాటుతూ రంగురంగుల రంగవల్లులు అలంకరించారు. ఆ తర్వాత జరిగిన సమావేశంలో విద్యార్థులు క్విజ్ పోటీ పాటల పోటీ వ్యాసరచన ఉపన్యాస పోటీలలో వీరి వీరిగా పాల్గొని వారి యొక్క సైన్స్ పట్ల వారికి ఉన్న అభిమానాన్ని తెలియజేస్తూ వారి విజ్ఞానాన్ని ఈ సమావేశానికి ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు నెల్లుట్ల.భాస్కర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ నిత్యజీవితంలో సైన్స్ లేకుండా జీవన పరిణామ క్రమం నాగరికత అభివృద్ధి చెందలేదని, ఎవరైతే శాసన విజ్ఞానంలో ముందున్నారు. ఆ దేశాలు మాత్రమే ఇవాళ ప్రపంచ



అభివృద్ధిలో గానీ మానవ అభివృద్ధిలో గానీ ముందు వరుసలో ఉన్నాయి .ఆ విధంగా భారతదేశం కూడా సివి .రామన్ గారు కనుగొన్న రామన్ ఎఫెక్ట్ ద్వారా మొట్టమొదటి నోబెల్ ప్రైజ్ ను గెలుచుకున్న మొదటి భారతీయుడు గారు మొదటి ఆసియా వాసిగాను పేరు ప్రఖ్యాతలు గడించారు వారు వేసిన పునాది ద్వారా ఇవాళ దేశం అనేక రంగాలలో సైన్సును ఉపయోగించుకొని అభివృద్ధి చెంది వాళ్ళ చంద్ర ఎంతో సహాయాన్ని కూడా చేపట్టడానికి ముందున్నదని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు చాలా శ్రమకోర్చి వారికి ఉన్న జ్ఞానాన్ని విద్యార్థులకు పంచుతూ పై కార్యక్రమాలు అన్ని విజయవంతం కావడం కొరకు ఎనలేని కృషిచేసిన సైన్స్ ఉపాధ్యాయులు ఎండి భాషా మియా ఓ సాంబయ్య మరియు ఎం సూరయ్యని ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం సైన్సు ఉపాధ్యాయులు ఓ సాంబయ్య గారు మాట్లాడుతూ సైన్స్ విలువను తెలుసుకోవడం ప్రజలందరూ బాలు వారి రంగాలలో అభివృద్ధి చెందాలని తెలియజేస్తూ విద్యార్థులుగా సమాజంలో రేపటి భావి భారత పౌరులుగా ఎంతో ఉన్నతమైన ప్రగతిని శాసన విజ్ఞానం ద్వారా సాధించాలని తెలియజేశారు .అనంతరం మరొక ఉపాధ్యాయుడు మాట్లాడుతూ ఎండి పాషా మీయ గారు మాట్లాడుతూ సైన్స్ ద్వారా మాత్రమే మానవాళి అభివృద్ధి చెందుతుందని ,సైన్స్ నిరుపితమైనదని, ప్రయోగాల ద్వారా మాత్రమే సైన్స్ నిరూపిస్తుందని సైన్స్ ప్రకృతిలో నుండి అనేక మార్పులకు లోన్ అవుతుంది.అనంతరం ఏం సూరయ్య గారు ఉపాధ్యాయులు మాట్లాడుతూ సైన్స్ లేని జీవితం వృధా అని సైన్స్ లేకుండే ప్రగతి ఉండదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఈ నర్సయ్య సీనియర్ ఉపాధ్యాయులు ఎం. సుమన్ ఎం .రాజ్ కుమార్, సి. హెచ్ బేబీ ఎం.మాధవి,టీ బిక్షపతి,విద్యార్థులు పాల్గొన్నారు.

# కోదాడ డివిజన్ పరిధిలో త్రాగునీటి సరఫరాకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి...

ప్రతి ఇంటికి నాణ్యమైన త్రాగునీరు అందాలి....

వేసవికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి.....జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్.

కోదాడ టౌన్ ఫిబ్రవరి 28(వుదయం) కోదాడ డివిజన్ లో తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తకుండా అంకిత భావంతో పనిచేయాలని, నీటి



సరఫరా కోరకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. శుక్రవారం కోదాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో కోదాడ డివిజన్ లో మంచినీటి సరఫరా పరిస్థితిపై ఎంపీడీవో ,ఎం పీ ఓ, మున్సిపల్ కమిషనర్ రూరల్ వాటర్ సప్లై విభాగం ఈఈ, డిఇ , పంచాయతీ సెక్రటరీ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాను నిరంతరం కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితిలో నీటి సరఫరా కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. కోదాడ డివిజన్లోని మండల,గ్రామాలవారిగా నీటి సరఫరా కొరకు పైపులైన్ల లీకేజీలు, మరమ్మత్తులు, సరఫరా సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలాలలో అలాగే మున్సిపాలిటీలలో బోర్ల పనితీరును పరిశీలించాలని తప్పనిసరిగా క్లోరినేషన్ చేసిన తర్వాతనే నీటి సరఫరా జరపాలని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో సూర్యాపేట జిల్లా ముందుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పి సీఈవో వివి అప్పారావు, ఆర్డీవో సూర్యనారాయణ, మిషన్ భగీరథ ఇంట్రా గ్రిడ్ అధికారులు శ్రీనివాస్, కరుణాకర్ రెడ్డి, డిపిఓ నారాయణరెడ్డి, డివిల్పిఓ యాదయ్య, తాసిల్దార్ వాజిద్,కోదాడ మున్సిపాలిటీ కమిషనర్ రమాదేవి, ఎంపీడీవోలు, ఎంపిఓలు, ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, పాల్గొన్నారు.

# కోటగడ్డ ఆర్ అండ్ బి రోడ్డు పనుల్లో నాణ్యత డొల్లా ...!

-బీటీ రోడ్డు ఇంచు మందం కూడా వెయ్యకుండానే ఆదరా బాదరాగా పనులు పూర్తి...!

-రోడ్డు మనుగడ ప్రశ్నర్థకం.







బయ్యారం(వుదయం ప్రతినిధి)ఫిబ్రవరి 28.గత బిఆర్ ఎస్ ప్రభుత్వం 2023-24సంవత్సరంలో మండలంలోని దామర చెరువు నుండి కోటగడ్డ ఆర్ అండ్ బి రోడ్డు పనుల గాను అధికారులు సుమారుగా 3 నుంచి 4 కోట్ల రూపాయల నిధుల వెచ్చించారు, రోడ్డు మధ్యలో కల్వర్టు లు,బీటి రోడ్డుకు,కలిపి సుమారుగా 3 కిలోమీటర్లు పనులకు అధికారులు ఎస్టిమేట్ వ్యయంతో టెండర్ ద్వారా సదరు కాంట్రాక్టు పనులు పొందగా,ఈ మధ్యం కాలంలో సదరు గుత్తేదారులు ఆదరాబాదరాగా పనులు మొదలు పెట్టి పూర్తి చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.బీటీ రోడ్డు పనులలో లేయర్ ల వారిగా పలు ధఫాలుగా వివిధ రకాల కంకరను పరిచి రోలింగ్, క్యూ రింగ్ చేసి, అనంతరం బీటి వేయాలి.బీటి వేసే ముందు పైన తేలిన పాత కంకర రోడ్డు పై మట్టి,చెత్త,చెదారం లేకుండా తొలగించి శుభ్రం చేసి రోడ్డు నిర్మాణం చేయవలసి ఉండగా, అవేమీ పట్టించుకోకుండా సదరు కాంట్రాక్టర్ ,బీటీ నిర్మాణ పనులు ఇంచు మందం కూడా వెయ్యకుండా పనులు పూర్తి చేసినట్లు రైతులు,వాహన దారులు ఆరోపిస్తున్నారు. కోట గడ్డ రోడ్డు మధ్య, మధ్య లో పంట కాల్వల నిమిత్తం మోరీల నిర్మాణం కూడా నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నాసిరకం ఇసుక, దస్టు తో కల్వర్టు నిర్మాణాలు చేశారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

కోటగడ్డ బీటి రోడ్డు ఎన్ని రోజులు ఉండదు-గంగావత్ రాంచంద్రు.

రైతురోడ్డు పక్కనే మా పొలంలో మట్టి తీసి రోడ్డుకు పోసుకున్నారు.పొలంలోకి వెళ్లాలంటే బొందలు చేశారు.పొలంలోకి పోయేందుకు పది వేలు పెట్టి స్వంతంగా పైపులు కొనుగోలు చేసి వేసుకున్నా.

బీటి రోడ్డు నిర్మాణం ఇంచు మందం కూడా వేయలే. -గంగావత్ మేగ్యా.బీటి రోడ్డు ఇంచు మందం కూడా వేయలే.. మట్టి పైన బీటి పలుచగా పరిచారు.రోడ్డు పై నెల రోజులు వాహనాలు తిరిగితే ఎక్కడికి పెచ్చులు అక్కడే లేచి పోతది.కోట్లు ఖర్చు పెట్టి పనులు ఇట్లా చేస్తారా..ఎవరైనా..రోడ్డు వేసేటప్పుడు అధికారులు ఎవరు కూడా పర్యవేక్షణ లేకుండా నాసిరకంగా రోడ్డు వేసి వెళ్లారు.దీనిపై ఆర్ అండ్ బి ఏఈ అనిల్ వివరణ కోసం ప్రయత్నం చేయగా వారు ఫోన్ స్పందించలేదు.దీనిపై ఆర్ అండ్ బి డిఈ శ్యామ్ చరణ్ సింగ్ ను వివరణ కోసం ఫోన్లో ప్రయత్నించగా వారు స్పందించలేదు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సైన్స్ దినోత్సవం...





కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 28,(వుదయం ప్రతినిధి ),జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిజాంపేట్ లో జాతీయ వైజ్ఞానిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా సైన్స్ టీచర్స్ సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి విద్యార్థులచే సైన్స్ నమూనాలు, ప్రయోగాలు ప్రదర్శింప జేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రఘునాథ్ మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్ ను కనుగొన్న సర్ సివి రామన్ ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు సైన్స్ పట్ల అభిరుచి పెంచుకొని శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని తద్వారా భవిష్యత్తులో ఉన్నతంగా ఎదిగి బావి భారత శాస్త్ర వేత్తలు కావాలని ఆకాంక్షించారు. ఇందులో భాగంగా సైన్స్ ప్రాముఖ్యత ను తెలుపుతూ విద్యార్థులు చక్కటి పాటలు పాడి, నృత్య ప్రదర్శనలు, పాత్రాభినయాలు చేశారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు పోకల శేఖర్, రాచప్ప, ప్రభాకర్ రెడ్డి, ఆంధ్ర వాణి, మల్లికార్జున్, విజయ భాస్కర్ రెడ్డి, సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాటూరు ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

మధిర,ఫిబ్రవరి28(వుదయం ప్రతినిధి)మధిర మండలంలోని మాటూరు ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వక్తృత్వ, చిత్రలేఖన,క్విజ్ పోటీలతో పాటు ఈరోజు పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్ట్ లతో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరి తెలిపారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు దీవి సాయికృష్ణమాచార్యులు,కొలగాని ప్రసాదరావు, చౌడవరపు సునీత, రెంటపల్లి భాగ్య శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో సైంటిస్టుల జీవిత చరిత్రల వివరాలు సాధించిన ప్రగతి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం శ్రీహరి మాట్లాడుతూ సైన్స్ మన నిత్యజీవితంలో ఒక భాగం అని పేర్కొంటూ, శాస్త్రవేత్తల కొన్ని వందల సంవత్సరాల కృషి ఫలితంగానే ఈరోజు శాస్త్ర విజ్ఞాన రంగంలో మానవాళి ముందు ఉండటం జరిగిందని, దీనిని కొనసాగిస్తూ ముందుకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యత రాబోయే





యువతరానిదే అంటూ పిలుపునిచ్చారు. అనంతరం వక్తృత్వ, చిత్రలేఖన, క్విజ్ పోటీల విజేతలకు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయిని చౌడవరపు సునీత దాతృత్వంతో 5వేల రూపాయల విలువైన బహుమతులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దీవి సాయి కృష్ణమాచార్యులు, సంక్రాంతి శ్రీనివాసరావు ,కొలగాని ప్రసాదరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, చౌడవరపు సునీత, రెంటపల్లి భాగ్య శ్రీనివాసరావు, షేక్ ఇబ్రహీం , బొగ్గుల శ్రీనివాసరెడ్డి, లావుడ్య రవికుమార్, ఎం వర ప్రసాద్, పగిడిపల్లి ఇస్సాక్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఊషన్నపల్లిలో ఘనంగా సైన్స్ మేళా - పాఠశాల పిల్లల్ని అభినందించిన ఎంఈఓ

పెద్దపల్లి జిల్లా: ఫిబ్రవరి, 28 (వుదయం) ప్రతినిధిజాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సైన్స్ మేళా పలువురిని ఆకర్షించింది. పిల్లలు తయారుచేసిన వివిధ నమూనాలు, ప్రయోగాలు చూపరులను ఆకట్టుకున్నాయి. మండల విద్యాధికారి సిరిమల్ల మహేష్, పెద్దంపేట ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ రెడ్డి, తల్లిదండ్రులు, గ్రామస్తులు సైన్స్ మేళాను సందర్శించి, పాఠశాల పిల్లల్ని అభినందించారు. సైన్స్ మేళాలో ఒక చిన్నారి స్టెతస్కోప్ తో ఎంఈఓ గుండె కొట్టుకొనడాన్ని పరీక్షించింది. సైన్స్ మేళాలో జనతా ఫ్రిడ్జ్, కూలర్, టీవీ, అగ్నిపర్వతం, ఇండ్లు, దుస్తుల రకాలు, ధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, పక్షులు, జంతువులు, చెట్లు, ప్రథమ చికిత్స పెట్టె, అస్థి పంజరం, శ్వాస వ్యవస్థ, మూత్రపిండాలు, జీర్ణ వ్యవస్థ, గాలిమర, విటమిన్లు, గణిత భావనలు, ఆకారాలు, టాన్ గ్రాం మొదలైన నమూనాలను తయారు చేశారు. గాలి ఒత్తిడిని కలుగజేస్తుంది, మాయావర్షం వంటి అనేక ప్రయోగాలు చేసి చూపించారు. భారతీయ శాస్త్రవేత్తల ఫోటోలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ జాతీయ విజ్ఞాన శాస్త్రం దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల పిల్లల్లో శాస్త్రీయ







దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇలాంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పిల్లల్లో శాస్త్రీయ భావనను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పరిసరాల విజ్ఞానం, గణిత సబ్జెక్టులపై పిల్లలకు క్విజ్ పోటీ నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పిల్లలకు త్వరలోనే బహుమతులను ప్రధానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మహేష్, ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య, సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్, కె. శ్రీవాణి, తల్లిదండ్రులు పిల్లలు గ్రామస్తులు, పలువురు పాల్గొన్నారు.

# దొంగల స్వైర విహారాన్ని అరికట్టండి.

రాత్రి సమయంలో గ్రామాల్లో పెట్రోలింగ్ పెంచాలి





బెల్లంపల్లి, పిబ్రవరి28 (వుదయం ప్రతినిధి) తాండూరు మండలంలో దొంగల స్వైర విహారం ఆశ్చర్యం కలిగిస్తోందని టిడిపి మండల ఇంచార్జి దాసరి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్ క్లబ్ ఐబీ తాండూరు లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో స్థానిక ప్రజలతో కలిసి మాట్లాడుతూ ఈ నెల ఫిబ్రవరి 25 న సుమారు రాత్రి 12 గంటల సమయంలో ముగ్గురు యువకులు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయని తాండూర్ బస్ స్టాండ్ నుంచి యూనియన్ బ్యాంక్ వరకు నడుచుకుంటూ వచ్చిన దొంగలు మధ్యలో ఒక ఇంటి సందులో ఒక బైకును దొంగలించబోయి అక్కడున్న సీసీ కెమెరాను చూసి వెను దిరిగారని అన్నారు .కాస్త ముందుకు రాగానే యూనియన్ బ్యాంకు సమీపంలో సీసీ కెమెరా లేదని నిర్ధారించుకొని ఇంటి ముందు నిలిపి ఉంచిన హీరో హోండా గ్లామర్ బైక్ ను దొంగలు ఎత్తుకెళ్లారని ఇంటి యజమాని ఫిర్యాదు చేసాడని అన్నారు . దొంగలు తిరుగుతున్నారనే విషయం ఆ నోట ఈ నోట తాండూర్ మండలం వ్యాప్తంగా వ్యాపించిందని ఈ నెల వ్యవధిలో దొంగలు కాసిపేట శివారులో రైతులకు ఉపయోగపడే కరెంట్ కాపర్ వైర్లను అలాగే రైస్ మిల్లులో బియ్యం దొంగలించడం జరిగిందన్నారు.

రాత్రి సమయంలో ప్రతి గ్రామంలో పెట్రోలింగ్ పెంచాలని పోలీస్ శాఖను కోరారు. జైన సాంబయ్య, పుల్గం రాజేందర్, చాపిడి ప్రశాంత్, చరణ్, ప్రశాంత్ లు పాల్గొన్నారు.

# యూరోకిడ్స్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్





విషయాలు తెలుసుకోవడంతో పాటు నూతన ఆవిష్కరణలు చేయాలన్న ఉత్సుకత వారిలో కలుగుతుందని కార్పొరేటర్ గారు అన్నారు.యురో కిడ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ మహేష్ గారు మాట్లాడుతూ భారతదేశం ప్రపంచానికి అబ్దుల్ కలాం, సి.వి.రామన్ వంటి గొప్ప శాస్త్రజ్ఞులను అందించిన దేశమని, విద్యార్థులకు చిన్నతనం నుంచే సైన్స్ యొక్క ప్రాముఖ్యత, ఆహార మరియు

సంగారెడ్డి జిల్లా, పటాన్చెరువు టౌన్ ఫిబ్రవరి28(వుదయం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా పటాన్చెరు పట్టణంలోని యూరోకిడ్స్ పాఠశాల ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ ను నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ గారు మరియు గూడెం మధుసూదన్ గారు ముఖ్య అతిథిలుగా విచ్చేసి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ వైజ్ఞానిక అంశాల యొక్క నమూనాలను మరియు వర్కింగ్ మోడల్ ప్రదర్శిస్తారు. మరియు విద్యార్థులకు సాంస్కృతిక అంశాలపై అవగాహన కొరకు విద్యార్థులతో మట్టి కుండల తయారీ ఏర్పాటు చేశారు మరియు ఆహార ప్రాముఖ్యతను తెలిపే విధంగా చిరుధాన్యాలు యొక్క ప్రాముఖ్యత మరియు నీటి యొక్క వినియోగము ప్రాముఖ్యత గురించి తెలిపే వివిధ నమోనాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు విద్యార్డులు ఏర్పాటు చేసిన వివిధ సైన్స్ ప్రాజెక్టులను తిలకించి వాటి గురించి విద్యార్దులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్దులకు చదువుతో పాటు సైన్స్ పైన అవగాహన కలిగేలా ఇలాంటి సైన్స్ ఫేర్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్దులు కొత్త





విద్యార్థి నేహశ్రీ

నీటి యొక్క ప్రాముఖ్యత తెలిపే విధంగా విజ్ఞాన ప్రదర్శనను ఏర్పాటు చేశామని తద్వారా విద్యార్థులకు వాటి యొక్క ప్రాముఖ్యత తెలిసి భావితరాలకు అందించే విధంగా విద్యార్థులను ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాయికాడి విజయ్ గారు , ఎం.డి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పృథ్వి రాజు గారు, పాఠశాల ఉపాధ్యాయులు సుజాత గారు, సంజన గారు, అన్నపూర్ణ గారు, వివిధ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన చూసి అభినందించారు.

# దివ్యాంగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

–అమ్మ వికలాంగుల పట్టణ అధ్యక్షుడు మారపల్లి నరేష్




రామకృష్ణాపూర్ /ఫిబ్రవరి 28 (వుదయం ప్రతినిధి ) క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో పెన్షన్ అందక దివ్యాంగులు వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారనీ పెన్షన్ దారు అకౌంట్లో డబ్బులు పడిన ఇవ్వడంలో ఆలస్యం జరగడం వల్ల అసలు పెన్షన్ వస్తుందో లేదో అని దివ్యాంగులు,వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారనీ అమ్మ వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పందుల రవి పట్టణ అధ్యక్షుడు మారపెల్లి నరేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇప్పటికే పెన్షన్ పెంచుతామని పెంచకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇప్పుడు వచ్చే పెన్షన్ 4000 సమయానికి అందట్లేదన్నారు. ఈ విషయం అధికారులు,రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి చలనం లేదనీ అన్నారు. ఈ కార్యక్రమంలోసంఘం సభ్యులు పోతార వేణి రవికుమార్,లతా రాణి,వెంకటేష్,శ్రీనివాస్ రెడ్డి,చందు,అజ్జు పాల్గొన్నారు.

# ఆలయ ఈవో బాధ్యతరాహిత్యం వల్లే నిండు ప్రాణం బలి



వెల్దండ ఫిబ్రవరి 28 (వు దయం ప్రతినిధి) వెల్దండ మండలం గుండాల గ్రామంలో అంబారామలింగేశ్వర స్వామి దేవాలయ ఈవో బాధ్యతరాహిత్యం వల్లే ఒక నిండు ప్రాణం బలిగొందని పలువురు ఆరోపిస్తున్నారు గత కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఈవో కోనేరు చుట్టూ బాడీకెట్లు, సూచిక బోర్డులు,, భద్రత ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఇలాంటి సంఘటన నెలకొందని ఉన్నతాధికారులు ఈవో పై చర్యలు తీసుకోవాలని మీద పార్టీల నాయకులు కుల సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు





# బిజినెస్






## 991 పాయింట్లకు పడిపోయిన సెన్సెక్స్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం భారీ నష్టాలను చవిచూశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రకటనలు ఇప్పటికే మదుపర్లలో విశ్వాసాన్ని దెబ్బతీశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల సంకేతాలు సూచీలపై ఒత్తిడి పెంచడంతో ప్రారంభంలోనే సూచీలు పెద్దఎత్తున నష్టాల బాటపట్టాయి. ఐటీ, మెటల్ స్టాక్స్ కుదేలయ్యాయి. ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, ఎంఅండ్‌ఎం, టీసీఎస్ వంటి ప్రధాన షేర్లలో విక్రయాలతో మార్కెట్లు నష్టాల బాట పట్టాయి. ఈరోజు ఉదయం 10 గంటల సమయంలో సెన్సెక్స్ 991 పాయింట్లు నష్టపోయి 73,621 వద్ద ట్రేడవుతోంది.

నిఫ్టీ 303 పాయింట్లు కుంగి 22,241 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్ 30 సూచీలో అన్ని షేర్లు నష్టాల్లోనే ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌యూఎల్, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, నెస్లే ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎల్‌అండ్‌టీ, సన్‌ఫార్మా, ఎస్‌బీఐ, బజాజ్‌ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 73.68 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 2,880.60 డాలర్ల వద్ద కదలాడుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 87.33 వద్ద కొనసాగుతోంది. ఐటీ, టెలికాం, లోహ షేర్ల నష్టాలూ ఆజ్యం పోశాయి. బ్యాంక్, ఐటీ స్టాక్స్ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ బలహీన సంకేతాల నడుమ మదుపర్లు ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీలో మార్కెట్ విలువ రూ.5.8 లక్షల కోట్లు తగ్గి రూ.387.3 లక్షల కోట్లకు చేరుకుంది. మరోవైపు %ా% అమెరికా మార్కెట్లు కూడా గురువారం నష్టాల్లో ముగిశాయి. ప్రధాన సూచీలైన ఎస్‌అండ్‌పీ 500, నాస్‌డాక్ దాదాపు 2 శాతం మేర క్షీణించాయి. మరోవైపు ఆసియా-పసిఫిక్ ప్రధాన సూచీలు నేడు అదే బాటలో పయనిస్తున్నాయి.

ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ 1 శాతం, జపాన్ నిక్కీ 2.18 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2.22 శాతం మేర నష్టంతో ట్రేడవుతోంది. అటు షాంఘై మాత్రం ఫ్లాట్‌గా కదలాడుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు గురువారం నికరంగా రూ.557 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు నికరంగా రూ.1,727 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు.

## ఎగిరే కారు వచ్చేస్తోంది..

### కలను సాకారం చేసిన స్టార్టప్ కంపెనీ



అత్యవసర పని మీద దూర ప్రాంతానికి వెళ్లడానికి మీరు కారులో బయలుదేరారు. అనుకోకుండా మధ్యలో ట్రాఫిక్ లో చిక్కుకుపోయారు. మీ కారు ముందు, వెనుక అనేక వాహనాలు ఉండిపోయాయి. ఆ సమయంలో మీకు తప్పనిసరిగా ఓ ఆలోచన వస్తుంది. కారుకు రెక్కలు ఉండే చక్కగా ఎగిరిపోవచ్చని అనుకుంటారు. కానీ అది సాధ్యకాదని తెలిసి ఊరుకుంటారు. ఎన్ని గంటలైనా అక్కడే వేచి ఉండి ట్రాఫిక్ క్లియర్ అయ్యాక మీ ప్రయాణం కొనసాగిస్తారు. అయితే ఇలాంటి సమస్యకు ఇప్పుడు పరిష్కారం లభించనుంది. ట్రాఫిక్ జామ్ అయినప్పుడు, ఎగురుకుంటూ వెళ్లే కొత్త కారు త్వరలో విడుదల కానుంది. అమెరికాలోని అలెఫ్ ఏరోనాటిక్స్ అనే స్టార్టప్ కంపెనీ ప్రపంచంలోనే మెట్టమెదటిసారిగా ఎగిరే కారును తయారు చేసింది. దీన్ని కాలిఫోర్నియాలో ప్రయోగాత్మకంగా ఆవిష్కరించింది. ఆ కారు నెలపై నడుస్తూ, దారిలో పార్కింగ్ చేసిన ఓ కారుపై ఎగురుతూ వెళ్లింది. దాన్ని దాటాక సురక్షితంగా నేలపై దిగింది. ఈ వీడియోను ఆ కంపెనీల సోషల్ మీడియాలో షేర్ చేసింది. ప్రమాదాలు జరిగినప్పుడు, రోడ్డుపై చెట్లు, రాళ్లు పడిపోయినప్పుడు, అత్యవసరం సమయంలో ఈ ఎగిరే కారు చాలా ఉపయోగంగా ఉంటుంది. అలెఫ్ ఏరోనాటిక్స్ కంపెనీ సీఈవో జిమ్ దుఖోన్నీ మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతికతకు ఎగిరే కారు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. రైట్ బ్రదర్స్ కు తొలిసారిగా విమానాన్ని నడిపినప్పుడు కలిగిన భావనే ఇప్పుడు తమకు కలిగిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు సరికొత్త రవాణా సాధనం అందిస్తున్నామన్నారు. ఎగిరే కారు డిజైన్ క్వాడ్ కాప్టర్ డ్రోన్ మాదిరిగా కనిపిస్తుంది. బయట రోటర్ బ్లేడ్లు ఏర్పాటు చేశారు. రోడ్డు మీద నడిచే కారుకు భిన్నంగా రూపొందించారు. వాహనం చాసిస్ లోపల దాని రోటర్ బ్లేడ్లు దాగి ఉంటాయి.

ఈ వాహనం పూర్తిగా విద్యుత్ తో నడుస్తుంది. రోడ్డుపై ప్రయాణించినప్పుడు సుమారు 320 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. అలాగే దాదాపు 160 కిలోమీటర్ల విమానం రేంజ్ వస్తుంది.

సంపన్నులతో పాటు సామాన్యులకు కూడా ఈ కారును అందుబాటులోకి తీసుకురావడానికి కంపెనీ ప్రయత్నాలు చేస్తోంది. ఎగిరే కారుకు సంబంధించిన మోడల్ ఏ ఉత్పత్తిని ఈ ఏడాది చివరిలో అలెఫ్ ఏరోనాటిక్స్ కంపెనీ ప్రారంభించనుంది. దాని కోసం ఇప్పటికే 3,300 కంటే ఎక్కువ ఆర్డర్లు అందుకుంది. అందరికీ సకాలంలో కార్లను అందించడం కోసం పుకారా ఏరో, ఎంవైసీ కంపెనీతో ఒప్పందం కూడా చేసుకుంది. ఎయిర్ బస్, బోయింగ్ కోసం ఏవిగేషన్ గ్రేడ్ భాగాలను ఉత్పత్తి చేయడంలో పుకారా కంపెనీ ప్రసిద్ధి చెందింది.

అన్ని రకాల రోడ్లపై ఎగిరే కారు చక్కగా పరుగులు తీస్తుంది. అవసరమైనప్పుడు నిలువుగా పైకి ఎగురుతుంది. రోడ్డుపై అడ్డుగా ఉన్న వాహనాలపై నుంచి ఎగురుతూ పోతుంది. వాటిని దాటాక చాలా సురక్షితంగా నేలపై దిగుతుంది. త్వరలో ఉత్పత్తి జరగనున్న మోడల్ ఏ ఎగిరే కారు ధర 3 లక్షల డాలర్లు ఉండవచ్చని చెబుతున్నారు.



## ఎక్కువ మంది మహిళలు దేనిని ఇష్టపడుతున్నారో తెలుసా?

స్టాక్ మార్కెట్‌లో వచ్చిన వృద్ధితో పోలిస్తే ఇటీవలి నెలల్లో స్టాక్ మార్కెట్‌లో క్షీణత దృష్ట్యా, మహిళలు నివాస రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఖచ్చితంగా ముందుకు వచ్చి విజయం సాధించారని అనరాక్ చైర్మన్ అనుజ్ పూరి అన్నారు. సాంప్రదాయకంగా భారతీయులు పెట్టుబడికి రియల్ ఎస్టేట్, బంగారాన్ని ఎంచుకుంటున్నారు. ప్రాపర్టీ కన్సల్టింగ్ సంస్థ అనరాక్ నిర్వహించిన సర్వే ప్రకారం.. 2024 ద్వితీయార్థంలో 70 శాతం మంది మహిళలు రియల్ ఎస్టేట్ అత్యంత ఇష్టపడే పెట్టుబడి ఆస్తి అని తేలింది. అదే సమయంలో 2022 రెండవ భాగంలో ఇది 65 శాతం, కోవిడ్ ముందు కాలంలో అంటే 2019 సంవత్సరం రెండవ భాగంలో ఈ సంఖ్య 57 శాతంగా ఉంది. 2024 ద్వితీయార్థంలో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడానికి మహిళల ప్రాధాన్యత కేవలం 2 శాతానికి పడిపోయింది. 2022 ద్వితీయార్థంలో ఈ సంఖ్య 20 శాతం ఎక్కువగా ఉంది. 2022 సంవత్సరంలో స్టాక్ మార్కెట్‌లో వచ్చిన వృద్ధితో పోలిస్తే ఇటీవలి నెలల్లో స్టాక్ మార్కెట్‌లో క్షీణత దృష్ట్యా, మహిళలు నివాస రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఖచ్చితంగా ముందుకు వచ్చి విజయం సాధించారని అనరాక్ చైర్మన్ అనుజ్ పూరి అన్నారు. రియల్ ఎస్టేట్ తర్వాత మహిళలు పెట్టుబడి పెట్టడానికి ఎక్కువ ఆసక్తి చూపిన ఆస్తి తరగతి బంగారం. మహిళా పెట్టుబడిదారులలో బంగారం పట్ల ఆదరణ 2022 రెండవ భాగంలో 8 శాతం నుండి 2024 రెండవ భాగంలో 12 శాతానికి కొద్దిగా పెరిగింది.

మహిళా గృహ కొనుగోలుదారుల బడ్జెట్ ప్రాధాన్యతలను కూడా సర్వే ట్రాక్ చేసింది. 2024 ద్వితీయార్థంలో కనీసం 52 శాతం మంది మహిళలు రూ. 90 లక్షల కంటే ఎక్కువ ధర గల ప్రీమియం లేదా లగ్జరీ ఇళ్లను ఇష్టపడ్డారు. 2022 ద్వితీయార్థంలో దాదాపు 47 శాతం మంది మహిళాలు ఈ బడ్జెట్ విభాగాన్ని ఎంచుకున్నారు. గృహ కొనుగోలు చేయాలనుకుంటున్న మహిళా కొనుగోలుదారులలో కనీసం 33 శాతం మంది రూ. 90 లక్షల నుంచి రూ. 1.5 కోట్ల మధ్య ధర గల ఆస్తుల కోసం చూస్తున్నారని సర్వేలో తేలింది. అయితే 11 శాతం మంది రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2.5 కోట్ల మధ్య ధర గల ఇళ్లను ఇష్టపడుతున్నారు. ఆసక్తికరంగా కనీసం 8 శాతం మంది రూ.2.5 కోట్ల కంటే ఎక్కువ ధర గల ఇళ్లను కొనడానికి ఇష్టపడుతున్నారు.

## మార్కెట్లోకి డిప్లోస్ మాక్స్ ఇ-స్కూటర్ విడుదల

న్యూమెరస్ మోటార్స్ తన విక్రయాలను తెలుగు రాష్ట్రాలకు విస్తరించింది. ఈ విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ తమ మల్టీయుటిలిటీ ఇ-స్కూటర్, డిప్లోస్ మాక్స్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లో దీన్ని న్యూమెరస్ ఇండియా ఇంజినీరింగ్ వైస్ ప్రెసిడెంట్ సౌందరరాజన్ ఆవిష్కరించారు. 2026 మార్చి ముగింపు నాటికి తెలుగు రాష్ట్రాల్లో 40 డీలర్‌షిప్‌లకు విస్తరించనున్నట్లు సౌందరరాజన్ మీడియాతో వెల్లడించారు. ప్రస్తుతం ఏపి, తెలంగాణలో మూడు అవుట్‌లెట్‌లు ఉన్నాయన్నారు. దేశ వ్యాప్తంగా 40 డీలర్‌షిప్‌లను కలిగి ఉన్నామని.. వచ్చే ఏడాది మార్చి నాటికి 170 అవుట్‌లెట్‌లకు విస్తరించనున్నామని చెప్పారు. నాలుగేళ్ల పలు పరీక్షల తర్వాత డిప్లోస్ మ్యాక్స్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. వచ్చే జూన్‌లో మరో క్రాస్‌ఓవర్‌ను విడుదల చేయడానికి కసరత్తు జరుగుతోందన్నారు. 2027లో ఇవి త్రిచక్ర వాహనాన్ని అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. డిప్లోస్ మాక్స్ హైదరాబాద్ ఎక్స్‌షోరూం ధరను రూ.1,12,199గా నిర్ణయించామన్నారు. ఇందులో రెండు బ్యాటరీలను ఉపయోగించామన్నారు. ఒక్క సారి చార్జింగ్‌తో 140 కిలోమీటర్ల మేర ప్రయాణించవచ్చన్నారు.

## పిఎంఒకు ఇన్ఫోసీస్ ట్రైనీ ఉద్యోగుల ఫిర్యాదు..!

దేశంలోనే రెండో అతిపెద్ద టెక్ కంపెనీ ఇన్ఫోసిస్ ఇటీవల శిక్షణ పొందుతున్న 400 మంది ట్రైనీలను అనుహ్యంగా తొలగించడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను అన్యాయంగా తొలగించారని ట్రైనీ ఉద్యోగులు ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఒ)కు ఫిర్యాదు చేశారని రిపోర్టులు వస్తోన్నాయి. కర్ణాటకలోని మైసూరు క్యాంపస్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీలకు ఉద్వాసన పలకగా.. అందులో దాదాపు 100 మంది పైగా పిఎంఒకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది. ఈ అంశంలో జోక్యం చేసుకొని తమ ఉద్యోగాలు తిరిగి ఇప్పించాలంటూ ట్రైనీలు కోరినట్లు తెలిసింది. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఆ సంస్థపై తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారని సమాచారం. ఫిబ్రవరి 7వ ట్రైనీలను 50 మందితో కూడిన బ్యాచ్‌లుగా పిలిచి వారితో మ్యూచువల్ సెపరేషన్ లెటర్లపై సంతకాలు చేయించుకుంది. సాయంత్రం 6 గంటల్లోపు 400 ట్రైనీలంతా క్యాంపస్‌ను వీడాలని ఆదేశాలు జారీ చేసింది. ఏకంగా పలువురిని బౌన్సర్లను ఉపయోగించి బయట నెట్టించారనే ఆరోపణలు వచ్చాయి.

## మార్కెట్‌ను షేక్ చేస్తున్న రివోల్ట్ ఈవీ బైక్..



భారతదేశంలో ఇటీవల కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ వేగంగా పెరుగుతుంది. ఈవీ వాహనాల్లో స్కూటర్ల సేల్స్ గణనీయంగా ఉన్నాయి. అయితే ఈవీ బైక్స్ మార్కెట్‌లో తమ హవా చూపించుకోవడానికి చాలా కంపెనీలు నూతన ఈవీ బైక్స్‌ను మార్కెట్‌లోకి లాంచ్ చేస్తున్నాయి. తాజాగా ప్రముఖ కంపెనీ రివోల్ట్ ఆర్‌వీ బ్లేజ్‌ఎక్స్ పేరుతో నూతన ఈవీ బైక్‌ను లాంచ్ చేసింది. రివోల్ట్ మోటార్స్ అధికారికంగా ఆర్‌వీ బ్లేజ్‌ఎక్స్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ బైక్ ధర రూ.1,14,990 (ఎక్స్-షోరూమ్)గా ఉంది. ఆర్‌వీ బ్లేజ్‌ఎక్స్ స్టెర్లింగ్ సిల్వర్ బ్లాక్, ఎక్లిప్స్ రెడ్ బ్లాక్ రంగుల్లో కొనుగోలుకు అందుబాటులో ఉంటుంది. ఈ బైక్‌కు సీటు కింద ఛార్జింగ్ కంపార్ట్మెంట్ ఉంటుంది. ఈ బైక్ 4జీ టెలిమాటిక్స్, జీపీఎస్ నావిగేషన్, మొబైల్ కనెక్టివిటీ, జియో-ఫెన్సింగ్, ఓవర్-ది-ఎయిర్ అప్‌డేట్స్‌తో ఆకట్టుకుంటుంది. ఆర్‌వీ బ్లేజ్‌ఎక్స్ బైక్‌లో ఆరు అంగుళాల ఎల్‌సీడీ డిజిటల్ క్లస్టర్ ఆకట్టుకుంటుంది. అలాగే రైడింగ్ అనుభవాన్ని మెరుగుపరచడానికి ఆర్‌వీ బ్లేజ్‌ఎక్స్ సీబీఎస్ బ్రేకింగ్, టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్కులు, ట్విన్ షాక్ అబ్జార్బర్లతో వస్తుంది. రివోల్ట్ ఆర్‌వీ బ్లేజ్‌ఎక్స్ 4 కేడబ్ల్యూ పీక్ పవర్ మోటార్‌తో వస్తుంది. అందువల్ల ఈ బైక్ గంటకు 85 కి.మీ. గరిష్ట వేగాన్ని అందిస్తుంది. అలాగే ఓ సారి ఛార్జ్ చేస్తే 150 కి.మీ. పరిధిని అందిస్తుంది. ఈ బైక్‌ను కేవలం 80 నిమిషాల్లో 80 శాతం మేర చార్జింగ్ చేయవచ్చు.

# జాతీయం – అంతర్జాతీయం

## కేంద్రమంత్రి పర్యటనను వ్యతిరేకిస్తూ డిఎంకె, విద్యార్థిసంఘాల నిరసన



చెన్నై : కేంద్ర విధ్యాశాఖ సహాయక మంత్రి సుకాంత మజుందార్ పర్యటనను వ్యతిరేకిస్తూ డిఎంకె, ఫెడరేషన్ ఆఫ్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్స్ –తమిళనాడు (ఎఫ్ఎస్ఒ–టిఎన్) శుక్రవారం ఆందోళన చేపట్టాయి. ఐఐటి మద్రాస్‌లో ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆయన చెన్నై వచ్చారు. ఆందోళనల నేపథ్యంలో ఐఐటి మద్రాస్ వెలుపల భారీగా పోలీస్ సిబ్బందిని మోహరించారు. వివాదాస్పద త్రిభాషా విధానం, రాష్ట్రానికి నిధుల విడుదలపై డిఎంకె ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె.స్టాలిన్ పిలుపునిచ్చారు. త్రిభాషా విధానం, డీలిమిటేషన్‌కి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో పాల్గొనాలని ప్రజలను కోరారు. ప్రస్తుతం తమిళనాడు ప్రభుత్వం రెండు కీలకమైన ఛాలెంజ్‌లను ఎదుర్కొంటోందని, ఒకటి భాష, రెండు డీలిమిటేషన్. ఇవి తమిళనాడు ఆత్మగౌరవం,

సామాజిక న్యాయం, ప్రజల సంక్షేమాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. ఈ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, రాష్ట్రాన్ని రక్షించుకునే ఆందోళనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సోషల్‌మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. కర్ణాటక, పంజాబ్, తెలంగాణలు సంఘీభావం ప్రకటించాయని అన్నారు. త్రిభాషా విధానం ఇప్పటికే కేంద్రం నుండి నిధుల నిలిపివేతకు దారితీసిందని, అలాగే డీలిమిటేషన్‌తో రాష్ట్ర ప్రాతినిత్యం తగ్గించబోమని అన్నారు. తమిళనాడు సంక్షేమం, భవిష్యత్తు గురించి ఎప్పటికీ రాజీపడబోమని అన్నారు. "తమిళనాడు ప్రతిఘటిస్తుంది, తమిళనాడు విజయం సాదిస్తుంది" అని స్టాలిన్ స్పష్టం చేశారు.

## జాబిల్లి పైకి ప్రైవేట్ కంపెనీ గ్రేస్ డ్రోన్

కేప్‌కెనవెరాల్ అంతరిక్షరేసులో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేయడానికి అమెరికా కీలక చర్యలు చేపడుతోంది. మరోసారి మానవ రహిత జాబిల్లి యాత్ర చేపట్టడానికి సిద్ధమైన నాసా , అంతకంటే ముందు చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ కోసం వరుసగా ప్రయోగాలు చేస్తోంది. తాజాగా చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద దిగేలా ఓ ప్రైవేట్ కంపెనీ చేసిన లూనార్ ల్యాండర్‌ను ప్రయోగించింది. దీని ద్వారా జాబిల్లిపై సూర్య కిరణాలు ఎన్నడూ పడని ఓ బిలం పైకి డ్రోన్‌ను పంపడానికి ప్రణాళిక రూపొందించింది. ఇంట్యూటివ్ మెషీన్స్ సంస్థ అభివృద్ధి చేసిన అధీనా ల్యాండర్‌ను స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్‌తో పంపించింది. నాసా కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి దూసుకెళ్లిన ఈ రాకెట్.. మార్చి 6న ఉపరితలంపై దిగేలా రూపొందించారు. 15 అడుగుల ఎత్తయిన ఈ అధీనా ల్యాండర్ దక్షిణ ధ్రువానికి 100 మైళ్ల దూరంలో ల్యాండ్ అయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ ప్రాంతం జెట్ బ్లాక్ బిలానికి కేవలం 400 మీటర్ల దూరంలోనే ఉంటుంది. చంద్రుడిపై సూర్య కిరణాలు ఎప్పుడూ పడని ప్రాంతంగా జెట్ బ్లాక్ బిలాన్ని అభివర్ణిస్తుంటారు. ఈ బిలం పైకి గ్రేస్ అనే డ్రోన్‌ను పంపించడమే అధీనా ల్యాండర్ మిషన్ లక్షం. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ దిగ్గజం గ్రేస్ హొపర్ గుర్తుగా ఈ డ్రోన్‌కు ఆయన పేరు పెట్టారు. మూడు అడుగులు ఉండే ఈ డ్రోన్ , జాబిల్లి ఉపరితలంపై మూడు కీలక పరీక్షలు నిర్వహించనుంది. ఇందులో హైడ్రోజన్ ఇంధన థ్రస్టర్లను ఉపయోగించారు. దీంతో డ్రోన్ ఎగురుతుంది. నావిగేషన్ కోసం కెమెరా, లేజర్లను ఏర్పాటు చేశారు. డ్రోన్ ఎగురుతుండగా, దీని లోని పరికరాలు జాబిల్లి ఉపరితలాన్ని అన్వేషిస్తాయి. ఈ ల్యాండర్‌తోపాటు ఫాల్కర్ 9 రాకెట్‌లో లూనార్ ట్రయల్ బ్లేజర్ స్పేస్‌క్రాఫ్ట్‌ను కూడా నాసా చంద్రుడి పైకి పంపించింది. ఇది చంద్రుడి కక్షలో తిరుగుతూ జాబిల్లిపై నీటి జాడను అన్వేషిస్తుందని నాసా వెల్లడించింది. చంద్రుడిపై పరిశోధనల కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు.



జనవరిలో అమెరికా, జపాన్ కంపెనీలు చంద్రుడి పైకి ల్యాండర్లను పంపాయి. టెక్సాస్ కంపెనీ ఫైర్‌పై ఏరోస్పేస్ మరోవారంలో చంద్రుడిపై అడుగుపెట్టే అవకాశం ఉంది. ప్రైవేట్ సంస్థల ప్రయోగాలకు నాసా మద్దతు అందిస్తోంది. చంద్రుడిపై ల్యాండర్‌ను పంపే విషయంలో గతంలో చేసిన పొరపాట్లు ఈ సారి జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇప్పటివరకు రష్యా, చైనా, అమెరికా, చైనా, భారత్, జపాన్ దేశాలు చంద్రునిపై అడుగుపెట్టాయి.

## మహిళల భద్రతకు చట్టాలు చేస్తే సరిపోదు.. మాజీ సిజెఐ చంద్రచూడ్ వ్యాఖ్యలు



ముంబయి : కేవలం చట్టాలు చేయడం వల్ల మహిళలపై నేరాలు జరగడం ఆగిపోవని, వాటిని సక్రమంగా అమలు చేస్తేనే ఆగుతాయని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ గురువారం వ్యాఖ్యానించారు. పూనే బస్సులో మహిళపై అత్యాచారం జరిగిన సంఘటనపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆయన 2012 నాటి నిర్భయ సంఘటనను గుర్తు చేసుకుంటూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముంబయిలో ఒక కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పూనే బస్సు సంఘటన గురించి విలేకర్లు ప్రశ్నించగా..మహిళల కోసం చేసిన చట్టాలను సక్రమంగా అమలు చేయగలిగితేనే ఇటువంటి లైంగిక వేధింపుల సంఘటనలు నివారించగలుగుతామని అన్నారు. ఆనాటి నిర్భయ సంఘటన తర్వాత చట్టాల్లో చాలా మార్పులు తీసుకువచ్చారన్నారు. ఇటువంటి చట్టాలు చేసినంత మాత్రాన నేరాలు ఆగిపోవు, చట్టాలు రూపొందించడంతో పాటూ వాటిని అమలు చేసే విధానం కూడా అత్యంత కీలకమని, అలాగే సమాజం బాధ్యత కూడా చాలా బృహత్తరమైనదని ఆయన వ్యాఖ్యానించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పనుల కోసం బయటకు వెళుతున్నారు. అటువంటపుడు వారి కోసం చేసే చట్టాలు వారు సురక్షితంగా వున్నామని భావించేలా అమలు చేయాలన్నారు. సక్రమ దర్యాప్తు, గట్టి చర్యలు, శీఘ్రగతిన విచారణ, శిక్ష విధింపు వంటి చర్యలు తీసుకోవాల్సి వుందన్నారు.

ఇందులో చట్టపరమైన వ్యవస్థ, పోలీసులకు బృహత్తరమైన బాధ్యత వుందని అన్నారు. మహిళలు వారి ఉద్యోగాలను సురక్షితంగా చేసుకోగలిగేలా మనం ప్రతి స్థాయిలోనూ దీని గురించి అత్యంత జాగ్రత్తగా ఆలోచించాలన్నారు. సమ సమాజం యొక్క ప్రాథమిక విధి ఇదని ఆయన వ్యాఖ్యానించారు.

## టర్కీలో మరో విడత రష్యా, అమెరికా దౌత్యవేత్తల చర్చలు





అంకారా : శాంతి చర్చల దిశగా అమెరికారష్యా దౌత్యవేత్తలు టర్కీలో గురువారం భేటీ అయ్యారు. అమెరికా రాయబార కార్యాలయం దీనికి వేదికగా మారింది. ఇరు దేశాల సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు చేస్తున్న యత్నాల్లో భాగంగా వాషింగ్టన్, మాస్కో లోని దౌత్య కార్యాలయాల్లో నెలకొన్న వివాదాలను చర్చించుకున్నారు. దీనిలో ఉక్రెయిన్, ఇతర రాజకీయ , భద్రతా పరమైన అంశాలను చేర్చలేదు. అమెరికా విదేశాంగ శాఖ దీనిపై మాట్లాడుతూ ఈ చర్చలు నిర్మాణాత్మకంగా కనిపిస్తున్నాయన్నారు. సమస్యలు పరిష్కారం అవుతాయా లేదా అన్నది తేలిపోతోందన్నారు. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ మాట్లాడుతూ తమ దేశ దౌత్యవేత్తలకు మెరుగైన పరిస్థితులు కల్పించేందుకు ఈ చర్చలు జరుగుతున్నాయన్నారు. ఉక్రెయిన్‌లో శాంతికోసం ట్రంప్ వేగంగా తీసుకుంటున్న చర్యలపై పుతిన్ స్పందించారు. అమెరికా, రష్యాల మధ్య విశ్వాసాన్ని పునరుద్ధరించకపోతే ఏమీ సాధించలేరని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తాజాగా ఇరుదేశాలు దౌత్యస్థాయిలో సమస్యల పరిష్కారానికి టర్కీలో భేటీ అయ్యాయి. రష్యాతో కూడా ట్రంప్ ఖనిజాల ఒప్పందం చేసుకుంటారన్న వార్తలు వెలువడుతుండటంతో ఈ చర్చలకు ప్రాధాన్యం పెరిగింది.



## అస్సాంను దోచుకుంటున్న సిఎం

న్యూఢిల్లీ : అస్సాం సిఎం హిమంత బిశ్వ శర్మ, ఆయన కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) అస్సాం ఇంఛార్జ్, జనరల్ సెక్రటరీ జితేంద్ర సింగ్ అల్వార్ ఆరోపించారు. గురువారం ఢిల్లీలోని ఇందిరా భవనంలో అస్సాం కాంగ్రెస్ నేతలతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. ఈ సమావేశంలో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించడం జరిగిందని జితేంద్ర తెలిపారు. ఈ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'అస్సాంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే.. అక్కడి అవినీతి బిజెపి ప్రభుత్వాన్ని కూల్చాలి. సమాజంలో అశాంతి నెలకొందని అందరికీ తెలుసు. సిఎం హిమంత బిశ్వశర్మ స్థాపించిన అవినీతి లంకను నాశనం చేయాలి' అని అన్నారు. కాగా, అస్సాంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సీనియర్ నేతలు కూడా నిన్న జరిగిన సమావేశానికి హాజరైనట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిని ఎదుర్కోవాలంటే.. ఎలాంటి సన్నాహాలు చేయాలి? ఏవిధంగా ప్రచారాలు నిర్వహించాలి వంటి విషయాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. అస్సాంలో మాఫియా పాలన సాగుతుందోని, సిఎం హిమంత బిశ్వశర్మ, ఆయన కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని సీనియర్ నేతలు కూడా అభిప్రాయపడ్డారని జితేంద్ర సింగ్ అన్నారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి రాహుల్‌గాంధీ అస్సాం కాంగ్రెస్ నేతలతో ప్రత్యేకంగా చర్చించారని జితేంద్ర తెలిపారు.

## ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా మోహన్ సింగ్ బిష్త్

ఆరుసార్లు బిజెపి ఎంఎల్ఏగా ఉన్న మోహన్ సింగ్ బిష్త్(67) గురువారం ఢిల్లీ అసెంబ్లీకి డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఆయన పేరును ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రతిపాదించారు. ప్రతిపాద తీర్మానాన్ని పర్యావరణ శాఖ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా బలపరిచారు. కాగా అనిల్ కుమార్ శర్మ ప్రతిపాదించిన రెండవ తీర్మానాన్ని గజేందర్ సింగ్ యాదవ్ బలపరిచారు. ప్రముఖ బిజెపి నాయకుడైన బిష్త్ ముస్తఫాబాద్ నుంచి ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. ఆయన ఆప్ అభ్యర్థి అయిన ఆదిల్ అహ్మద్ ఖాన్‌ను 17000 ఓట్లతో ఓడించారు. బిష్త్ ఇదివరలో 1998 నుంచి 2015 వరకు కరావల్ నగర్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత మళ్లీ 2020లో గెలుపొందారు. ఆమ్ ఆద్మీ పార్టీ దశాబ్ద కాలం పాలన తర్వాత బిజెపి ఇటీవల ఢిల్లీ పీఠాన్ని దక్కించుకుంది. ఢిల్లీ 70 సీట్లలో బిజెపి 48 గెలుచుకుంది. కాగా ఆప్‌కు కేవలం 22 సీట్లు దక్కాయి. కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది.

## ట్రంప్ తొలి కేబినెట్ భేటీ! ప్రశ్నించే మీడియా సంస్థలకు నో ఎంట్రీ



వాషింగ్టన్ : రెండో పదవీ కాలంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం మొదటి కేబినెట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశం కవరేజీకి కొన్ని మీడియా సంస్థలను వైట్‌హౌస్‌లోకి అనుమతించలేదు. మీడియా కవరేజీపై ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విధానానికి అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకువచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ట్రంప్ విధానాలను విమర్శిస్తూ కథనాలను రాసిన మీడియా సంస్థలను, ప్రశ్నించే మీడియా ప్రతినిధులను ఉద్దేశపూర్వకంగానే అనుమతించలేదన్న విమర్శలు వస్తున్నాయి. రాయిటర్స్, అసోసియేటెడ్ ప్రెస్, హఫ్‌పోస్ట్, జర్మనీ వార్తాపత్రిక అయిన డెర్ తెగస్పిగల్‌లకు చెందిన విలేకర్లను, ఫోటోగ్రాఫర్లను అనుమతించలేదు. కేవలం ఎబిసి, న్యూస్‌మాక్స్, ది బ్లేజ్, బ్లూమ్‌బెర్గ్ న్యూస్, ఎన్‌పిఆర్, యాక్సియోస్‌లకు చెందిన వారిని మాత్రమే అనుమతించారు. ఓవల్ ఆఫీసు వంటి చిన్న చిన్న ప్రదేశాల్లో నిర్వహించే పత్రికా సమావేశాలకు ఎవరెవరినీ పిలవాలనే అంశంపై వైట్‌హౌస్ నిర్ణయం తీసుకుంటుందని మంగళవారం ట్రంప్ ప్రభుత్వం వెల్లడించింది. సాంప్రదాయ మీడియా సంస్థలను ట్రంప్ రోజువారీ కార్యక్రమాల కవరేజికి అనుమతిస్తామని వైట్‌హౌస్ పత్రికా కార్యదర్శి కెరొలిన్ లెవిట్ తెలిపారు. కాగా ఈ చర్యను ఎపి, బ్లూమ్‌బెర్గ్, రాయిటర్స్ మీడియా సంస్థలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు మూడు సంస్థలు ఒక ప్రకటన జారీ చేశాయి. ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం స్వేచ్ఛాయుతంగా, స్వతంత్రంగా వ్యవహరించాలని పేర్కొన్నాయి. పత్రికా స్వేచ్ఛను ఇది దారుణంగా ఉల్లంఘించడమేనని హఫ్‌పోస్ట్ పేర్కొంది. రాజకీయ వైఖరులతో నిమిత్తం లేకుండా అన్ని వర్గాల పాఠకులకు సకాలంలో, కచ్చితమైన వార్తలను అందించడానికే తాము కృషి చేస్తూ వుంటామని, అటువంటి ఈ చర్యలు సముచితం కాదని పేర్కొన్నాయి.


## నలుగురు బందీల మృతదేహాలను అప్పగించిన హమాస్

గాజా : తమ చెరలో వున్న నలుగురు బందీల మృతదేహాలను హమాస్, గురువారం తెల్లవారు జామునే రెడ్‌క్రాస్‌కు అప్పగించింది. మరోవైపు ఇజ్రాయిల్ జైళ్ళ నుండి వందలాదిమంది పాలస్తీనా ఖైదీలు విడుదలయ్యారు. మరికొద్ది రోజుల్లో కాల్పుల విరమణ ఒప్పందం ముగియనుంది. మొదటి దఫా కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా ఇరు పక్షాలు నిబంధనలకు అనుగుణంగా తమ విధులను నిర్వర్తించాల్సి వుంది. ఇప్పటివరకు హమాస్ 33 మంది బందీలను అప్పగించగా, వీటిలో 8 మృత దేహాలు వున్నాయి. కాగా ఇజ్రాయిల్ దాదాపు 2 వేల మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది. కాగా మృతదేహాల గుర్తింపు ప్రక్రియను కూడా పూర్తి చేసినట్లు ఇజ్రాయిల్ అధికారులు వెల్లడించారు. ఇజ్రాయల్ జైళ్ళ నుండి 456 మంది పాలస్తీనియన్లు విడుదల కాగా, వారిలో 97 మందిని ఈజిప్ట్‌కు తరలించారు. 37 మంది వెస్ట్ బ్యాంక్ చేరుకున్నారు. మరో ఐదుగురు ఆక్రమిత తూర్పు జెరూసలేం వెళ్ళారు. 24మంది చిన్నారులతో సహా మరికొంతమంది ఇంకా విడుదల కావాల్సి వుందని వారి విడుదల ప్రక్రియలో ఇజ్రాయిల్ కావాలనే జాప్యం చేస్తోందని హమాస్ విమర్శించింది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో వున్నప్పటికీ గత 48 గంటల్లో గాజా ఆస్పత్రులకు 17 మృతదేహాలు వచ్చాయి. 19 మంది గాయపడినవారు చికిత్స పొందారని పాలస్తీనా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. రెండో దఫా కాల్పుల విరమణ చర్చల కోసం కైరోకు వెళ్ళాల్సిందిగా ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తమ ప్రతినిధి బృందాన్ని ఆదేశించారని ప్రధాని కార్యాలయం తెలిపింది. ఈ వారాంతానికి మొదటి దఫా ఒప్పందం ముగియనుంది. దాంతో రెండో విడత ఒప్పందంపై చర్చలు ముమ్మరమయ్యాయి. కాగా, రెండో దశ ఒప్పందం కుదుర్చుకునే విషయంలో ఇజ్రాయిల్ చిత్త శుద్ధితో వ్యవహరించడం లేదని హమాస్ పొలిట్‌బ్యూరో సభ్యులు బసీమ్ నయీమ్ విమర్శించారు. బదులుగా సైనిక దాడులను ముమ్మరం చేయాలని భావిస్తోందన్నారు. గాజాకు ఈజిప్ట్‌తో గల సరిహద్దు పొడవునా గల ఫిలడెల్ఫి కారిడార్ నుండి ఇజ్రాయిల్ మిలటరీ వైదొలగేది లేదని ఇజ్రాయిల్ మీడియా వర్గాలు తెలిపాయి.

## ఉద్యోగుల తొలగింపుపై ట్రంప్ యంత్రాంగానికి ఎదురుదెబ్బ

వాషింగ్టన్ : ఫెడరల్ ఉద్యోగులక తొలగింపు ఆదేశాలపై ట్రంప్ యంత్రాంగానికి ఎదురు దెబ్బతగిలింది. భారీ సంఖ్యలో ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ యుఎస్ డిస్ట్రిక్ జడ్జి గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణంగా ఒక ఏడాదికంటే తక్కువ అనుభవం ఉన్న ప్రొబేషనరీ ఉద్యోగులతో సహా శాశ్వత ఉద్యోగులను తొలగించమని ఫెడరల్ ఏజన్సీలను ఆదేశించే అధికారం అమెరికా పర్సనల్ మేనేజ్‌మెంట్‌కు లేదని శాన్‌ఫ్రాన్సిస్కో జిల్లా జడ్జి విలియం అల్సప్ పేర్కొన్నారు. ఫెడరల్ ఏజన్సీలే తమ విభాగాల్లో సిబ్బంది నియామకాలు, తొలగింపులు నిర్వహించేలా కాంగ్రెస్ వాటికి అధికారం కల్పించిందని, ట్రంప్ నిర్ణయం చట్టవ్యతిరేకమని జడ్జి పేర్కొన్నారు. జనవరి 20న జారీ చేసిన మెమోను, ఫిబ్రవరి 14న జారీ చేసిన ఇమెయిల్‌ను ఉపసంహరించుకోవాలని ఆదేశించారు. ఈ తొలగింపులు శాస్త్ర పరిశోధన, అనుభవజ్ఞుల సేవలతో సహా పలు విభాగాలకు విస్తృతంగా హాని కలిగిస్తాయని విలియం అల్సప్ వ్యాఖ్యానించారు. అధిక ఖర్చులను తగ్గించుకునే ప్రణాళికలో భాగంగా ఫెడరల్ ఏజన్సీ ఉద్యోగులను తొలగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షులు ట్రంప్, డోజ్ కోఛైర్‌గా ఉన్న మస్క్ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ కొన్ని కార్మిక యూనియన్లు కోర్టును ఆశ్రయించాయి.

## ట్రంప్‌ను కెనడాలోకి రానీయవద్దు



టొరంటో : అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను నేరస్థుడిగా కెనడా ప్రతిపక్ష ఎన్‌డీపీ (నేషనల్ డెమోక్రటిక్ పార్టీ ) నేత , ఖలిస్థానీ సానుభూతి పరుడు జగ్మీత్ సింగ్ ఆరోపించారు. ఆయనను జి7సదస్సుకోసం కెనడా భూభాగంపై అడుగు పెట్టనీయకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. బుధవారం జగ్మీత్‌సింగ్ మాంట్రియాల్ కౌన్సిల్ ఆన్ ఫారెస్ రిలేషన్స్ సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. మన ప్రజాస్వామ్యానికి, సార్వభౌమత్వానికి ముప్పుగా మారి, మన ఆర్థిక వ్యవస్థను , మన మిత్రులను, ప్రపంచాన్ని బెదిరించిన వ్యక్తిని ఎందుకు అనుమతించాలని ఆయన ప్రశ్నించారు. ట్రంప్‌ను ఆపేందుకు జి7 వేదికను వాడుకోవాలని కెనడా ప్రభుత్వాన్ని, మిత్రదేశాలను ఆయన అభ్యర్థించారు. సింగ్ ప్రకటనపై ఇప్పటివరకు కెనడా ప్రభుత్వం స్పందించలేదు. ప్రధాని కార్యాలయ ప్రతినిధి సైమన్ లాఫార్చ్యూ స్పందిస్తూ దీనిపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని వెల్లడించారు. ట్రంప్ చేసిన వ్యాఖ్యల్లో చాలావరకు తనకు కోపం తెప్పించాయని, అయితే ఇదే సమయంలో కలిసి పనిచేసే మార్గాలను వెతకాలని ఇంధన శాఖ మంత్రి జోనాథన్ విల్కిన్సన్ పేర్కొన్నారు. జూన్ 15 నుంచి 17 వరకు అల్బర్టాలో జీ7 సమావేశాలు జరగనున్నాయి.



# చక్కని ఆరోగ్యం

## ఒమేగా-3 సప్లిమెంట్లు ఎక్కువగా వాడేస్తున్నారా..



వైద్యుల సలహా లేకుండానే ఒమేగా 3 వంటి సప్లిమెంట్ల వాడకం ఎక్కువవుతుంది. ఇవి తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలున్నాయి. రోజంతా యాక్టివ్ గా ఉండటం, చర్మం కాంతివంతంగా అవ్వడం, జుట్టుకు పోషణనివ్వడం వంటి వాటికి ఇవి బాగా పనిచేస్తాయి. అందుకని వీటిని ఎక్కువగా వాడేస్తుంటారు. అలాగే ఒమేగా 3 లభించే ఆహారాల్ని కూడా ఎక్కువగా తీసుకుంటారు. వీటి వల్ల మీ శరీరంలో కలిగే ప్రమాదాలను అంచనా వేయకపోవడం భారీ నష్టాన్ని కలుగజేయవచ్చు. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు మీ శరీరం సొంతంగా ఉత్పత్తి చేయలేని ముఖ్యమైన కొవ్వులను భర్తీ చేస్తుంటాయి. అంటే మీరు వాటిని మీ ఆహారం లేదా సప్లిమెంట్ల రూపంలో తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఆరోగ్యకరమైన కొవ్వులు గుండెల్లో మంటను తగ్గించడం, రక్తపోటును నియంత్రించడం, కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడం వంటి కీలక బాధ్యతను నిర్వహిస్తాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఒమెగా 3 ఫ్యాటీ ఆసిడ్స్‌ది కీలక పాత్ర అని చెప్పుకోవాలి. అవి మెదడు పనితీరుకు కూడా మెరుగుపరుస్తుంటాయి. ఆరోగ్యకరమైన కణ త్వచాలను ప్రోత్సహిస్తాయి. కంటి ఆరోగ్యానికి కాపాడటంలో ఇవెంతో ముఖ్యమైనవి. ఒమేగా-3లు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో, ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక పరిస్థితుల ప్రమాదాన్ని తగ్గించడంలో, మానసిక శ్రేయస్సుకు కూడా దోహదం చేస్తాయి. ఎప్పుడూ నిరాశ, ఆందోళన వంటి భావోద్వేగాలను నియంత్రించలేక బాధపడుతున్న వారికి కూడా ఇవెంతో గొప్పగా ఉపయోగపడుతుంటాయి.

ఒమెగా 3 కొవ్వులు లభించే ఆహారాలు చాలానే ఉన్నాయి. అందులో సాల్మన్ సార్డిన్స్, ట్రౌ చేపల నుంచి వచ్చే కొవ్వుల్లో ఇవి ఎక్కువగా ఉంటాయి. చేపల నుంచే కాకుండా జంతువల నుంచి కూడా ఈ ఆమ్లాలు లభిస్తాయి. అంటే చియా సీడ్స్, అవిసె గింజలు, వాల్ నట్స్, అల్ఫా లినోలెనిక్ ఆమ్లం రూపంలో ఒమెగా 3 అందుతుంది. జనపనార గింజలు, ఎడామామ్, కొన్ని ఆల్గే ఆధారిత సప్లిమెంట్లు కూడా ఈ లిస్టులో ఉన్నాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల సహజంగానే మీకు గుండె, మెదడుతో పాటు మొత్తం ఆరోగ్యానికి అవసరమైన ఒమేగా 3 ఆమ్లాలు ప్రయోజనాలిస్తాయి. అయితే వీటిని ఎక్కువ మొత్తంలో తీసుకుంటే ఎన్నో రకాల సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయి అవేంటో తెలుసుకోండి. ఒమెగా 3 యాసిడ్లు లభించే ఆహార పదార్థాలు లేదా సప్లిమెంట్లను ఎక్కువగా తీసుకుంటే అంతే మొత్తంలో మీకు సైడ్ ఎఫెక్ట్స్ ను కలిగించే ప్రమాదం కూడా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సప్లిమెంట్లను ముఖ్యంగా చేప నూనెను ఉపయోగించి తయారు చేస్తారు. ఇవి రక్తాన్ని పలుచగా చేసే లక్షణాన్ని కలిగి ఉంటాయి. మీ గుండె ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ వీటిని దీర్ఘ కాలంగా వాడటం లేదా ఆహారం ద్వారా తీసుకోవడం వల్ల రక్తం పలుచబడి రక్తస్రావం అయ్యే ప్రమాదం ఉంది. గాయాలైనప్పుడు రక్తం గడ్డకట్టకుండా ప్రమాదాన్ని తెస్తుంది. సర్జరీల వంటివి చేసేటప్పుడు కూడా ఇందుకు సంబంధించిన సైడ్ ఎఫెక్ట్స్ కలుగజేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే మీరు రక్తపోటుకు సంబంధించిన మందులు వాడుతూ ఉంటే వీరు వైద్యుల సలహా తీసుకోకుండా ఒమెగా 3ని అధికంగా వాడకూడదు. వీటి వల్ల జీర్ణవ్యవస్థంలో అసౌకర్యం కలుగుతుంది. కడుపు ఉబ్బరంగా అనిపించడం, కడుపు నొప్పి కలుగుతాయి. కొందరిలో వీటి వల్ల త్రేన్పులు వస్తుంటాయి. వాటి ద్వారా నోటి నుంచి దుర్వాసన రావచ్చు. ఇవి రక్తపోటును అదుపు చేయగలవు. కానీ అధికంగా తీసుకుంటే మాత్రం కచ్చితంగా సైడ్ ఎఫెక్ట్స్ ను కూడా ఇస్తాయి. దీని వాడకం ఎక్కువైతే హైపోటెన్షన్, మైకం, మూర్ఛ లేదా తేలికపాటి తలనొప్పి వంటి లక్షణాలు కూడా కలుగుతాయి.

## ఒకే ఒక్క గ్లాస్ జ్యూస్.. దెబ్బకు ఆ సమస్యలన్నీ పరార్..



టమాటా అనేది సాధారణంగా ప్రతి ఇంట్లో ఉండే కూరగాయ.. దీనిని కూరగా, చట్నీగా, సలాడ్ కూడా తినడానికి ఇష్టపడతారు. ఇంకా జ్యూస్ ను కూడా తాగుతారు.. టమోటా రుచిలో మంచిగా ఉంటుంది.. దీన్ని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. అందువల్ల, ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో టమోటా రసం తాగడం వల్ల మీకు ఎలాంటి ప్రయోజనాలు లభిస్తాయో తెలుసుకోవడం చాలా ముఖ్యం. టమోటాలలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. ఉదయం ఖాళీ కడుపుతో టమోటా రసం తాగడం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా పరిగణిస్తారు.. టమోటాలు విటమిన్ సి, పొటాషియం, లైకోపీన్, యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలం.. ఇవి శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో, రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. ఈ విషయంలో, ఆయుర్వేద నిపుణుడు డాక్టర్ కిరణ్ గుప్తా మాట్లాడుతూ.. టమాట రసాన్ని ఖాళీ కడుపుతో తీసుకుంటే.. అది శరీరంలో త్వరగా శోషించబడుతుందన్నారు.. ఇది జీర్ణవ్యవస్థ, చర్మం, గుండె ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మిమ్మల్ని శక్తివంతంగా ఉంచడమే కాకుండా జీవక్రియను మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది.టమోటా రసం చర్మ కాంతిని పెంచడంలో.. రక్తపోటును నియంత్రించడంలో, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో కూడా ప్రభావవంతంగా ఉంటుందని డాక్టర్ కిరణ్ గుప్తా అన్నారు. ఇది కడుపునకు తేలికగా ఉంటుంది.. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. తద్వారా ఆమ్లత్వం, మలబద్ధకం వంటి సమస్యలను తొలగిస్తుంది. అంతేకాకుండా, ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటం ద్వారా వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తాయి.. మీ చర్మాన్ని యవ్వనంగా, ప్రకాశవంతంగా ఉంచుతాయి. మీరు మీ ఆహారంలో సులభమైన, ఆరోగ్యకరమైనదాన్ని జోడించాలనుకుంటే, ప్రతి ఉదయం టమోటా రసం తాగడం ఒక గొప్ప ఎంపిక.. డయాబెటిక్ రోగులకు ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో టమోటా రసం తాగడం చాలా ప్రయోజనకరంగా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. టమోటాలలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెరను నియంత్రించడంలో, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. మీరు మెరిసే, ఆరోగ్యకరమైన చర్మం కోరుకుంటే, టమోటా రసం తాగడం ప్రారంభించండి. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉంటాయి.. ఇవి చర్మాన్ని దెబ్బతినకుండా కాపాడతాయి.. ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. దీనివల్ల ముడతలు తగ్గి చర్మం మెరుస్తుంది. ఇది చర్మంపై సహజ మాయిశ్చరైజర్‌గా కూడా పనిచేస్తుంది.టమోటా రసం రక్తపోటును నియంత్రించడంలో, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇందులో పొటాషియం, లైకోపీన్ ఉంటాయి.. ఇవి గుండె కండరాలను బలోపేతం చేస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. దీనివల్ల గుండెపోటు, స్ట్రోక్ వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. టమోటా రసం శరీరం నుంచి మురికి విషాన్ని తొలగించడంలో సహాయపడుతుంది, శరీరాన్ని మరింత ఆరోగ్యంగా, చురుకుగా ఉంచుతుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు కాలేయం, మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతాయి.. రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయపడతాయి. దీనివల్ల శరీరం తాజాగా.. శక్తివంతంగా అనిపిస్తుంది. ప్రతిరోజు ఉదయం ఖాళీ కడుపుతో టమోటా రసం తాగడం వల్ల వ్యాధులతో పోరాడే సామర్థ్యం పెరుగుతుంది. ఇందులో ఉండే విటమిన్ సి, ఇతర పోషకాలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి.. దీని కారణంగా జలుబు, దగ్గు వంటి చిన్న వ్యాధులు సులభంగా రావు. మీరు సులభంగా అనారోగ్యానికి గురైతే, దీన్ని ఖచ్చితంగా మీ ఆహారంలో చేర్చుకోండి.



## బాదం ఎక్కువగా తింటే ఇన్ని కష్టాలా..?

డ్రైఫ్రూట్స్‌లలో అగ్రభాగంలో నిలుస్తుంది బాదం.. ఇందులో మన ఆరోగ్యానికి అవసరమైన అనేక రకాలైన ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. బాదం పప్పును నానబెట్టి తినడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. అయితే, ఎన్నో లాభాలున్నప్పటికీ బాదం పప్పును కొందరు తినకూడదని వైద్య ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అధిక రక్తపోటు కారణంగా హార్ట్ ఎటాక్, హార్ట్ స్ట్రోక్ వంటి ప్రాణాంతక సమస్యల్ని కలిగిస్తుంది. అయితే మీరు కూడా హైబీపీ పేషెంట్ అయితే మాత్రం బాదం పప్పును తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా బీపీ మందులను వాడుతూ బాదం పప్పులను తినడం చాలా డేంజర్ అంటున్నారు. కిడ్నీ స్టోన్స్ ఉన్నవారు కూడా బాదంపప్పులు తినడం మంచిది కాదు. వీటిలో ఆక్సలేట్ సమ్మేళనం ఎక్కువగా ఉంటుంది. ఇది మూత్రపిండాల్లోకి చేరితే కాలుష్యం పేరుకుపోయి రాళ్లుగా ఏర్పడతాయి. అలానే కిడ్నీ స్టోన్స్ ఉన్నప్పుడు వీటిని తింటే అప్పటికే రాళ్లు ఉంటే వాటి పరిమాణం పెరిగే అవకాశం లేకపోలేదు. మైగ్రేన్ తో బాధపడేవారు బాదం తినకూడదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇందులో విటమిన్ ఈ అధికంగా ఉంటుంది. మైగ్రేన్ లేదా తలనొప్పి ఉన్నప్పుడు బాదం తింటే ఈ సమస్య మరింత పెరుగుతుంది. మైకం, వికారం, వాంతులు, అలసట వంటి సమస్యలను కలిగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అధిక బరువు లేదా ఉబకాయ సమస్యతో బాధపడేవారు సైతం బాదాం పప్పుల జోలికి పోకూడదు. బాదం పప్పులో కేలరీలు సంతృప్త కొవ్వులు ఎక్కువగా ఉంటాయి ఇవి త్వరగా బర్న్ కావు దీంతో వీటిని ఎక్కువగా తినడం వల్ల బరువు మరింత పెరిగే ప్రమాదం ఉంది అందుకే వీటిని ఎక్కువగా తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఈరోజుల్లో చాలామంది అజీర్తి కడుపునొప్పి ఉబ్బరం గ్యాస్ వంటి సమస్యలతో బాధపడుతున్నారు ఇలాంటి వాళ్లు బాగా ఎక్కువగా తినకూడదు.

బాదంపప్పులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా ఇవి వేడి స్వభావాన్ని కలిగి ఉంటాయి. వీటిని తినడం వల్ల కడుపులో గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది. కడుపునొప్పి గ్యాస్ సమస్యలు మరింత తీవ్రమయ్యే ఛాన్స్ ఉంది.

## మఖానా అతిగా తింటున్నారా..?

నేటి యుగంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటారు. కరోనా కాలంలో మన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల కలిగే పరిణామాలను మనమందరం అనుభవించాము. అందువల్ల, ఇప్పుడు ప్రజలు తమ ఆహారంలో నిజంగా వారికి ప్రయోజనం చేకూర్చే వాటిని మాత్రమే చేర్చుకుంటున్నారు. వీటిలో ఒకటి మఖానా. ఇందులో ఫైబర్, కాల్షియం, ఐరన్, కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది రుచిని మాత్రమే కాకుండా ఆరోగ్యాన్ని కూడా ఇస్తుంది. మఖానాలో ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల జీర్ణ సమస్యలు రావచ్చు. ఎక్కువగా తింటే కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యలు వస్తాయి. మధుమేహం ఉన్నవారు మఖానాను తినే ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇది రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గించవచ్చు. మఖానాలో ఎక్కువ పరిమాణంలో పొటాషియం ఉంటుంది. దీనిని ఎక్కువగా తింటే కిడ్నీ సంబంధిత సమస్యలు రావచ్చు. కొంతమందికి మఖానా తినడం వల్ల అలర్జీ రావచ్చు. చర్మంపై దద్దుర్లు లాంటి సమస్యలు కనిపించవచ్చు. తామర గింజలను అధికంగా తీసుకోవడం వల్ల ఎముకలు మరియు శరీరంలోని ఇతర భాగాలలో కాల్సిఫికేషన్ పెరుగుతుంది. దీనివల్ల దంత గాయాలు, చర్మపు దద్దుర్లు, మూత్రపిండాల్లో రాళ్లు మరియు కరోనరీ ఆర్టరీ వ్యాధి వచ్చే ప్రమాదం పెరుగుతుంది. మఖానాలో పొటాషియం ఉంటుంది. కానీ ప్యాక్ చేసిన మఖానాలో అదనపు ఉప్పు ఉంటుంది. ఇది రక్తపోటు స్థాయిని పెంచుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. మఖానాను ఎక్కువగా తినడం వల్ల కొంతమందికి అలెర్జీలు రావచ్చు. ఫ్లూ, దగ్గు లేదా విరేచనాలు వంటివి. ఇది కాకుండా, చర్మ సంబంధిత సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది. మఖానా తక్కువ కేలరీల చిరుతిండి అయినప్పటికీ, దాని అధిక వినియోగం కూడా బరువును పెంచుతుంది. మీకు మూత్రపిండాల్లో రాళ్లు ఉంటే మఖానాను అస్సలు తినకండి. ఇందులో కాల్షియం ఉంటుంది. ఇది



మూత్రపిండాల్లో రాళ్ల పరిమాణాన్ని పెంచుతుంది. మీకు జలుబు, విరేచనాలు లేదా సాధారణ ఫ్లూ ఉంటే మఖానా తినకండి.

మఖానా తక్కువ కేలరీలతో ఉన్నా, ఎక్కువగా తింటే బరువు పెరిగే అవకాశం ఉంటుంది. కంటే నిత్యం మితంగా తీసుకోవడం మంచిది

## పరగడుపున బొప్పాయి తింటున్నారా?

బొప్పాయి, ఒక రుచికరమైన, పోషకమైన పండు. బొప్పాయిలో విటమిన్ ఎ, విటమిన్ సి, ఫైబర్, పపైన్ వంటి ఎంజైమ్‌లు పుష్కలంగా ఉంటాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి బొప్పాయి ఎంతగానో మేలు చేస్తుంది. పండిన బొప్పాయిని నేరుగా తినవచ్చు. బొప్పాయిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్ ఆహారాన్ని జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. బొప్పాయిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. బొప్పాయిలో ఉండే విటమిన్ ఎ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. బొప్పాయిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. బొప్పాయిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడతాయి. బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది, ఇది ఆహారాన్ని జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. ఇది మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలను తగ్గిస్తుంది. బొప్పాయిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. ఇది ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. బొప్పాయిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. క్యాలరీలు కూడా తక్కువగా ఉంటాయి. బొప్పాయిలో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ ఉంటాయి, ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడతాయి. రక్త ప్రసరణను కూడా మెరుగుపరుస్తుంది. బొప్పాయిలో విటమిన్ ఎ, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి, ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. చర్మ సౌందర్యాన్ని మెరుగుపరుస్తుంది.

బొప్పాయిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వాపును తగ్గించడంలో సహాయ పడతాయి. బొప్పాయిలో విటమిన్-సీ, విటమిన్-ఈ, బేటా కెరోటిన్ పోషకాలు



అధికంగా ఉంటాయి. ఇవి మీ కళ్ళను ఆరోగ్యంగా ఉంచుతాయి. బొప్పాయిలో చక్కెర తక్కువగా ఉంటుంది. ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలో హఠాత్తుగా పెరగకుండా ఉంటాయి.

# సినిమా

## నన్నే కాదు నాకు పుట్టబోయే పిల్లల్ని కూడా వదల్లేదు, ఎందుకింత ద్వేషం..



ప్రేమకు కులమతాలతో పట్టింపు లేదు. అది కేవలం హృదయాల్ని తాకుతుంది. మనసుల్ని ఒక్కటి చేస్తుంది. సమాజం విధించిన కట్టుబాట్లను కాదనుకుని మనసు మాట విని పెళ్లి చేసుకున్నవారికి సూటిపోటి మాటలు తప్పడం లేదు. ఈ విషయంలో ఇప్పటికీ విమర్శలు ఎదుర్కొంటునే ఉన్నానంటోంది హీరోయిన్ ప్రియమణి ఈమె 2017లో ప్రియుడు ముస్తఫ రాజ్‌ను పెళ్లి చేసుకుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు తనపై ట్రోలింగ్ జరుగుతూనే ఉందని చెప్తోంది. సంతోషాన్ని పంచుకుందామనుకుంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రియమణి మాట్లాడుతూ.. నేను నా సంతోషకర క్షణాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటాను. అలా నా ఎంగేజ్‌మెంట్ విషయాన్ని ఓ రోజు సోషల్ మీడియాలో వెల్లడించాను. విచిత్రంగా చాలామందికి మా జంటపై విపరీతమైన అనుమానాలు పుట్టుకొచ్చాయి. అతడు నన్ను మతం మార్పిడికి ఒత్తిడి తెస్తాడని ఏవేవో ఊహించుకుని మాపై విషం కక్కారు. జనాలు ఎంతదూరం వెళ్లారంటే.. రేపు మాకు పుట్టబోయే పిల్లలు ఐసిస్‌లో చేరతారని కామెంట్లు చేశారు.


**ఇప్పటికీ అంతే..**

నేను సినిమా ఇండస్ట్రీకి చెందిన వ్యక్తిని అయినంతమాత్రాన మీ నోటికి ఏదొస్తే అది అనేస్తారా? అసలు సంబంధం లేని వ్యక్తుల్ని కూడా విమర్శిస్తారా? ఆ ట్రోలింగ్ వల్ల రెండు, మూడు రోజులపాటు నేను మనిషిని కాలేకపోయాను. ఇప్పటికీ నా భర్తతో కలిసి దిగిన ఫోటోను షేర్ చేస్తే చాలు.. పదిలో తొమ్మిది కామెంట్లు మతం లేదా కులం గురించే ఉంటాయి అని చెప్పుకొచ్చింది. ఇకపోతే ప్రియమణి చివరగా ఆఫీసర్ ఆన్ డ్యూటీ అనే మలయాళ సినిమాలో కనిపించింది. ప్రస్తుతం విజయ్ జన నాయగన్ మూవీ చేస్తోంది. అలాగే ద ఫ్యామిలీ మ్యాన్ 3లో నటిస్తోంది.



## సల్మాన్ ఖాన్ 'సికందర్' టీజర్ రిలీజ్

కోలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఏఆర్ మురుగదాస్, బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'సికందర్' జై హో సినిమా తర్వాత ఏఆర్ మురుగదాస్, సల్మాన్ ఖాన్ కాంబోలో ఈ సినిమా రానుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను రంజాన్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే మూవీ నుంచి గ్లింప్స్‌ను వదిలిన చిత్రబృందం తాజాగా టీజర్‌ను వదిలింది. "నాన్నమ్మ అతడికి సికందర్ అని పేరు పెట్టింది. తాత ఏమో సంజయ్ అని పెట్టాడు. కానీ ప్రజలు మాత్రం అతడిని రాజాసాబ్ అని పిలుస్తారు అంటూ టీజర్ మొదలైంది. ఈ టీజర్ చూస్తుంటే.. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్నట్లు తెలుస్తుంది. ఫుల్ యాక్షన్ ప్యాక్డ్‌గా సాగిన ఈ టీజర్‌ను మీరు చూసేయండి. ఇక ఈ సినిమాను నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తున్నారు. రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తుండగా.. ఈ చిత్రంలో సత్యరాజ్ విలన్‌గా నటిస్తున్నాడు.



## ఇలాంటి పాత్రల్లో మెప్పిస్తుందా?

పూజా హెగ్డే హీరోయిన్‌గా అరంగేట్రం చేసి దశాబ్దం దాటింది. కానీ ఇన్నేళ్లు గడిచినా ఆమెను ఒక గ్లామర్ హీరోయిన్‌గానే చూస్తున్నారు. ఆమె నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు చేసింది తక్కువ. 'అరవింద సమేత' లాంటి కొన్ని చిత్రాల్లో మాత్రమే కొంత నటనకు ప్రాధాన్యం లభించింది. అలాంటి పాత్రల్లోనూ ఆమె గ్లామరే హైలైట్ అయింది తప్ప.. నటన గురించి పెద్దగా మాట్లాడుకోలేదు. అందం కోణంలో తప్ప నటన కోసం చూడని కొద్దిమంది హీరోయిన్లలో పూజా ఒకరని చెప్పాలి. అలాంటి హీరోయిన్లను డీగ్లామరస్, పెయిన్ ఫుల్ క్యారెక్టర్లలో చూడడానికి ప్రేక్షకులు ఇష్టపడరు కూడా. గతంలో కాజల్ అగర్వాల్ కూడా ఈ కోవకే చెందేది. ఐతే పూజా కెరీర్లో తొలిసారిగా డీగ్లామరస్ రోల్ చేయబోతోందని.. ఆమెను ఒక షాకింగ్ క్యారెక్టర్లో రాఘవ లారెన్స్ చూపించబోతున్నాడని వార్తలు వస్తున్నాయి. కాంచన సిరీస్‌లో నాలుగో సినిమా తీయడానికి రాఘవ లారెన్స్ రెడీ అవుతున్న సంగతి తెలిసిందే. ఇందులో పూజా హెగ్డేను కథానాయికగా ఎంచుకున్నాడు. ఆమె ఈ సినిమాలో చెవిటి-మూగ అమ్మాయిగా కనిపించబోతోందనే వార్త ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పూజా లాంటి గ్లామర్ హీరోయిన్ ఇలాంటి పాత్ర చేయడం ఏంటి అని తన ఫ్యాన్స్ అవాక్కవుతున్నారు.




## జూన్ 20న నాగార్జున కుబేర మూవీ..

నాగార్జున, ధనుశ్ కీలక పాత్రల్లో నటిస్తోన్న చిత్రం కుబేర. ఈ సినిమాకు శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో నేషనల్ క్రష్ రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ఏడాది సంక్రాంతికి ఈ సినిమా రిలీజవుతుందని భావించినా అలా జరగలేదు. ఈ సినిమా రిలీజ్ కోసం నాగార్జున ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కుబేర టీమ్ విడుదల తేదీని ప్రకటించింది. ఈ మేరకు స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో నాగార్జున్, ధనుశ్‌తో పాటు బాలీవుడ్ నటుడు జిమ్ షర్బ్ కూడా ఉన్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ నాగ్ అభిమానులను తెగ ఆకట్టుకుంటోంది. రష్మిక హీరోయిన్‌గా నటిస్తుండడంతో ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# పిల్లులకీ బర్డ్ ఫ్లూ.. నెక్ట్స్ మనుషులకేనా?

**భోపాల్ :** ఇప్పటికే యావత్ భారతదేశాన్ని బర్డ్ ఫ్లూ మహమ్మారి భయపెడుతుండగా.. ఇప్పుడు మరో అప్‌డేట్ వచ్చింది. ఈ వైరస్ కేవలం కోళ్లలోనే కాదు.. పిల్లులకూ వ్యాప్తిస్తోందని వైద్యులు నిర్ధారించారు. తాజాగా పిల్లికి బర్డ్ ఫ్లూ సోకిన కేసు మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో వెలుగు చూసింది. పిల్లులలో ఏవియన్ ఇన్‌ఫ్లుఎంజా వైరస్ తొలి కేసు అని నిపుణులు చెబుతున్నారు. పిల్లులకు సోకిన ఈ వైరస్.. మనుషులకు కూడా సోకుతుందేమోనని ఆందోళనలు పెరుగుతున్నాయి.




'%ఎ5చీ%1 క్లాసికల్‌గా ఏవియన్ వైరస్. కానీ కొన్ని ఉత్పరివర్తనలు ఇతర జంతువులు, పక్షుల్లో వ్యాప్తిం చెందడానికి అవకాశాన్ని కల్పిస్తాయి. కోవిడ్-19 మాదిరిగానే.. ఇది కూడా తన ఆకృతి మార్చుకునే అవకాశం ఉన్నందున ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి.' అని పలువురు నిపుణులు చెబుతున్నారు. అయితే, %ICAR-NIHSAD%, కేంద్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ శాస్త్రవేత్తలు.. ఈ జనవరిలో నాగ్‌పూర్ సరిహద్దులో ఉన్న చింద్వారాలో పిల్లులకు బర్డ్ ఫ్లూ సోకిన కేసులను గుర్తించారు. గత సంవత్సరం డిసెంబర్‌లో కూడా కొన్ని పిల్లులు బర్డ్ ఫ్లూ తో మరిణించినట్లు చెబుతున్నారు. శాస్త్రీయ బృందం ఈ వైరస్ 2.3.2.1%ఖ% వంశానికి చెందినదిగా గుర్తించింది. ఇది భారతదేశం అంతటా పౌల్ట్రీలో వ్యాప్తికి కారణమైన %ఎ5చీ%1 కి చెందినదని పేర్కొన్నారు. ఈ వైరస్ సోకిన పిల్లులన్నింటిలో అధిక జ్వరం, ఆకలి లేకపోవడం, నీరసం వంటి లక్షణాలు కనిపించాయని, నమూనా సేకరించిన ఒకటి నుండి మూడు రోజుల్లోపు అవి చనిపోతాయని నిపుణుల అధ్యయనంలో పేర్కొన్నారు. పిల్లులలో కనిపించే వైరస్‌లో 27 ఉత్పరివర్తనలు గుర్తించారు. మానవులతో సహా పెంపుడు జంతువులు, అడవి పక్షులు, క్షీరదాలపై నిఘా అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వైరస్ పక్షులతో పాటు.. జంతువుల్లోనూ విస్తరించడంతో జాగ్రత్త వహరించాల్సిన అవసరం ఉందన్నారు.

వైద్య నిపుణులు ఏమంటున్నారంటే..

'మానవులకు ఈ వైరస్ సోకడం చాలా అరుదు అయినప్పటికీ.. వైరస్ మనుషులకు, మనుషుకు మధ్య వ్యాప్తి చెందేందుకు అనువుగా ఉంటుందనే విషయాన్ని గుర్తించాలి. ప్రస్తుతానికి మనుషులకు ఈ వైరస్ వ్యాప్తి చెందనప్పటికీ.. వైరస్‌లో కొనసాగుతున్న మార్పుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం కనిపిస్తోంది.' అని వైరాలజిస్ట్‌లు చెబుతున్నారు. H5N1 మనుషులకు కొత్త. దానిని ఎదుర్కొనే రోగనిరోధక శక్తి మనుషులకు లేదు. ప్రస్తుతం పక్షుల నుంచి పక్షులకు వ్యాప్తి చెందుతున్న ఈ వైరస్.. మనుషుల నుంచి మనుషులకు వ్యాప్తి చెందేలా పరిణామం చెందితే.. పరిస్థితి ఆందోళనకరంగా ఉంటుంది' అన్నారు.

# మైతీలు వెనక్కి తగ్గారా ?

**ఇంఫాల్ :** మైతీ వర్గానికి చెందిన అరంబై తెంగోల్ సభ్యులు.. మణిపూర్ రాష్ట్ర గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు.. ఇవాళ ఆయుధాలను సరెండర్ చేశారు. ఈనెల 25వ తేదీన గవర్నర్ భల్లాతో జరిగిన మీటింగ్ తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. మణిపూర్‌లో కొన్నాళ్లుగా రెండు తెగల మధ్య ఘర్షణ చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. హింసాత్మకంగా మారిన ఆ ఘర్షణల్లో వందల సంఖ్యల జనం మరణించారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో 104 తుపాకులను, మందుగుండు సామాగ్రిని ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు తెలుస్తోంది. కంగ్‌పోక్పీ, ఇంఫాల్ ఈస్ట్, బిష్ణుపూర్, తౌబాల్, ఇంఫాల్ వెస్ట్, కాక్‌చింగ్ జిల్లాల్లో ఆయుధాలను అప్పగించారు. ప్రభుత్వ దళాల నుంచి అక్రమంగా లూటీ చేసిన ఆయుధాలను వారం రోజుల్లోగా సరెండ్ చేయాలని ఫిబ్రవరి 20వ తేదీన రాష్ట్ర ప్రజల్ని గవర్నర్ కోరారు. ఈ నేపథ్యంలో అరంబై తెంగోల్ గ్రూపు సభ్యులు ఇవాళ ఆయుధాలను అప్పగించారు. ఆయుధాలను సరెండర్ చేసిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం తెలిపింది. తమ షరతులకు అంగీకరిస్తే ఆయుధాలు సరెండర్ చేస్తామని మైతీ గ్రూపు




పేర్కొన్నది. ఆ సంస్థ పీఆర్వో రాబిన్ మాన్‌గంగ్ కవైరక్‌పార్.. గ్రూపు తరపున గవర్నర్‌ను కలిశారు. ఆయుధాల అప్పగింతకు గడవు వెల్లడించలేదు.

గవర్నర్ భల్లాకు అరంబై తెంగోల్ ఓ మెమోరండంను సమర్పించింది. మెజారిటీ మైతీ వర్గానికి ఎస్టీ స్టాటస్ ఇవ్వాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు. మైతీ తెగలకు ఎస్టీ హోదా ఇవ్వాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ.. 2023 మే నెలలో మణిపూర్‌లో భారీ ప్రదర్శన జరిగింది. ఆ తర్వాత ఆ రాష్ట్రంలో ఊచకోత ప్రారంభమైంది. కుక్కీ గిరిజనుల్ని నిర్దాక్షిణ్యంగా చంపినట్లు అరంబై తెంగోల్‌పై ఆరోపణలు వచ్చాయి. మణిపూర్‌లో హింస చోటుచేసుకున్న సమయంలో.. అరాచక శక్తులు .. పోలీసు స్టేషన్లు, ఔట్ పోస్టుల వద్ద ఉన్న ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. లూటీ అయిన ఆరు వేల ఆయుధాల్లో ఇప్పటి వరకు 2500 ఆయుధాలు మాత్రమే సరెండర్ చేశారు. రెండు వర్గాల హింసలో 260 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 60 వేల మంది నిరాశ్రయులయ్యారు. మైతీలు హిందూ కులస్థులు. వాళ్లు ఎక్కువ శాతం ఇంఫాల్ లోయ ప్రాంతాల్లో నివసిస్తుంటారు. కుక్కీల్లో ఎక్కువ శాతం క్రైస్తవులు ఉన్నారు. వాళ్లు కొండల్లో జీవిస్తుంటారు. అయితే రెండు వర్గాల ప్రజల మధ్య ఇప్పుడు బలోపేతమైన బఫర్ జోన్లను ఏర్పాటు చేశారు

# ఏర్పాట్ల విషయంలో లోపాలుంటే క్షమించాలి

**న్యూఢిల్లీ:** మహా కుంభమేళా సందర్భంగా పూజల్లో ఏదైనా లోపం ఉంటే గంగా, యమునా, సరస్వతి మాతలు క్షమించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రార్థించారు. అలాగే, ఏర్పాట్ల విషయంలో లోపాలున్నా, భక్తులెవరైనా అసౌకర్యానికి గురైనా మన్నించాలని కోరారు. మహా శివరాత్రి పండుగ రోజున కుంభమేళా ముగిసింది. 45 రోజుల పాటు జరిగిన ఈ ప్రపంచ అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకలో 66 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కుంభమేళా ముగిసిన నేపథ్యంలో నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. భారతీయుల ఐక్యతకు ఈ కుంభమేళా నిదర్శనంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల నుండి కూడా భక్తులు తరలి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారని తెలిపారు. ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా ముగించడం సులువైన విషయం కాదని ఆయన అన్నారు. అన్ని సవాళ్లను అధిగమించి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిందని ప్రశంసించారు. ఈ ప్రపంచ అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి, ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. 'మహా కుంభమేళా పరిపూర్ణమయ్యింది. ఏకత్వాన్ని చాటే ఈ మహాయజ్ఞం సుపంపన్నమయ్యింది. 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళా 140 కోట్ల దేశ ప్రజల ఆధ్యాత్మిక చింతనకు ఆలంబనగా నిలిచింది. ఇంతటి భారీ కార్యక్రమంలో తాము భక్తులకు సేవలు అందించడంలో విఫలమైతే క్షమాపణలు' అని ప్రధాని మోదీ మహాకుంభ్ ముగిసిన సందర్భంగా తన బ్లాగ్‌లో రాశారు.

**ఐక్యతకు ప్రతీక**

మహాకుంభ్‌కు సంబంధించి మోదీ ఈ బ్లాగ్‌లో పలు విషయాలు ప్రస్తావించారు. 2024, జనవరి 22న తాను అయోధ్యలోని రామాలయం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో దేవుని భక్తితో కూడిన దేశభక్తి గురించి మాట్లాడానని బ్లాగ్ మొదట్లో ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళాకు దేవుళ్లు, దేవతలు తరలివచ్చారు. సాధువులు, మహాత్ములు, పిల్లలు, వృద్ధులు, మహిళలు, పురుషులా ఇలా అందరూ కలసివచ్చారు. కుంభమేళా నేపథ్యంలో దేశంలోని చైతన్యశక్తిని మనమంతా చూశాం. ఈ మహా కుంభమేళా ఐక్యతకు ప్రతీక. ఈ పండుగ 140 కోట్ల దేశవాసుల నమ్మకానికి ఆలంబనగా నిలిచిందని ప్రధాని పేర్కొన్నారు.



**ఆశ్చర్యపోయిన ప్రపంచం**

గత 45 రోజులుగా ప్రతిరోజూ, దేశంలోని ప్రతి మూల నుండి లక్షలాది మంది సంగమతీరం వైపు ఎలా కదులుతున్నారో చూశాను. గంగా, యమున, సరస్వతి నదుల సంగమంలో స్నానం చేస్తున్నప్పుడు ప్రతి భక్తునిలోనూ ఉత్సాహం శక్తి, విశ్వాసం తొణికిసలాడింది. ప్రయాగ్‌రాజ్ లో జరిగిన ఈ మహా కుంభమేళా ఆధునిక యుగంలోని విధాన నిపుణులకు ఒక కొత్త అధ్యయన అంశంగా మారింది. యావత్ ప్రపంచంలో ఇంత పెద్ద ఉత్సవం ఎక్కడా జరగనే లేదు. దీనికి సమానమైన ఉదాహరణ మరొకటి లేదు. ఒకే నది ఒడ్డున, త్రివేణి సంగమం తీరంలో కోట్లాది మంది స్నానం చేయడాన్ని చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది. ఈ కోట్లాది మందికి అధికారిక ఆహ్వానం లేదు.. ముందస్తు సమాచారం కూడా లేదు. అయినా మహా కుంభమేళాకు తరలివచ్చారు. పవిత్ర సంగమంలో స్నానం చేసి గంగామాత ఆశీర్వాదాలు అందుకున్నారు. వీటికి సంబంధించిన దృశ్యాలను ఎప్పటికీ మరిచిపోలేను. సంతృప్తితో నిండిన ఆ భక్తుల ముఖాలే నిత్యం కనిపిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

**కొత్త రికార్డులు**

మహా కుంభమేళాలో స్నానం చేసేందుకు ప్రయాగ్‌రాజ్‌కు తరలివస్తున్నవారి సంఖ్య కొత్త రికార్డులను సృష్టించింది. కుంభమేళా నుండి తిరిగి వెళ్లినవారు వారితో పాటు ఈ పుణ్య జలాలను తమ ప్రాంతాలకు తీసుకువెళ్లి, లక్షలాది మంది చేత కుంభస్నానం చేయించారు. ఇది గత కొన్ని దశాబ్దాలలో ఇంతకు ముందెన్నడూ జరగని ఉదంతం. ప్రయాగ్‌రాజ్‌కు ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. అధికారులు మునుపటి కుంభమేళా అనుభవాల ఆధారంగా నూతన ప్రణాళికను రూపొందించారు. అమెరికా జనాభాకు దాదాపు రెట్టింపు జనాభా ఈ ఐక్యతా కుంభమేళాలో పాల్గొని స్నానాలు చేశారు.

దేశంలోని ప్రతీ భక్తుడూ భాగస్వామి

ఈ మహా కుంభమేళా భారతదేశ జాతీయ చైతన్యాన్ని బలోపేతం చేసింది. 144 ఏళ్ల తర్వాత జరిగిన ఈ మహా కుంభమేళా భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఇది అభివృద్ధి చెందిన భారతదేశం అందించిన సందేశంగా నిలిచింది. దేశంలోని ప్రతి భక్తుడు ఈ మహా యాగంలో భాగస్వామి అయ్యాడు. భారతదేశం అందించిన ఈ మరపురాని దృశ్యం కోట్లాది మందిలో ఆధ్మాత్మికతను పెంపొందించింది. నాడు బాలుడి రూపంలో శ్రీకృష్ణుడు తన తల్లి యశోదకు తన నోటిలో విశ్వాన్ని చూపించాడు. అదేవిధంగా ఈ మహా కుంభ్ ప్రపంచానికి భారతీయులు అపార శక్తి రూపాన్ని చూపింది.

## ఎడతెగని హిమపాతం.. స్కూళ్లు, కాలేజీలు మూసివేత




**సిమ్లా:** హిమాచల్ ప్రదేశ్‌ను హిమపాతం ఇంకా వీడటం లేదు. లాహౌల్ స్పితి జిల్లాలో ఎడతెగని రీతిలో భారీగా మంచు కురుస్తోంది. మిగిలిన ప్రాంతాల్లో గత రెండు రోజుల నుంచి అడపాదడపా ఇదే పరిస్థితి ఏర్పడుతోంది. భారీగా మంచు పడుతున్న నేపథ్యంలో లాహౌల్ స్పితి జిల్లాలోని పాఠశాలలు, విద్యాసంస్థలను మూసివేయాలని రాష్ట్ర విద్యాశాఖ అదేశాలు జారీ చేసింది. గడచిన మూడు రోజులుగా లాహౌల్ స్పితిలో హిమపాతం కురుస్తోంది. నేడు (గురువారం) సిమ్లాలో తేలికపాటి వర్షం కుర్తుస్తోంది. మీడియాకు అందిన సమాచారం ప్రకారం మనాలి సమీపంలోని ధుండిలో కొండచరియలు విరిగిపడిన కారణంగా, లేహ్ మనాలి హైవేను మూసివేశారు. దీంతో మనాలిలోని సోలాంగ్ వ్యాలీని దాటి ముందుకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. అటల్ టన్నెల్ దక్షిణ, ఉత్తర పోర్టల్‌లలో రెండు అడుగుల ఎత్తున మంచు పేరుకుపోయింది. ఇటువంటి పరిస్థితిలో స్థానికులు తమ ఇళ్లలోనే ఉండాలని, బయటకు రావద్దని అధికారులు సూచించారు. ధర్మశాలలో భారీ వర్షం కారణంగా పోలీసు నియామక ప్రక్రియను మార్చి 9కి వాయిదా వేశారు. వాతావరణ శాఖ(%వీవవశీతీశీశ్రీశీస్త్రఱఛ్చీశ్రీ ణవజూaతీఎవత్%) తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రోహ్తాంగ్ పాస్ వద్ద దాదాపు రెండున్నర అడుగుల మేరకు మంచు కురిసింది. ఈ కారణంగా ఫిబ్రవరి 19 నుండి లాహౌల్ స్పితికి హెచ్‌ఆర్‌టీసీ బస్సు సర్వీసులను నిరవధికంగా నిలిపివేశారు. ఫిబ్రవరి 26- 28 మధ్య భారీ వర్షాలు/హిమపాతం సంభవించే అవకాశం ఉన్నందున హిమాచల్ ప్రదేశ్‌లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

## పాకిస్థాన్‌కు అంత సీన్ లేదు



జమ్మూకశ్మీర్ లో ప్రజాస్వామ్యం అణచివేతకు గురవుతోందంటూ పాకిస్థాన్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు జెనీవాలో జరిగిన ఐక్యరాజ్యసమితి (ఐరాస) మానవ హక్కుల మండలి సమావేశంలో పాక్ ప్రతినిధి, ఆ దేశ మంత్రి అజం నజీర్ ఈ వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆయన ఆరోపించారు. దీనిని తీవ్రంగా ఖండించిన భారత రాయబారి క్షితిజ్ త్యాగి.. ప్రజాస్వామ్యం విషయంలో భారత్ కు చెప్పేంత సీన్ పాక్ కు లేదని కొట్టిపారేశారు. అంతర్జాతీయ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ నీతి వాక్యాలు వల్లించడం మానుకోవాలని హితవు పలికారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాద కార్యకలాపాల వల్ల దశాబ్దాలుగా దెబ్బతిన్న జమ్మూకశ్మీర్, లద్దాఖ్ లలో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చేందుకు భారత ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని క్షితిజ్ త్యాగి చెప్పారు. ఆ రెండు కేంద్రపాలిత ప్రాంతాలు ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని తేల్చిచెప్పారు. మానవ హక్కుల ఉల్లంఘనకు, మైనారిటీలపై వేధింపులకు పేరొందిన పాకిస్థాన్ ఈ విషయంలో ఉపన్యాసాలు ఇవ్వడం హాస్యాస్పదమని అన్నారు. భారత్ కే కాదు మరే దేశానికీ సలహాలు ఇచ్చే స్థాయి పాకిస్థాన్ కు లేదన్నారు. భారత్ పై అర్థంపర్థంలేని ఆరోపణలు చేయడం మానేసి తమ దేశంలో పరిస్థితిని చక్కదిద్దడంపై, ప్రజలకు సుపరిపాలన అందించడంపై దృష్టిపెట్టాలని త్యాగి హితవు పలికారు.

## అలాంటి వారిని ఉరితీయాలి.. పూణే దారుణంపై డిప్యూటీ సీఎంలు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్

**ముంబై:** మహారాష్ట్ర పూణేలోని ఓ పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో దారుణం జరిగింది. నిలిపి ఉన్న బస్సులో నిందితుడు.. యువతిపై దారుణానికి ఒడిగట్టాడు . ఈ దుర్ఘటనపై మహారాష్ట్ర అధికార శివసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ అధినేత డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌లు ఈ తరహా దారుణాలకు పాల్పడే నిందితుల్ని ఉరితీయాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. బస్సులో జరిగిన దుర్ఘటనపై మహారాష్ట్ర బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ తరుణంలో శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గానికి చెందిన పార్టీ నేతలు గురువారం స్వర్‌గేట్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన బాట పట్టారు. మహా ప్రభుత్వం మహిళల భద్రత కంటే ఉచితాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ తరుణంలో బస్సు దుర్ఘటనపై ఏక్‌నాథ్ షిండే స్పందించారు. పుణే ఘటన చాలా దురదృష్టకరం. నిందితులు ఎవరైనా ఉపేక్షించబోం. అలాంటి వారిని ఉరితీయాలి'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు అజిత్ పవార్ సైతం దారుణంపై మీడియాతో మాట్లాడారు. స్వర్గేట్ బస్ స్టేషన్‌లో జరిగిన అత్యాచార ఘటన అత్యంత దురదృష్టకరం, బాధాకరం, అవమానకరమైనది. నిందితుడు చేసిన నేరం క్షమించరానిది. ఇలాంటి నేరస్తులకు మరణశిక్ష తప్ప మరొకటి ఉండదు. దారుణంపై సమాచారం అందుకున్న వెంటనే నిందితుల్ని అరెస్ట్ చేయాలని పూణే పోలీసు కమిషనర్‌ను ఆదేశించినట్లు చెప్పారు.

**ఇంటికి వెళ్లేందుకు.. బస్సు కోసం ఎదురు చూస్తూ**

పూణేలోని నిత్యం రద్దీగా ఉండే స్వర్గేట్ బస్టాండ్‌లో యువతిపై నిందితుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. సతారా జిల్లాలోని ఫల్తానా ప్రాంతానికి చెందిన యువతి మంగళవారం తెల్లవారుజామున పోలీస్ స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలో ఉన్న స్వర్గేట్ బస్టాండ్‌లో బస్సు కోసం వేచిచూస్తోంది. అసలే ఆలస్యం అవుతుంది. బస్సులు కనిపించడం లేదని యువతి ఆందోళనకు గురైంది. ఆ సమయంలో బాధితురాలికి సమీపంలో దత్తాత్రేయ రాందాస్ గాడే (36) కనిపించాడు. బస్సులు రాకపోకల గురించి ఆరా తీసింది. సమీపంలో ఓ ఉన్న బస్సును చూపిస్తూ.. ఆ బస్సు మీ ఊరు వెళుతుందని నమ్మించే ప్రయత్నించాడు. ప్లాట్‌ఫారమ్ మీదకు రావాల్సిన బస్సు ఆక్కడ ఎందుకు ఆగి ఉంది? ఆగి ఉంటే లైట్లు ఎందుకు ఆర్పేశారు? అని ఇలా ప్రశ్నించింది. దీంతో గాడే.. బస్సులో ప్రయాణికులు ఉన్నారని, అందరూ నిద్రలో ఉండడం వల్ల లైట్లు ఆర్పేశారు. కావాలంటే మీరే చూడండి అంటూ యువతిని నమ్మించాడు. గాడే మాటల్ని నమ్మిన యువతి బస్సు దగ్గరికి వెళ్లింది. ప్రయాణికులు ఉన్నారా? లేరా? అని చూసేందుకు బస్సు డోర్ ఓపెన్ చేసింది.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.